
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
కడప
: fb.com/vaartha Digital
Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
15-11-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 284 పేజీలు: 10+4 వెల: 6.50



SHOWROOMS: ANDHRA PRADESH: RENAULT KURNOOL Ph: 8527234838. RENAULT ONGOLE Ph: 9582547709.



శుక్రవారం విశాఖలో సీఎం చంద్రబాబుతో భేటీ అయిన రిలయన్స్ ప్రతినిధి

# ఎపిలో భారీ పెట్టుబడులకు రిలయన్స్ గ్రీన్ సిగ్నల్

## సిఎం చంద్రబాబుతో భేటీలో కీలక నిర్ణయం

విశాఖపట్నం, నవంబరు 14 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్‌లో భారీ పెట్టుబడులు పెట్టేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ ముందుకొచ్చింది. విశాఖ నగరంలో సిఐఐ భాగస్వామ్య సదస్సు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో రిలయన్స్ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ భేటీ అనంతరం రాష్ట్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా సెంటర్, సోలార్ పవర్ ప్లాంట్, గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ ఫుడ్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎంఎస్ ప్రసాద్, ఆర్‌ఐఎల్ సౌతిండియా మెంటార్ మాధవరావు ముఖ్యమంత్రితో భేటీ అయి రాష్ట్రంలో పెట్టుబడులపై కీలక అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా 1 గిగావాట్ సామర్థ్యంతో ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన జీపీయులు, టీపీయులు, ఏఐ ప్రాసెసర్‌లతో కూడిన ఏఐ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న రిలయన్స్ ఏఐ డేటా సెంటర్‌కు అనుబంధంగా ఏపీలో ఈ సెంటర్ పనిచేస్తుంది. ఈ రెండు కేంద్రాలతో ఆసియాలోనే అత్యంత బలమైన ఏఐ నెట్‌వర్క్‌లో ఒకటిగా రిలయన్స్ అవతరించనుంది. ఈ ఏఐ డేటా సెంటర్ విద్యుత్ అవసరాల కోసం రాష్ట్రంలో రిలయన్స్ 6 గిగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును కూడా నిర్మించనుంది. దీంతో పాటు కర్నూలులో 170 ఎకరాల్లో ప్రపంచ స్థాయి ఆటోమేటెడ్ సౌకర్యాలతో గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ ఫుడ్ పార్క్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ భారీ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. రాష్ట్రంపై నమ్మకంతో భారీ పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చిన రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీకి ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

# ఎపిలో పెట్టుబడులకు ఇదే తరుణం

>> ఉన్నప్పుడు చంద్రబాబు హైదరాబాద్‌ను గ్లోబల్ ఐటీ కేంద్రంగా తీర్చిదిద్దారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా ఏపిని అభివృద్ధి చేయడంలో ఆయన శ్రద్ధ చూపిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను సాధించడానికి చంద్రబాబు పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులను ఒప్పిస్తున్నారు. విశాఖలో నిర్వహిస్తున్న పెట్టుబడుల సదస్సు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను. దేశం, రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసి పనిచేస్తున్నాయి. జీఎస్టీ సంస్కరణలు, మౌలిక సదుపాయాల కల్పన వంటివి దేశాభివృద్ధికి దోహదం చేస్తున్నాయి. ఫుడ్ ప్రాసెసింగ్, బ్లూ, అగ్రి ఎకానమీ ఇలా వేర్వేరు రంగాల్లో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఏపీలో ఉన్నాయి. వచ్చే రెండు మూడేళ్లలో 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలుస్తుంది. అలాగే అతిపెద్ద స్టార్టప్ ఎకో సిస్టంగానూ భారత్ ఎదుగుతుంది. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పాదనతో ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధిస్తాం. ప్రతీ దేశంతోనూ భారత్ మైత్రినే కోరుకుంటుంది. అంతా కలిసి ఎదుగుదాం అనే భావన భారతదేశానిది. ఇతరులకు నష్టం కలిగించటం కాదు, సహకారం పరస్పర సహకారం ద్వారా అభివృద్ధి సాధించాలనేది భారత్ సిద్ధాంతం అని ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ అన్నారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తూ 30వ సిఐఐ భాగస్వామ్య సదస్సుకు 8వ సారి ఆంధ్రప్రదేశ్ ఆతిథ్యం ఇస్తోంది. ఫ్యూచర్ రెడీ ఇన్నొవేషన్ రాష్ట్రంగా ఏపిని ముఖ్యమంత్రి చంద్రబాబు తీర్చిదిద్దుతున్నారు. ఈ సదస్సు ద్వారా ప్రతీ ఆలోచనా, ప్రతీ పెట్టుబడి భవిష్యత్ తరాలకు సంపదగా మారాలని కోరుతున్నా అని ఏపీ గవర్నర్ అన్నారు. కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ఈ ప్రారంభోత్సవ సదస్సులో పాల్గొన్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ ఏపీ అభివృద్ధి గురించి మాత్రమే కాదు యావత్ భారత దేశం అభివృద్ధి గురించి సీఎం చంద్రబాబు ఆలోచిస్తారు. విజనరీ సీఎం చంద్రబాబు ఉన్న ఏపీలో పుట్టిన ప్రతీ బిడ్డా అదృష్టవంతుడే... వారి భవిష్యత్ అంతా ఉజ్వలమైందే. గ్లోబల్ ట్రేడ్ గేట్ వేగా విశాఖ నిలుస్తోంది. 2047 స్వర్ణాంధ్ర విజన్‌తో ఏపీ సాంకేతికంగా, ఆర్థికంగా బలోపేతం అవుతుంది. 2047 నాటికి సుసంపన్నమైన దేశంగా భారత్ అవతరిస్తుంది. 30 బిలియన్ డాలర్ల విలువైన పెట్టుబడులతో సెమీ కండక్టర్ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నాం. 104 శాటిలైట్లను ఒకేసారి అంతరిక్షంలోకి పంపిన దేశంగా సాంకేతికతను ప్రజలకు దగ్గర చేస్తున్నాం. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ఆ దిశగా పనిచేస్తున్నాం. ఇంజినీరింగ్ నైపుణ్యాలు ఉన్న భారత యువత ప్రపంచ వ్యాప్తంగా సేవలు అందిస్తున్నారు. కోవిడ్ సమయంలో 110 దేశాలకు వ్యాక్సిన్ సరఫరా చేసి భారతీయ భావన వసుధైక కుటుంబం అనే విషయాన్ని నిరూపించాం. అత్యంత పారదర్శకమైన విధానంలో వాణిజ్యం ఉండాలని మేం కోరుకుంటున్నాం. బీహార్ ఎన్నికల ఫలితాలు కూడా వచ్చాయి. ప్రధాని మోదీపై ప్రజలు విశ్వాసం ఉంచారు అనడానికి ఈ ఫలితాలే నిదర్శనం. ప్రధాని మోదీపై నమ్మకం ఉంచి, ఎన్డీఏకు పట్టం కడుతున్న బీహార్ ప్రజలకు ధన్యవాదాలు తెలియచేస్తున్నా అని కేంద్ర మంత్రి పీయూష్ అన్నారు. ఈ సదస్సులో పాల్గొన్న కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ వంటి వారు ఏపీలో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు వంటి విజనరీ లీడర్ల నేతృత్వంలో భారత దేశం, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా ముందడుగు వేస్తున్నాయని అన్నారు. గత కొన్ని నెలలుగా ఎపిలో కీలకమైన మౌలిక సదుపాయాల కల్పన వేగంగా జరుగుతోందని వివరించారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణం అవుతున్నాయని ప్రస్తుతం 7 ఆపరేషన్ ఎయిర్ పోర్టులు ఉంటే కొత్తగా మరో 7 ఎయిర్ పోర్టులు నిర్మాణం చేస్తామని, ఏరోస్పేస్, ఎయిర్ క్రాఫ్ట్ తయారీని కూడా ఎపికి తీసుకువస్తామని రామ్మోహన్ నాయుడు చెప్పారు. ఇక మరో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ పారిశ్రామిక యూనిట్ల ఏర్పాటుతో పాటు అతిపెద్ద మార్కెట్‌కు పారిశ్రామికవేత్తలను, కంపెనీలను చేరువ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని చెప్పారు. వివిధ రంగాల్లోని పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ నమ్మకమైన భాగస్వామిగా ఉంటుందన్నారు. అగ్రికల్చర్ నుంచి ఏరో స్పేస్ వరకూ వివిధ రంగాల్లో పెట్టుబడులు, యూనిట్లు ఎపికి వస్తున్నాయని పెమ్మసాని చెప్పారు.

# పరిశ్రమలకు వేగంగా అనుమతులు

>> నగరం. భారత్‌లో పెట్టుబడులకు గేట్ వేగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తోంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షించటంలో భారత్ ఇప్పుడు అగ్రగామిగా ఉంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో ఏపీలో పరిశ్రమలకు అనుమతులు ఇస్తున్నాం. రియల్ టైమ్‌లో అనుమతులు ఇవ్వటంతో పాటు వేగంగా పరిశ్రమలు నిర్మించేలా చూస్తున్నాం. పది సూత్రాల ఆధారంగా పెట్టుబడులకు ప్రోత్సాహం కల్పిస్తున్నాం."అని ముఖ్యమంత్రి వెల్లడించారు. కేవలం 17 నెలల కాలంలో 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. 20 లక్ష ఉద్యోగాలు కూడా దక్కుతాయి. ప్రస్తుతం 0.5 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు 50 లక్షల ఉద్యోగాలు లక్ష్యంగా ఏపీపనిచేస్తుంది. వచ్చే పదేళ్లలో 1 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షిస్తామనే విశ్వాసం మాకుంది. ప్రధాని మోదీపై ప్రజలు పూర్తిస్థాయిలో నమ్మకం ఉంచారు. బీహార్ ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారు. అందుకే ఎన్డీఏకు మళ్లీ అవకాశం ఇచ్చారు అని ముఖ్యమంత్రి అన్నారు.

# రాష్ట్ర ఆతిథ్యం గర్వకారణం

>>వేస్తుందో, ప్రభుత్వాలు కూడా అంతే వేగంతో స్పందించాలని వారు కోరుకుంటున్నారు. భూమి కేటాయింపులు దగ్గరనుంచి అనుమతులు, ఆమోదాలు, ప్రోత్సహకాలు ఇవన్నీ ప్రాజెక్ట్ ప్రారంభమయ్యేలోగా మంజూరు చేయాలి. మూడో కారణం.. ఏపీలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉంది. గౌరవనీయులైన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, గౌరవనీయ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో వ్యాపారాన్ని విజయవంతం చేయడంతో పాటు అవసరమైన సంస్కరణలు, విధాన మార్పులను తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిదుతామని ఈ సందర్భంగా మంత్రి అన్నారు.

# విశాఖలో 21న శాసనసభ కమిటీ సమావేశం

**విజయవాడ, నవంబరు 14(ప్రభాతవార్త)ప్రతినిధి:** సమగ్ర భూసర్వే తదితరఅంశాలపై వచ్చిన పిటీషన్లపై శాసనసభ కమిటీ సమావేశం ఈ నెల 21వ తేదీ శుక్రవారం ఉదయం 11.00 గంటలకు విశాఖ పట్నంలో నిర్వహించబడుతుందని శాసన సభ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ఈ సమావేశంలో చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్ మోహన్ కమిటీకి సమర్పించిన సమగ్ర భూసర్వే పిటీషన్‌పై చర్చ జరుగుతుందని ఆయన తెలిపారు. సమగ్ర భూసర్వే గతంలో పలు అక్రమాలు చోటు చేసుకున్నట్లు గత నెల్లో జరిగిన శాసనసభ సమావేశాల్లోను ఆరోపించారు. ఆయా అంశాలపై ఫిర్యాదులను శాసనసభ కమిటీకి పిటిషన్ రూపంలో అందించాలని ఏపీ శాసనసభా స్పీకరు అయ్యన్న పాత్రుడు ఆదేశించారు. ఈ దశలో చిత్తూరు శాసన సభ్యులు గురజాల జగన్ మోహన్ పిటిషన్ దాఖలు చేసారు. దీంతో పాటు భూసర్వే అంశాలపై శాసనసభా కమిటీ చర్చ జరుపుతుంది. పలు ఇతరఅంశాలపైన విచారణ నిర్వహిస్తుంది.

**17న హౌస్ కమిటీ సమావేశం:** ఆప్కాబ్, డీసీసీబీ, పీఏసీఎస్ లో 2019-2024 మధ్య చోటు చేసుకున్నట్లుగా ఆరోపించబడుతున్న అవినీతి, అక్రమాలపై దర్యాప్తు చేయడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక హౌస్ కమిటీ సమావేశం ఈ నెల 17 వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటలకు వెలగపూడి అసెంబ్లీ భవనాల కమిటీ హాల్-1 లో నిర్వహించబడుతుందని శాసన సభ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర ఒక ప్రకటనలో తెలిపారు.

# కీలక అధికారి అనుమానాస్పద మృతి

>> లకు వివరించారు. పెద్దఎత్తున పోలీ సులు మొహరించి జాగిలాలు, క్లూస్ టీమ్‌లతో సంఘటనా స్థలాన్ని జల్లెడపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగిం చిన పరకామణి చోరీ కేసులో మృతుడు సతీష్ కీలక అధికారి కావ డంతో పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి క్షుణ్ణంగా పరిశీలించారు. సతీష్ మృతదేహం కింద పడిన చోట నుంచి 200అడుగుల దూరంలో పడిపోవడం, ప్రయాణీకులు ఎవ రూ చైను లాగి రైలు ఆపకపోవడం పట్ల కుటుంబ సభ్యులు అను మానాలు వ్యక్తం చేశారు. ప్రధాన కేసులో కీలక అధికారిగా ఉం డటంతో సతీష్‌కుమార్ మృతి రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిదర్యాప్తుచేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

**ప్రయాణం..మరణం మధ్యలో ఏమి జరిగిందోనని విచారిస్తున్నాం: శ్రీనివాసులు ఆచారి, రైల్వే డీఎస్పీ, గుంతకల్లు:** తిరుపతిలో నేడు జరగనున్న సీఐడీ విచారణకు హాజరవడానికి గుంతకల్లులో టికెట్ తీసుకొని రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేసిన సతీష్‌కుమార్ మధ్యలో మరణించడం వెనుక ఏమి జరిగిందోననే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. పలువిషయాలు విచారణలోనే ఉన్నాయి. పూర్తి విచారణ తర్వాత అన్ని విషయాలు నిర్ధారించుకొని వెల్లడిస్తాం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తాం. దర్యాప్తు కొనసాగుతున్నందున కూలంకుషంగా విచారించిన తర్వాతనే పూర్తి వివరాలు వెల్లడిస్తాం.

**ఉద్దేశపూర్వకంగా చేసిన హత్యగానే భావిస్తున్నాం: హరి, ఎస్పై సోదరుడు, ప్యాపిలి:**

ఇలాంటి దారు ణమైన పరిస్థితి మా సోదరునికి ఎదురవు తుందని ఊహించలేదు. ఇలాంటి పరిస్థితి నిజాయితీగా పనిచేసే ఏ అధికారికి కూడా రాకూ డదు. మా ఏ అధికారి సమాచారం ఇవ్వలేదు. మీడియా ద్వారానే తెలుసుకుని ఇక్కడికి వచ్చాం. ఇది ఉద్దేవపూర్వకంగా చేసిన హత్యగానే మేము భావిస్తున్నాం. ఎవరికి ఎలాంటి హాని చేయని, చాలా వరకు సర్దుబాటు మనస్తత్వం ఉన్న వ్యక్తి మా సోదరుడు. పరకామణి చోరీ కేసుకు సంబంధించి అప్పట్లో అధికారులు ఒత్తిడి తెచ్చి లోక్‌అదాలత్‌లో రాజీచేయించి మా సోదరున్ని బలి తీసుకున్నారు. ఆ తర్వాత ఏ అధికారి కూడా మా సోదరుని పరిస్థితిని పట్టించుకోలేదు. పూర్తి విచారణ చేపట్టి మా సోదరునికి న్యాయం చేయాలి. మా సోదరుడు ఆత్మహత్య చేసుకునేం త పిరికివాడు కాదు. పోలీసులకే రక్షణ కరవైతే ఎలా..?

# సిఐ సతీశ్‌కుమార్ మృతి వెనుక కుట్ర?

**తిరుపతి,నవంబర్ 14ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి భక్తులు మొక్కుబడులుగా సమర్పించుకున్న కోట్ల రూపాయలు విలువైన విదేశీకరెన్సీని తిరుమల పరకామణి నుండి చోరీ చేసిన కేసు విచారణ వేగంగా జరుగుతున్న సమయంలో ఫిర్యాదిదారుడు ,మాజీ ఏవిఎస్ఒ వై.సతీశ్‌కుమార్ మృతి వెనుక అన్నీ అనుమానాలే వ్యక్తమవుతున్నాయి. కీలక వ్యక్తిగా వున్న పోలీస్ అధికారి అనుమానాస్పదంగా అనంతపురంజిల్లా తాడిపత్రి సమీపంలోని కోమలి రైల్వేట్రాక్ పక్కన విగతజీవిగా మారడం టిటిడిలో కలకలం రేపుతోంది. సతీశ్‌కుమార్ మృతి పెద్దలపాపపు ఆటలో ఓ ఘట్టంగా అభివర్ణిస్తున్నారు. ఏఆర్ పోలీసువిభాగానికి చెందిన ఆయన ప్రస్తుతం గుత్తి ప్రభుత్వ రైల్వేపోలీస్‌శాఖలో (జిఆర్‌పి)సిఐగా విధులు నిర్వహిస్తున్నారు. పరకామణి చోరీ కేసును హైకోర్టు ఆదేశాల మేరకు సిఐడి బృందం తిరుపతిలో విచారణ సాగిస్తోంది. తొలివిడతగా ఈనెల 6వతేదీ సతీశ్‌కుమార్ విచారణకు హాజరై చోరీ కేసుకు సంబంధించి, తదనంతరం లోక్‌అదాలత్‌లో రాజీకుదుర్చుకున్న పరిణామాలు వరకు విషయాలు వెల్లడించారు. దర్యాప్తు కీలకదశలో భాగంగా శుక్రవారం విచారణకు గుత్తినుండి రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైల్లో ప్రయాణిస్తుండగా ఆయన అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన జరగడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ ఘటనపై ఇప్పటికే ఆయన కుటుంబసభ్యులు, బంధువులు కూడా హత్యచేశారనే ఆరోపణలు అనంతపురం జిల్లా పోలీసుఅధికారులకు వెల్లడించారు. దీనివెనుక కుట్ర ఉందనేది తెలిపారు. ఈ నేపథ్యంలో సతీశ్‌కుమార్ మృతితో పరకామణి చోరీ కేసు ఏ మలుపుతిరుగుతుందోననేది టిటిడిలో మరింత ఉత్కంఠరేపుతోంది.

**కీలక ఫిర్యాదిదారుడు మృతి వెనుక కుట్రేనా!?:** తిరుమల పరకామణిలో 2023 ఏప్రిల్‌లో రవికుమార్ అమెరికన్ డాలర్లను 920చోరీ చేశాడు. ఆ సమయంలో పరకామణి భవనంలో విదుల్లో ఉన్న విజిలెన్స్ విభాగం ఏవిఎస్ఒ వై.సతీశ్‌కుమార్ సిసికెమెరా పుటేజీ ఆధారంగా అక్కడికక్కడే పట్టుకుని తిరుమల వన్‌టౌన్ పోలీసులకు అప్పగించాడు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి 41ఎ నోటీసులతో వదలిపెట్టారు. ఈ కేసు ఆ తరువాత న్యాయస్థానం వరకు చేరింది. రెండునెలలకు అనూహ్యంగా లోక్‌అదాలత్‌లో ఈ కేసును సతీశ్‌కుమార్ రాజీచేసుకున్నాడు. అప్పటి టిటిడి బోర్డు పెద్దలు, కొందరురాజకీయనాయకులు, టిటిడి ఉన్నతాధికారుల నుండి ,అప్పటి సివిఎస్ఒ నుండి వచ్చిన ఒత్తిడితోనే ఆయన రాజీచేసుకున్నారనేది ప్రధాన ఆరోపణలు. రవికుమార్ కూడగట్టిన ఆస్తులను 14కోట్లవిలువైనవి శ్రీవారికి కానుకగా సమర్పించడం వరకు జరిగిపోయింది. బహిరంగ మార్కెట్లో 80కోట్లు రూపాయలు విలువచేసేవని సిఐడి సమాచారం. రాజీ జరగడంతో భక్తుల కానుకలు, దేవుని సొమ్మును వాటాలుగా పంచుకున్నారనే ప్రధాన ఆరోపణపై కొందరు హైకోర్టును ఆశ్రయించారు. కేసు విచారణకు రావడంతో సిఐడి డిజి రవిశంకర్‌అయ్యన్నార్ నృత్వంలోని బృందం తిరుపతిలోనే ఉంటూ దర్యాప్తును వేగవంతం చేసింది. విచారణ ప్రస్తుతం కీలక దశకు చేరుకుంటున్న సమయంలో రెండవ విడత విచారణకు కేసులో అత్యంత ముఖ్యమైన వ్యక్తి సతీశ్‌కుమార్ రైల్లో వస్తుండగా రైల్వేట్రాక్ పక్కన మృతదేహంగా మారడం వెనుక కుట్ర కోణం ఉండవచ్చనేది టిటిడి వర్గాల్లోనూ పోలీస్‌శాఖలోనూ, ప్రజాసంఘాలు అనుమానిస్తున్నారు. ఈఘటనతో పరకామణి కేసులో ఇక టిటిడి మాజీ సివిఎస్ఒ, విజిఒ, ఇద్దరు సిఐలు, ఎస్ఐ కీలకంగా మిగిలారు. మరీ పరకామణి చోరీ కేసులో పెద్ద ట్విస్ట్ నెలకోనడంతో ఇప్పుడు నిందితుడు రవికుమార్‌తోబాటు విచారణ ఎదుర్కొంటున్న సిఐలకు భద్రత కల్పించాల్సి న అవసరం ఉందనేది టిటిడిలో వ్యక్తమవుతోంది. మరీ ఆయన మృతి వెనుక కుట్ర దాగివుందనేది అన్ని వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది.

## వారం - వర్జ్యం

15-11-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
ఏకాదశి రా.2.39
ఉత్తరఫల్గుణి రా.11.36, విశాఖ కార్తె
వర్జ్యం : ఉ.8.59-10.41
దు.ఉ.6.12-7.45
శుభసమయం : ఉ.11.00-11.45
రాహుకాలం = ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** మొహమాటమునకు పోయి అనుకూలించని పనులు చేయవలసి రావడం అయిష్టతను కలిగిస్తుంది.

**వృషభం :** ముఖ్యమైన వ్యవహారాలలో ఎదురైన ఆటంకాలు తొలుగుతాయి. పెట్టుబడులకు తగిన లాభాలు కష్టమే.

**మిథునం:** కోర్టు సమస్యలు పరిష్కార మవుతాయి. భూ వివాదాలు పరిష్కరించు కుంటారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటాయి.

**కర్కాటకం:** కీలక నిర్ణయాలలో సొంత నిర్ణయాలు అన్ని విధాలా శ్రేయస్కరం. జీవిత భాగస్వామి నుండి సహాయ సహకారాలు అందుతాయి.

**సింహం:** నూతన వ్యక్తులతో పరిచయాలు వివాదాలకు దారితీస్తాయి. జాగ్రత్త వహించండి. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**కన్య :** జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

**తుల :** కుటుంబ సమస్యలు తీరి ఊరట చెందుతారు. క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు. వివాహయత్నాలు ఫలిస్తాయి.

**వృశ్చికం:** వ్యాపార విస్తరణకు నూతన ఒప్పందాలు సమకూర్చుకుంటారు. అనుకోని అవకాశాలు లభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకోండి.

**ధనుస్సు:** సన్నిహితుల సహాయంతో నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు. అందరిని మాటలతో ఆకట్టు కొని ముందుకు సాగుతారు.

**మకరం:** పాత బాకీలు వసూలవుతాయి. ఆస్తి వివాదాలు తీరి లబ్ధిపొందుతారు. ఉద్యోగులు ఆశ్చర్య కరంగా ఇంక్రిమెంట్లు పొందుతారు.

**కుంభం:** వృత్తి, ఉద్యోగాలలో ఎదురైన ఆటంకాలు తొలుగుతాయి. శత్రువులను సైతం మిత్రులుగా మార్చుకుంటారు.

**మీనం :** సంగీత కళాకారులు సన్మానాలు, సత్కారాలు పొందుతారు. గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# బీహార్‌లో ఎన్డీయె ప్రభంజనం

>> విజయావకాశాలను మరింత మెరుగుపరిచింది. చిరాగ్ పాశ్వాన్ పాటించిన సక్సెస్ మంత్ర సత్ఫలితాలినిచ్చింది. 29 స్థానాల్లో పోటీ చేసిన చిరాగ్ పార్టీ ఎల్‌జెపిఆర్‌వి 19 సీట్లు కైవసం చేసుకుంది. 2020లో ఒంటరిగా 137 స్థానాల్లో పోటీ చేసిన చిరాగ్ పార్టీ ఒకే ఒక స్థానంలో గెలుపొందగా, నేడు 19 సీట్లు విజయం సాధించడం విశేషం. అలాగే జెడియు అభ్యర్థులు విజయం సాధించడంలో ఎల్‌జెపి క్రియాశీల పాత్ర పోషించింది. ఇదంతా మోడీ-చిరాగ్ సక్సెస్ మంత్ర అని రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. మొత్తంగా ఎన్‌డిఏ కూటమి 202 స్థానాల్లో విజయం సాధించింది. బిజెపి 90, జెడియు 84, ఎల్‌జెపిఆర్‌వి 19, హెచ్‌ఏఎం(ఎస్) 5, ఆర్‌ఎల్‌ఎం 4 సీట్లు గెలుచుకున్నాయి. ఇక ప్రతిపక్ష మహాఘట్‌బంధన్ 34 స్థానాలతోనే సరిపెట్టుకుంది. ఆర్‌జెడి 25 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 6 స్థానాలతో సరిపెట్టుకుంది. సిపిఐ(ఎంఎల్) (ఎల్) 2, సిపిఐ(ఎం) 1 సీటు గెలుపొందింది. ఎంఐఎం 5 స్థానాల్లో, బిఎస్‌పి 1, ఐఐపి 1 సీటు విజయం సాధించాయి. పార్టీల వారీగా ఓట్ల శాతం పరిశీలిస్తే, బిజెపి, జెడియు కంటే ఆర్‌జెడికి అత్యధికంగా 22.89 శాతం ఓట్లు పడ్డాయి. ఆ తర్వాత బిజెపికి 20.16శాతం, జెడియు 19.23శాతం, కాంగ్రెస్ 8.76శాతం, ఎల్‌జెపిఆర్‌వి 5.02శాతం ఓట్లు లభించాయి. ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ సొంతంగా జన్ సురాజ్ పార్టీని పెట్టి 239 స్థానాల్లోనూ అభ్యర్థులను నిలబెట్టివిస్తృతంగా ప్రచారం చేసినా ఎలాంటి ప్రభావం చూపించలేకపోయాడు. ఒక్కచోట కూడా ఆ పార్టీ అభ్యర్థులు డిపాజిట్ సాధించలేకపోయారు. మొత్తంగా 2శాతం ఓట్లను మాత్రమే ఆ పార్టీ పొందగల్గింది.

# త్వరలో ఎన్టీఆర్ 'బేబీ కిట్లు'

>> టవల్స్ (2)నాప్కిన్లు(6), సబ్బులు(2)సబ్బుపెట్టె, ఫౌడర్, ఆయిల్, షాంపూ బొమ్మఉంటాయి. బలింగ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యే మయంలో కిట్ ఇస్తారు. టిడిపి ప్రభుత్వం 2016లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం కొన్నాళ్ళు అమలు చేసింది, అయితే కోవిడ్ అనంతరం ఈ పథకాన్ని ఆపేసింది. కూటమి ప్రభుత్వంఅధికారం లోకి వచ్చాక 'ఎన్టీఆర్ బేబీకిట్' పేరుతో పథకాన్ని పునఃప్రారంభించాలని నిర్ణయించింది.



శుక్రవారం న్యూఢిల్లీలోని నెహ్రూ సమాధి వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ఏఐసిసి అధ్యక్షుడు ఖర్గే, సోనియా

# మరో తుఫాన్!

>> మొంథా తుఫాను కోస్తా జిల్లాల్లో 350 మి.మీ. వర్షాలు కురిశాయి. 90-100 కి.మీ. వేగంతో గాలులు వీయడంతో భారీ నష్టం జరిగింది. ఐఎమ్‌డీ హైదరాబాద్, చెన్నై కేంద్రాల నుంచి జారీ చేసిన తాజా అలర్ట్ ప్రకారం, బంగాళాఖాతం మధ్య భాగంలో 19 లేదా 20వ తేదీన అల్పపీడనం ఏర్పడనుంది. ఇది త్వరలో డిప్రెషన్‌గా మారి, తీవ్ర తుఫానుగా బలపడే అవకాశం ఉంది. 25వ తేదీన కోస్తా ఆంధ్రప్రదేశ్ తీరం దాటే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మొదట్లో 4050 కి.మీ. వేగంతో గాలులు, తర్వాత 80100 కి.మీ. వేగానికి పెరిగే అవకాశంని ఉందని చెబుతున్నారు. కోస్తా ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తమిళనాడు కోస్తా ప్రాంతాల్లో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతోంది.

# పోలీసుల అదుపులో లిక్కరు స్కామ్ నిందితుడు చొక్రా

**విజయవాడ,నవంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ పోలీసులు ముంబాయిలో లిక్కరు స్కామ్‌లో కీలక నిందితులల్లో ఒకరిగా ఉన్న అనిల్ చొక్రాను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఏపీలో సంచలనం సృష్టించిన లిక్కరు స్కామ్‌లో ఎంపీ మిథున్‌రెడ్డితో సహా పలువురు వైసిపి నేతలు నిందితులుగా ఉన్నారు. వీరిలో కొందరు రిమాండ్‌లో ఉండగా, మరి కొందరు బెయిల్‌పై బయట ఉన్నారు. ఈ కేసుల్లో కీలక నిందితుడిగా ఉన్న అనిల్ చొక్రా కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో చొక్రా ముంబాయిలో ఉన్నట్లు గుర్తించి ఎస్ఐటీ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. ఆయన విజయవాడకు తీసుకుని వచ్చి. విచారణ అనంతరం రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరిచే అవకాశం ఉందంటున్నారు.

# ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా పిఠాపురం

## రూ.20 కోట్లతో 19 ఆలయాల అభివృద్ధి: డిసిఎం పవన్

**విజయవాడ,నవంబరు 14,ప్రభాతవార్త ప్రతినిధి:** పిఠాపురం నియోజకవర్గం పరిధిలో శక్తిపీఠం శ్రీ పురూహూతిక అమ్మవారు, శ్రీకుక్కుటేశ్వర స్వామి ఆలయాలు, శ్రీపాద శ్రీ వల్లభ పీఠం కొలువై ఉన్నాయి. ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా పిఠాపురాన్ని అభివృద్ధి చేసే ప్రణాళికను వేగంగా ముందుకు తీసుకువెళ్లాల్సని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. ప్రఖ్యాత ఆలయాలతోపాటు నియోజకవర్గంలో జీర్ణావస్థకు చేరిన ఆలయాలను ఇప్పటికే గుర్తించామనీ, వాటికి పునరుజ్జీవం కల్పించే పనులుకు అవసరమైన నిధులు దేవాదాయ శాఖ సమకూరుస్తుందని తెలిపారు. శుక్రవారం పిఠాపురం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ అధికారులు, దేవాదాయ శాఖ అధికారులతో పవన్ కళ్యాణ్ సమీక్ష చేశారు. కార్తీక మాసంలో ఆలయాల్లో భక్తులకు కల్పించిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. చివరి కార్తీక సోమవారం సందర్భంగాను, కార్తీక మాసం ముగిసే రోజునా ఆలయాల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉండవచ్చనీ, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. దేవాదాయ శాఖ సహకారంతో ఆలయాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి అన్నారు. ప్రధాన ఆలయాలు అయిన శ్రీ పురూహూతిక అమ్మవారు, శ్రీ కుక్కుటేశ్వర స్వామి, శ్రీపాద శ్రీ వల్లభస్వామి ఆలయాలతోపాటు 19 ఆలయాల అభివృద్ధి నిమిత్తం కామన్ గుడ్ ఫండ్ నుంచి రూ.20 కోట్ల నిధులు మంజూరు చేసేందుకు ఇప్పటికే దేవాదాయ శాఖ సూత్రప్రాయంగా అంగీకరించిందనీ, మ్యాచింగ్ గ్రాంట్ తో నిధులు మంజూరు చేస్తారన్నారు. ఇందులో రూ.6 కోట్లు శ్రీ పురూహూతిక అమ్మవారు, శ్రీ కుక్కుటేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధికి కేటాయిస్తున్నారన్నారు. మరో నాలుగు ఆలయాలను ధూప దీప నైవేద్యం పథకం పరిధిలోకి తీసుకునేందుకు ముందుకు వచ్చిన దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఆలయాల అభివృద్ధి, పరిరక్షణకు కట్టుబడి ఉంటుందని తెలిపారు. మహిళా భక్తులకు దర్శనాలు, పూజల దగ్గర ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆలయాల దగ్గర బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. అందులో భాగంగా దేవాలయాల అభివృద్ధి, టెంపుల్ టూరిజంలో భాగంగా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దే దిశగా ప్రణాళికలు రూపుదిద్దుకున్నాయి. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చర్చించి పిఠాపురం పరిధిలోని ఆలయాల అభివృద్ధికి నిధులు కోరాము. ప్రధాన ఆలయాలతో పాటు మొత్తం 19 ఆలయాలను అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేసేందుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని ప్రముఖ శక్తి పీఠం శ్రీ పురూహుతికా అమ్మవారి ఆలయం, శ్రీ కుక్కుటేశ్వర స్వామి వారి ఆలయం, శ్రీపాద శ్రీ వల్లభ స్వామి ఆలయాలకు సంబంధించి డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధం చేస్తున్నాం.

**మండపాల నిర్మాణం... కోనేరు మరమ్మతులు**

శ్రీ కుక్కుటేశ్వర స్వామి ఆలయ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలో భాగంగా సుమారు రూ.6 కోట్లు వెచ్చించి పిండ ప్రదాన మండపం, అన్నదాన మండప నిర్మాణంతోపాటు కోనేరు మరమ్మతులు చేపట్టేందుకు కామన్ గుడ్ ఫండ్ నుంచి ఇప్పటికే నిధులు మంజూరు చేసేందుకు దేవాదాయ శాఖ ఆమోదం లభించింది. శ్రీపాద శ్రీ వల్లభ స్వామి ఆలయం అభివృద్ధికి రూ.2 కోట్లు కామన్ గుడ్ ఫండ్ ద్వారా మ్యాచింగ్ గ్రాంట్ తో మంజూరు అయ్యింది. అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటి అయిన శ్రీ పురూహుతికా అమ్మవారి ఆలయ అభివృద్ధికి డీపీఆర్ సిద్ధం చేయిస్తున్నాం. పిఠాపురం శ్రీ సీతారామాంజనేయ ఆశ్రమం అభివృద్ధికి రూ.60 లక్షలు, శ్రీ జై గణేష్ స్వామి ఆలయ అభివృద్ధికి రూ.65 లక్షలు, చిత్రాడలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.70 లక్షలు కామన్ గుడ్ ఫండ్ నుంచి నిధులు ఇచ్చేందుకు దేవాదాయ శాఖ అంగీకరించింది. వీటితోపాటు జీర్ణావస్థకు చేరిన పలు ఆలయాలను అభివృద్ధి చేసేందుకు దేవాదాయ శాఖ ముందుకు వచ్చింది. పిఠాపురం మండలం నవ ఖండ్రవాడలోని శ్రీ నక్కల్లమ్మ అమ్మవారి ఆలయం, శ్రీ రామాలయం, గొల్లప్రోలు శ్రీ సిరితల్లి ఆలయం, తాటిపర్తిలోని శ్రీ మార్కండేయసహిత భద్రావతి భావనరుషి స్వామి వారి ఆలయాలను పవన్ కళ్యాణ్ చొరవతో ధూప దీప నైవేద్యం పథకం పరిధిలోకి తీసుకునేందుకు దేవాదాయ శాఖ అంగీకారం తెలిపింది. సనాతన ధర్మానికి ప్రతీకలుగా నిలిచే ఆలయాల పరరక్షణ అందరి బాధ్యత. ఆలయాల పరిరక్షణ, భద్రత, అభివృద్ధికి అధికారుల బాధ్యతల నిర్వహణతోపాటు ప్రజల భాగస్వామ్యం కూడా కీలకం" అన్నారు.

# ప్రపంచదేశాల్లో తీవ్రతరం అవుతున్న ఉగ్రవాదం

## గ్లోబల్ గార్డియన్ టెర్రర్ సూచీ నివేదిక

**న్యూఢిల్లీ, నవంబరు 14:** ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదం పెను సవాల్‌గా మారిందని, ముఖ్యంగా ఆఫ్రికా, ఆసియా దేశాలు దీని తీవ్రతతో సతమతమవుతున్నాయని గ్లోబల్ గార్డియన్ టెర్రర్ ఇండెక్స్ 2026 నివేదిక స్పష్టం చేసింది. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ఉగ్రవాదంతో అత్యంత తీవ్రంగా ప్రభావితమైన దేశాల జాబితాలో భారత్‌ను కూడా చేర్చింది. ఈ నివేదికవివరాల్లోకి వెళితే ఆఫ్రికాలోని సుడాన్, మాలి, సోమాలియా, కాంగో వంటి దేశాలతో పాటు ఆసియాలో సిరియా, అఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ వంటి దేశాలు ఉగ్రవాద కోరల్లో చిక్కుకున్నాయి. అత్యంత తీవ్ర కేటగిరీలో నైజీరియా, మయన్మార్, కొలంబియా, మెక్సికోతోపాటు భారత్ ఉండటం గమనార్హం.

వాకిలి
గత వారపత్రికలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

మీ నమ్మకమే మా తరగని సంపద
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

కడప
: fb.com/vaartha Digital

Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

15-11-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 284 పేజీలు: 10+4 వెల: 6.50

అభివృద్ధి, సంక్షేమానికి సిఎం చంద్రబాబు రోల్ మోడల్

రాష్ట్ర ప్రగతిపై చంద్రబాబు పూర్తి ఫోకస్

సిఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభోత్సవంలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

ఏపిలో పుట్టిన ప్రతిబిడ్డ అదృష్టవంతుడే: కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్




శుక్రవారం విశాఖలో సిఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభోత్సవం సందర్భంగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, కేంద్రమంత్రులు పియూష్ గోయెల్, రామ్మోహాన్‌నాయుడు, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, సిఎం చంద్రబాబు

## ఎపిలో పెట్టుబడులకు ఇదే తరుణం

**విశాఖపట్నం, నవంబరు 14 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఇదే సరైన సమయమని భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రకటించారు. భాగస్వామ్య సదస్సు విజయవంతం కావాలని, పెట్టుబడులు రావాలని ఆకాంక్షించారు. విశాఖపట్నంలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న 30 సిఐఐ భాగస్వామ్య సదస్సును ఉపరాష్ట్రపతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు విశాఖకు చేరుకున్న ఉప రాష్ట్రపతికి, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రి నారా లోకేష్ సహా వివిధ మంత్రులు, ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. అలాగే ఆంధ్రా యూనివర్శిటీ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న ఈ సదస్సు ప్రాంగణానికి చేరుకున్న ఉపరాష్ట్రపతికి ముఖ్యమంత్రి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఉప రాష్ట్రపతిని అల్పాహార విందుకు ఆహ్వానించారు. ఈవిందులో కేంద్రమంత్రులు పీయూష్ గోయల్, రామ్మోహన్నాయుడు, పెమ్మ సాని చంద్రశేఖర్ మంత్రులు నారా లోకేష్‌తో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు. అనంతరం సభా ప్రాంగణంలోని ప్లీనరీ హాల్లో నిర్వహించిన భాగస్వామ్య సదస్సు ప్రారంభోత్సవ సభలో రాష్ట్రపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ మాట్లాడుతూ 'ప్రధాని మోడీ నేతృత్వంలో ఆర్థికంగా సుసం పన్నమైన దేశంగా భారత్ ఎదుగుతోంది. సంపద సృష్టిస్తేనే ప్రపం చంలో పేదరిక నిర్మూలన సాధ్యం అవుతుంది. ఎపిలో సుపరి పాలన, అత్యుత్తమ విధానాలనే సిఎం చంద్రబాబు ప్రభుత్వం ఆచరి స్తోంది. అభివృద్ధికి సంక్షేమానికి సిఎం చంద్రబాబు నాయు డు రోల్ మోడల్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా >>2

## పరిశ్రమలకు వేగంగా అనుమతులు

అవసరమైన మేరకు భూములిస్తాం

72 దేశాల నుంచి ప్రతినిధులు, 522 మంది విదేశీ ప్రతినిధులు వచ్చారు

సిఐఐ సదస్సులో సిఎం చంద్రబాబు

**విశాఖపట్నం, నవంబరు 14:** రాష్ట్రంలో వివిధ పరిశ్రమలు ఏర్పాటు చేసే సంస్థలకు ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఎస్క్రో ఖాతాలు ఓపెన్ చేస్తుందని ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు ప్రకటించారు. ఈ ప్రోత్సాహకాలకు సావరీన్ గ్యారెంటీ ఇస్తామని వెల్లడించారు. విశాఖపట్నంలో శుక్రవారం నుంచి జరగనున్న రెండు రోజుల సీఐఐ భాగస్వామ్య సదస్సును భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రారంభించారు. ఈ వేదికగా సీఎం చంద్రబాబు ఈ కీలక ప్రకటనలు చేశారు. 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారం భోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ 522 మంది విదేశీ ప్రతినిధులు, 72 దేశాల నుంచి ప్రతినిధులు వచ్చారు. 2,500 మంది పారిశ్రామికవేత్తలు, వివిధరంగాల ప్రతినిధులు ఈ సద స్సుకు హాజరయ్యారు. భారత్‌లో విశాఖ అత్యంత సుందరమైన >>2

## బీహార్‌లో ఎన్డీయె ప్రభంజనం

202 స్థానాల్లో ఘనవిజయం

35 సీట్లుదాటని మహాగఠ్ బంధన్

డిపాజిట్లు దక్కని పికె పార్టీ

**పాట్నా, నవంబరు 14:** బీహార్‌లో ఎగ్జిట్ పోల్స్‌కు మించిన అధికార ఎన్‌డిఏ ఘన విజయం సాధించింది. క్రికెట్ పరిభాషలో చెప్పాలంటే డబుల్ సెంచరీ దాటేసింది. 243 స్థానాలున్న బీహార్ అసెంబ్లీలో 90 సీట్లు గెలుపొంది బిజెపి అతిపెద్ద పార్టీగా అవతరించింది. బీహార్ రాష్ట్ర చరిత్రలో బిజెపికి ఓట్లు, సీట్ల పరంగా ఇదే రికార్డు విజయం. అధికార జెడియు 84 స్థానాల్లో గెలుపొందింది. 2020 ఎన్నికలతో పోలిస్తే జెడియు రెట్టింపు సీట్లు సాధించింది. ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆయన టీమ్ గట్టి సపోర్ట్ ఇవ్వడం జెడియు >>2



శుక్రవారం న్యూఢిల్లీలోని బిజెపి కార్యాలయం వద్ద ప్రధాని మోడీ విజయోత్సాహం

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయం 6లో

## త్వరలో ఎన్టీఆర్ 'బేబీ కిట్లు'



ప్రభుత్వం నిర్ణయం

జోన్ల వారీగా సరఫరాకు టెండర్లు ఖరారు

**విజయవాడ,నవంబరు 14,ప్రభాతవార్త ప్రతినిధి:** వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా పుట్టిన బిడ్డల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించే తల్లులకు 'ఎన్టీఆర్ బేబీ కిట్లు'ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు-మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీఎం ఎస్ఐడీసీ) ద్వారా రెండేళ్ళ పాటు 'రేట్ కాంట్రాక్ట్' పద్ధతిలో కిట్లు సరఫరా చేసేలా ఈ ఏడాది జూన్ 25న టెండర్లు పిలిచారు. కిటలో అదనంగా ఫోల్డబుల్ బెడ్,బ్యాగు చేర్చాలని సిఎం చంద్రబాబు ఆదే శించడంతో ఆ టెండరు రద్దుచేసి సెప్టెంబరు 30న రెండోసారి టెండరు పిలిచారు. 3 జోన్లలో వేర్వేరు సంస్థలకు కిట్ల సరఫరా భాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. టెండరులో 4 బిడ్లు వస్తే జోన్ల వారీగా 13 వస్తువుల కిట్ల సరఫరాకు మూడు బిడ్లు ఖరారు చేశారు. తెలంగాణలో ఒక్కో కిట్‌కు రూ.2,054.60,తమిళనాడులో రూ.2,428.98 చొప్పున ఇస్తుంటే..ఏపీలో ఎల్1గా ఎంపికపైన కేంద్రీయ భాండార్ రూ.1,989.27కు సరఫరా చేసేందుకు అంగీకరించింది. దీంతో ఎల్2గా అనితా టెక్సాట్ ప్రైవేట్ లిమిటెడ్,ఎల్3గా శంకర్ ఎంటర్‌ప్రైజెస్ అదే ధరకు అందించేలా టెండరు ఖరారు చేశారు. రాష్ట్రంలో ఏటా సుమారు 3.50లక్షల మందికి కిట్లు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కిట్‌లోబ్యాగు,దోమతెరతో కూడిన పరుపు,ఫోల్డబుల్ బెడ్,వాటర్ ప్రూఫ్ షీట్, దుస్తులు (2), >>2

## తిరుమల పరకామణి కేసు కీలక అధికారి అనుమానాస్పద మృతి



ఎవిఎస్ఒ సతీష్‌కుమార్(ఫైల్)

తాడిపత్రి సమీపంలో రైలుపట్టాల పక్కన మృతదేహం

కుట్రేనంటున్న కుటుంబసభ్యులు, స్నేహితులు

విచారణ జరుపుతున్న పోలీసులు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఐజీ షిమోషీ, ఎస్పీ జగదీష్

**తాడిపత్రి, నవంబరు 14, ప్రభాతవార్త:** గత ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న పరకామణి కేసులో కీలక అధికారిగా వ్యవహ రిస్తున్న అప్పటి టీటీడీ అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి ప్రస్తుత ఆర్ఐ సతీష్ కుమార్ మృతి ప్రమాదకరమా, పథకమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శుక్రవారం తాడిపత్రి సమీపం లోని జూటూరు-కోమలి మధ్య రైలుమార్గంలో పట్టాల పక్కన విగతజీవిగా పడి ఉన్న విషయాన్ని గమనించిన రైల్వే ట్రాక్‌మెన్‌లు సంబంధిత అధికారులకు సమాచారమిచ్చారు. 10.30 గంటలకు సంఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలంలో రక్తపు గాయాలతో చనిపోయిన సతీష్ మృతదేహం వద్ద లభ్యమైన ఐడీకార్డు ద్వారా మృతుడు ఎవరనే విషయాన్ని గుర్తించారు. గతం లో తిరుమల ఏవీఎస్‌వోగా విధులు నిర్వహించి, ప్రస్తుతం గుం తకల్లులో ఆర్ఐ(రిజర్వ్‌ఇన్‌స్పెక్టర్)గా విధులు నిర్వహిస్తున్న ప్యాపిలికి చెంతిన సతీష్ కుమార్‌గా పోలీసులు గుర్తించారు. విషయం తెలు సుకున్న తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పోలీసు ఉన్నతాధికారులకు సమా చారం చేరవేశారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమలలో చోటు చేసుకున్న పరకామణి చోరీ కేసులో ఫిర్యాదు దారునిగా ఉన్న సతీష్ కుమార్, లోక్‌అదాలత్‌లో రాజీ అయిన కేసును ప్రస్తుత కూటమి ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించిన విషయం విదితమే. ఈ కేసుకు సంబంధించి తిరుపతి పద్మావతి అతిథి గృహంలో సీఐడీ ముందు హాజరవడానికి గుంతకల్లు నుంచి రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో తిరుపతికి వెళుతున్నారని తెలిసింది. సతీష్ మృతి సమాచారమం దుకున్న డీఐజీ షిమోషి, ఎస్పీ జగదీష్‌లు హుటాహుటిన సంఘ టనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. సతీష్‌కుమార్ ఎక్కడ కింద పడ్డాడు, ఆయన మృతదేహం ఎంత దూరం వచ్చిప డింది అనేవిషయాలను అక్కడి సిబ్బంది పోలీసు అధికారు >>2

**సిఐ సతీశ్‌కుమార్ మృతి వెనుక కుట్ర?**
పరకామణి చోరీకేసు దర్యాప్తు చివరలో ఫిర్యాదిదారుడు కనుమరుగు, సిఐడి అధికారులకే షాక్! 2లో

## భాగస్వామ్య సదస్సుకు రాష్ట్ర ఆతిథ్యం గర్వకారణం



వికసిత్ భారత్ లక్ష్యంతో రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చిదిద్దుతాం: మంత్రి లోకేష్

**విశాఖపట్నం, నవంబరు 14, ప్రభాతవార్త:** సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ కు ఏపీ ఆతిథ్యం ఇస్తుండటం ఎంతో గర్వకారణంగా ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి మంత్రి లోకేష్ పేర్కొన్నారు. విశాఖ ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్స్ లో కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సును ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ పెట్టుబడుల గమ్యస్థానంగా ఏపీని ఎందుకు ఎంచుకోవాలని చాలామంది నన్ను అడు గుతారు. అందుకు మూడు కారణాలు ఉన్నాయి. మొదటిది అనుభవం కలి గిన దార్శనికత కలిగిన నాయకత్వం. ఆయన మరెవరో కాదు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు. వారసత్వాన్ని నిర్మించే అవకాశం రాజకీయ నాయకులకు జీవితంలో ఒక్కసారి మాత్రమే అవకాశం వస్తుంది. కానీ రాష్ట్ర ప్రజలు చంద్రబాబునాయుడుకి రెండో వారసత్వాన్ని నిర్మించే అవకాశం ఇచ్చారు.అదే అమరావతి, విశాఖపట్నం. ఒక్కసారి మాతో చేతులు కలిపిన తర్వాత అది మీ ప్రాజెక్ట్ కాదు, మా ప్రాజెక్ట్‌పెట్టుబడులకు ఏపీనే ఎందుకు ఎంచుకోవాలనేందుకు రెండో కారణం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. ప్రస్తుతం వేగవంతమైన ప్రపంచంలో మనం ఉన్నాం. మార్కెట్లు, నియంత్రణలు, సాంకేతికత నిరంతరం మారుతున్న ఈ వేగవంతమైన ప్రపం చంలో స్పీడ్ అనేది చాలా ముఖ్యం. నేను వేలాది మంది పెట్టుబడు దారులను, కార్పోరేట్లనుకలిశాను. ఒక్క అంశంపై వారందరిలోనూ ఏకాభిప్రా యం ఉంది. అదే స్పీడ్. కంపెనీ ఎంత వేగంగా అడుగులు >>2

**భారీ పెట్టుబడులకు రిలయెన్స్ గ్రీన్ సిగ్నల్** 2లో




## మరో తుఫాన్!

19 లేదా 20న అల్పపీడనం

**విజయవాడ,నవంబరు 14,ప్రభాతవార్తప్రతి నిధి:** ఆంధ్రప్రదేశ్ మొంథా తుఫాను విధ్వంసం నుంచి పూర్తిగా కోలుకోకముందే మరో సైక్లోన్ వచ్చే అవకాశాలున్నట్లు భారత వాతా వరణశాఖ (ఐఎమ్‌డీ) నిపుణులు ఈ నెల 19 లేదా 20వ తేదీన బంగాళాఖాతంలో కొత్త అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించారు. ఇది త్వరగా తుఫానుగా బలపడి, 25వ తేదీన తీరాన్ని దాటే అవకాశం ఉందని చెబుతున్నారు. దీని ప్రభావంతో కోస్తా ఆంధ్ర ప్రదేశ్‌లోని జిల్లాలపై భారీ నుంచి అతి భారీ వర్షాలుపడే అవకాశం ఉంది. అంతేకాకుండా, మరో నాలుగు రోజుల్లో అంటే నవంబర్ 13 14తేదీల్లో శ్రీలంక సమీపంలో మరో అల్ప పీడనం ఏర్పడి, రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు పడ తాయని ఐఎమ్‌డీ తెలిపింది. అక్టోబర్ చివరిలో తీరాన్ని దాటిన >>2

## ప్రధాని మోడీ నాయకత్వంపై ప్రజల విశ్వాసానికి రుజువు



డిసిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,నవంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రజల విశ్వాసం మరోసారి రుజువు అయిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించిందని పేర్కొన్నారు. శుక్రవారం నాడు బిహార్ అసెంబ్లీ ఎన్నికలు, తెలంగాణలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో అమరావతిలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోనే దేశ సమగ్రాభివృద్ధి, సుస్థిర పాలన సాధ్యమని దేశ ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. ఈ విషయం బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయంతో మరోసారి స్పష్టమైందని తెలిపారు. ఆ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి సాధించిన స్థానాలు మోదీ నాయకత్వంపై ప్రజలకు ఉన్న అచంచల విశ్వాసానికి తార్కాణాలని అభివర్ణించారు. ఇంతటి విజయానికి కారకులైన నరేంద్ర మోడీకి పవన్ కల్యాణ్ మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. బిహార్ ముఖ్యమంత్రిగా సుదీర్ఘ కాలంగా సేవలందిస్తున్న నితీశ్‌కుమార్‌పట్ల ఆ రాష్ట్ర ప్రజలకు ఉన్న అభిమానం చెక్కు చెదరలేదన్నారు. ఆ రాష్ట్రంలో విద్య, వైద్య ప్రమాణాలను మెరుగుపరచి, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ముందుకు వెళ్లారని చెప్పారు. బిహార్‌లో ఈ విజయానికి కారకులైన కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా, బిహార్ సీఎం నితీశ్ కుమార్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలకు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. జూబ్లీ హిల్స్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో విజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు డిప్యూటీ సీఎం పవన్ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఎన్నికలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన అభినందనలు తెలిపారు.

వార్త

నాణ్యతను నిలబెట్టుకోవడం, చెప్పిన సమయానికి ఇవ్వడం, కష్టమరు పట్ల సేవాభావంతో ఉండటం ఈ మూడు గుణాలు ఏ వ్యాపార విజయానికైనా తొలిమెట్లు.

-రోజర్

# ఎన్డీయేకు అదే 'పది వేలు'!

బీహారు అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ అధికార కూటమి గెలిచింది. ఎగ్జిట్ పోల్స్ సర్వేలన్నీ ఓటరుతో మాట్లాడినప్పుడు వారి అభిప్రాయాలన్నీ ఎన్‌డిఏవైపే ఉన్నాయి. ఎన్ని సెఫాలజీ సంస్థలు ఎంత మందిని కలిసి ప్రశ్నించినా ఒకే మాట. అదే ఇప్పుడు ఫలితాలను ప్రతిబింబింప చేస్తోంది. మహాఘట్‌బంధన్‌కు మరోసారి నిరాశే మిగిలింది. నితీష్ పాలన చివరి కాలంలో బీహార్ ఏమంత బాగాలేదనే అభిప్రాయాలు వినవచ్చాయి. కానీ ప్రధాని నరేంద్రమోడీ నితీష్‌ను ఆయన పార్టీ అభ్యర్థులను బాగా సమర్థించారు. గత పాలకుల తప్పులను మరోసారి బీహార్ ప్రజలకు గుర్తుచేశారు. తమవల్ల బీహార్‌కు ఏ విధంగా లాభం జరిగిందీ జరుగబోతోందీ చెప్పడంలో కృతకృత్యులైనారు. బీహార్ నుంచి ఇంకా వలసలు తగ్గలేదు. నిరుద్యోగ సమస్య తీరలేదు. కనీసం ప్రజల స్థితిగతులు మారాయంటే అదీ లేదు. కానీ మోడీ మాటను వాళ్లు విశ్వసించినట్లుంది. ఓట్ల లెక్కింపులో ఆది నుంచీ ఎన్‌డిఏ తరపున బలమైన అభ్యర్థులున్న చోట స్థిరమైన ఆధిక్యత కనబడింది. కమల ప్రియులు ఆధిక్యంలో దూసుకుపోయారు. ఈ దేశంలోనే అత్యంత ప్రధానమైన ఎన్నికల వ్యూహకర్తగా పేరొందిన ప్రశాంత్‌కిషోర్ బీహార్ ప్రజలను ఏవిధంగానూ లొంగ దీసుకోలేకపోయారు. అనేక రాష్ట్రాలలో వివిధపార్టీల గెలుపు యంత్రాంగాన్ని విజయపథంలోకి నడిపించి తాను నేతృత్వం వహించిన రాష్ట్రాలలో ఆయా పార్టీల గెలుపునకు కారకుడయ్యాడని అభినందనలు సత్కారాలు పొందిన ప్రశాంత్‌కిషోర్ బీహార్ ఎన్నికలలో ఎటువంటి ఎత్తుగడలు వేయలేకపోయారు. జనహృదయాలను గెలుచుకోవాలని తొలుత జనంలోకి వెళ్లారు. కేవలం ఆయన అంతకుముందు జనతాదళ్ అధ్యక్షుడితో కలిసి నడిచినా ఆ తర్వాత ఆయనను వీడి 'జన సురాజ్' పేరిట ప్రత్యేక రాజకీయ పార్టీని స్థాపించారు. అయితే ఎన్నికల ప్రకటన నాటికే జనం తనతో కలిసి రాదనే ఉద్దేశంతో తన మార్కు టక్కుటమార గోకర్ణ విద్యలేమీ ప్రయోగించకుండా తాము, కేవలం ప్రభుత్వం ఏర్పాటుతో నిర్ణయాత్మక శక్తిగా ఉంటామనే సంకేతాల ద్వారా తమ సత్తాను తెలియచేసి ఊరుకున్నారు. ఆయన పార్టీకి ఒక్కసీటు కూడాలేదు. పోటీ చేసిన దాదాపు అన్ని స్థానాల్లోనూ అభ్యర్థులు డిపాజిట్‌లు కోల్పోయారు. ఎవరేమి చెప్పినా ఏ పార్టీ ఎలాంటి ఎన్నికల వాగ్దానాలు చేసినా వాటి కన్నా ప్రభుత్వపరంగా ఎన్నికల ముందు ప్రతి ఒక మహిళ అకౌంట్‌లో జమయిన పదివేల రూపాయలే ఎన్‌డిఏను గట్టెక్కించాయనే చెప్పాలి. అసెంబ్లీలోని 243 సీట్లలో ఎన్డీయే 191 సీట్లలో గెలుపొందింది. మహిళలంతా తమవైపే ఉన్నందున ఎన్డీయే ఇప్పుడు మేజిక్ ఫిగర్‌ను దాటి ఎక్కడికో వెళ్లిపోయింది. మూడింట రెండు వంతుల సీట్ల లో గెలిచింది. ఓటు శాతం పెంచుకోగలిగింది. ఇక్కడ చెప్పుకోదగిన అంశమేమిటంటే బీహార్ ఎన్నికల దృష్ట్యా ఎన్డీయేను, ఎన్నికల కమిషన్‌కు ఓటర్ల జాబితా సవరణ విషయంలో 'ఓటు చోరీ' పేరిట నానాయాగీ చేసిన కాంగ్రెస్ పార్టీ అంతకు మించి ఏ విధమైన ఎన్నికల వ్యూహాలను పాటించలేకపోయింది. మహాఘట్‌బంధన్ పొత్తుల్లో, ఎత్తుల్లో మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ తనయుడు ఆర్జేడి నేత తేజస్వి యాదవ్ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించి కాంగ్రెస్‌ను అతి తక్కువ స్థానా లకే పరిమితం చేశారు. కాంగ్రెస్ తన సొంత వ్యూహాల విషయంలో చతికిలపడిపోయింది. తేజస్వీ యాదవ్ ఆది నుంచీ కూటమితో ఏకాభిప్రాయానికి రాకుండానే తానే 'ముఖ్యమంత్రి' అభ్యర్థిగా ప్రకటించుకున్నాడు. అదే అతని పార్టీకి కానీ, అతడిని నమ్ముకున్న కాంగ్రెస్ పార్టీకి ఊరితాళ్లుగా మారాయి. వీరి కూటమి ఎన్నికలకు ముందే ప్రయోగాత్మకంగా కేంద్ర ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితా లో నిర్దిష్ట సవరణల కోసం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కారణంగా మహిళల ఓట్ల సంఖ్య తగ్గి పురుషుల సంఖ్య పెరిగింది. పోలింగ్‌లో పురుషుల కన్నా మహిళలే పోలింగ్ బూత్‌లకొచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ లెక్కలను బట్టి చూస్తే ఎన్‌డిఏకు మహిళల ఆదరణ ఎక్కువగా ఉందని తేలిపోయింది. గతంలో మహారాష్ట్ర ఎన్నికల్లోనూ, తెలంగాణ ఎన్నికల్లోనూ ప్రముఖ పార్టీలు మహిళల కోసం ప్రకటించిన పథకాలే గెలిపించాయని విశ్లేషణలున్నాయి. కానీ ఈసారి బీహార్‌లో అందుకు భిన్నంగా ముందుగానే మహిళలకు తాయిలాలు అందించినట్లయింది. ఈ విషయమై ఎన్నికల సంఘం కూడా అభ్యంతరపెట్టలేదు. జెడియు, బిజెపిలతోపాటు లోక్‌జనశక్తి (చిరాగ్ పాశ్వాన్) హిందూ స్థానీ అవామ్ మోర్చా (జితన్ రామ్ మాంఝికి, రాష్ట్రీయ లోక్ మోర్చా (ఉపేంద్ర కుష్వాహా) ఎన్డీయే కూటమితో తగు భాగస్వామ్యం, గెలుపు కూడా సొంతం చేసుకు న్నాయి. వీరందరికీ భరోసాగా నరేంద్ర మోడీ చరిస్మా నిలిచిందని తాజా ఫలితాలు తెలుపుతున్నాయి. బీహార్ ఎన్నికల ఓటింగ్ విశ్లేషణ చూస్తే ఇక్కడ కుల మతాలు ఏమాత్రం ప్రాధాన్యత వహించలేదు. యాదవులు, ముస్లింలు, తమవెంటే ఉంటారని భావించిన మహాఘట్ బంధన్ అంచనాలు తలకిందులయ్యాయి. అప్పుడు మహారాష్ట్రలో 'లడ్లీ బెహన్' స్కీం, ఇప్పుడు బీహార్‌లో 'జీవికా దీదీ' ఈ రెండూ ఎన్‌డిఏకు విజయమంత్రాలే! ఇదే రకమైన హామీ మహాఘట్‌బంధన్ ఇచ్చినా బీహారీలు నమ్మలేదు. రేపెపుడో వచ్చే లబ్ది కాన్న కళ్లెదుట తమ ఖాతాల్లో కన్పిస్తున్న 'నజరానా'లనే మిన్నగా భావించారు. అందుకే కాబోలు ఈసారి ఎన్నడూలేనట్లుగా అత్యధిక ఓటింగ్ నమోదైంది. బీహార్‌లో ప్రభుత్వ వ్యతిరేకతను ఈ వ్యూహమే గెలిచుకోగలిగింది.

ఒక పని అంటే గాని, లేదా దానివల్ల కలిగే ఫలితాలంటే కానీ భయపడి, ఆ పని చేయడాన్ని మానుకోవడం చాలా చిన్నతనం.



మహాత్మా గాంధీ

ఎప్పుడు, ఎలా చనిపోయేదీ నీవు నిర్ణయించలేవు. ఇప్పుడు ఎలా జీవించాలన్నదే నీవు నిర్ణయించగలవు.



రామకృష్ణ పరమహంస

# ప్రజావాక్కు



## కొండెక్కిన కూరగాయల ధరలు

తెలుగురాష్ట్రాల్లో కూరగాయల ధరలుప్రస్తుతం వినియోగదారులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. సాధారణంగా సీజన్ మారినప్పుడు కొంతమేరధరల్లో మార్పులు ఉంటాయికానీ, ఈసారి పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారింది. హైదరాబాద్, విజయవాడ, విశాఖ, గుంటూరు, వరంగల్ వంటి నగరాల్లోనే కాకుండా గ్రామీణ మార్కెట్లలో కూడా కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. చాలా రకాల కూరగాయలు పావుకేజీకి రూ.25-35 కంటే తక్కువకు దొరకడంలేదు. ముఖ్యంగా టమాటా, దోసకాయ, బీరకాయ, పొట్లకాయ మిరపకాయ, వంకాయ క్యారట్, ఆకు కూరలు వంటి సాధారణ కూరగాయలు కూడా మధ్యతరగతి ప్రజలకు అందనంత పెరిగాయి. ధరలు తగ్గించేలా ఆయా ప్రభుత్వాలు చొరవ చూపాలి.

- కామిడి సతీష్ రెడ్డి జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా

## గ్లోబల్ డిజిటల్ విప్లవం

గూగుల్ విశాఖపట్నంలో 15 బిలియన్ల డాలర్ల అర్చన డేటా సెంటర్ పెట్టుబడి భారతదేశం డిజిటల్ ఆర్థిక ప్రగతిలో ఒక మహత్తర మలుపు. ఈనిర్ణయం ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ టెక్నాలజీ కేంద్రంగా నిలిపే అవకాశం కల్పిస్తుంది. భారతదేశం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా మౌలిక సదుపాయాల రంగంలో పెరుగుతున్న ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తుంది. గూగుల్, భర్తీ ఎయిర్‌టెల్, అదానికానెక్స్‌తో సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్ టెక్నాలజీ సామర్థ్యాలను పెంపొందించడం, ఉద్యోగ అవకాశాలు సృష్టించడం, కొత్త ఆవిష్కరణలను ప్రేరేపించడం, దేశీయ డిజిటల్ పర్యావరణాన్ని బలోపేతం చేయడం వంటి లక్ష్యాలను సాధిస్తుంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ఉగ్రవాదుల వాస్తం

రోడ్డు, రైలు, విమాన, నీటి మీద ప్రయాణాలలో ప్రతిక్షణం అప్రమత్తంగాలేకపోతే జరిగే పరిణామాలు చాలా బాధకరంగా ఉంటాయి. ఈకోణంలోచూస్తే ఢిల్లీలో సంభవించిన కారు బాంబు పేలుళ్లలో చుట్టుపక్కల ఉన్న వాహనాలు కూడా దగ్ధమై పోయాయంటే ఆ విస్ఫోటనం ఎంత తీవ్రమైనదోఅర్థమవుతున్నది. ఎనిమిదిమంది ప్రాణాలు హరించుకుపోయాయి. ఇదిఉగ్రవాదచర్యా లేక మరొకటా అన్నది ఇంకా పరిశోధనలో ఉన్నదట.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## అసంఘటిత కార్మికులకు రక్షణ కవచం

ప్రస్తుతం డిజిటల్ యుగంలో గిగ్ వర్కర్లు అనగా స్వతంత్రంగా పనిచేసే కార్మికులు సమాజంలో ఒక ప్రధాన శక్తిగా మారుతున్నారు. ఫుడ్‌డెలివరీ బాయ్స్, క్యాబ్ డ్రైవర్లు, ఆన్‌లైన్ సర్వీస్ ప్రొవైడర్లు వంటి వేలాది మంది యువకులు ఈ వర్గానికి చెందుతారు. వీరు ఉద్యోగసంబంధ భద్రత, ఆరోగ్య బీమా, పింఛన్ వంటి సామాజిక రక్షణలకతీతంగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం 'గిగ్ వర్కర్స్ బిల్లు'ను తీసుకురావడానికి ప్రయత్నించడం ఒక చారిత్రాత్మక నిర్ణయం అని చెప్పాలి. ఈ బిల్లుతో గిగ్‌వర్కర్లకు కనీస వేతనం, బీమా సదుపాయాలు, ప్రమాద భద్రత, పింఛన్ లాంటి హక్కులు అందించే దిశగా చర్యలు చేపట్టబోతున్నది. ఈచట్టం అమలులోకివస్తే, గిగ్ వర్కర్లు తమ సేవలకు సరైన గుర్తింపు పొందడమేకాక, వారి జీవన భద్రత కూడా బలపడుతుంది. ప్రస్తుతానికి ఈవర్గం కార్మికులు రోజుకు ఎన్నోగంటలు పనిచేసినా, ఆదాయం స్థిరంగా ఉండదు.

-తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## సరస్వతి నిలయాలా.. వ్యాపార కేంద్రలా?

అమలు కాని విద్య హక్కుచట్టం. ఒక్కొక సెక్షన్‌లో 50 మంది విద్యార్థులు, సరిపడలేని టీచర్లు. ప్రతియేటా 2సార్లు నిర్వహించని పేరెంట్ మీటింగ్స్, అసలు తెలంగాణలో విద్య కమిషన్ వున్నదా? ప్రైవేట్ స్కూల్ ఫీజునియంత్రణ చట్టం అమలు ఏది? తెలంగాణ విద్య కమిషన్ బిల్లు పాస్ కావాలంటే ఇంకెన్ని సంవత్సరాలు పడుతుంది? ఇవ్వన్ని సగటు పేద, మధ్య తరగతి తల్లిదండ్రులు అడుగుతున్న ప్రశ్నలు. ట్యూషన్ ఫీజు, ఇతరత్రా ఫీజులను ముందే తప్పనిసరిగా మొత్తం ఒకేసారి యాభై వేల కట్టిన తర్వాతే తెలంగాణ ఎస్‌ఎస్సి బోర్డు పరీక్షల ఫీజు 125 రూపాయలు కట్టాలని నియమాలు పెట్టడంతో తల్లిదండ్రులు దిక్కుతోచని పరిస్థితిలో వున్నారు.

- పొద్దుటూరి జగదీశ్వర్, కరీంనగర్ జిల్లా

## మౌలిక సదుపాయాలు కల్పించాలి

నల్లగొండ జిల్లా తిరుమలగిరి సాగర్ మండల కేంద్రంలో మురికి కాలువలు శుభ్రం చేయడం లేదు. రోడ్లపై గుంతలు ఉన్నాయి. మిషన్ భగీరథ పైప్ లైన్లు పగిలిపోయాయి. వీధి దీపాలు వెలగడం లేదు. గ్రామ కార్యదర్శులు, అధికారులు కార్యాలయాలకు పరిమితం అవుతున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి..

-పుట్లూరి రాం నర్సింహారెడ్డి, నల్లగొండ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఇంకెన్నాళ్లీ రక్తపుటేరులు!

*ఇలాంటి సంఘటనలు జరగకుండా తిప్పికొట్టే స్థాయికి మన పోలీసు యంత్రాంగాన్ని సమయాత్తం పరచాలి. అందుకు అవసరమైన శిక్షణ, అత్యాధునిక సంపత్తిలాంటివి సమకూర్చాలి. ప్రజల్లో అభద్రతా భావానికి ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాలి. ఇప్పటికైనా పాలకులు ఉక్కుపాదమంటూ మాటల్లో కాక చేతల్లో చేపాలి. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిర్దాక్షిణ్యంగా అణచివేయాలి. ప్రతి రాజకీయ వాది సంకుచిత స్వార్థప్రయోజనాలు పక్కనబెట్టి దేశ భద్రతకు నడుంకట్టాల్సిన తరుణమిది. ఇందులో ఏమాత్రం ఓట్ల కోసం దోబుచులాడితే జాతి నైతికంగా మనోధైర్యం కోల్పోతుంది. ఎల్లకాలం భయాందోళనలతో కాలం వెల్లబుచ్చడం సమంజసం కాదు. అశాంతి రాజ్యమేలడం అరాచక పరిస్థితులు నెలకొనడం దేశానికి క్షేమం కాదు.*

దామెర్ల సాయిబాబ

ఉగ్రవాద దావానలంలో మరొకసారి ఢిల్లీ చిక్కుకుపోయింది. క్రౌర్యానికి కర్కశత్వానికి మారుపేరైన పాకిస్థాన్ ప్రేరేపిత కసాయి మూక దేశ రాజధాని ఢిల్లీలో అత్యంత భద్రతా, నిఘా వలయంలో ఉన్న ఎర్రకోట సమీపంలో మారణహోమాన్ని సృష్టించింది. వారి పైశాచిక ప్రవర్తనకు జాతి యావత్తు నివ్వెరపోయింది. దేశంలో ఉగ్రవాద కుట్రలు భగ్నం అవుతున్నవేళ సోమవారం రాత్రి జరిగిన పేలుడు ప్రకంపనాలు సృష్టించింది. దేశంలోని ఉగ్రదాడులకు పాల్పడి కుట్రలు చేస్తున్న పలువురిని అరెస్టు చేయడం, వారి కుట్రలను భంగపరిచి కట్టుదిట్టంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పుకుంటున్న తరుణంలో ఈ దారుణ సంఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయింది. హర్యానాలో భారీ మొత్తంలో ఆర్‌డిఎక్స్ పట్టుబడడం దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అది జరిగిన కొన్ని గంటల్లోనే ఢిల్లీలో భారీ పేలుడు చోటుచేసుకోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. హస్తిన చరిత్రలోనే మొదటిసారిగా ఎర్రకోట సమీపంలో సంభవించిన భారీ పేలుడు పోలీసులకు సవాలుగా మారింది. ఈ విధ్వంసానికి కారణమైన కారులో ఉన్న ముగ్గురితోసహా మొత్తం పదమూడుమంది చనిపోగా మరో ఇరవై మందికిపైగా తీవ్ర గాయాలపాలయ్యారు. తీవ్రస్థాయి పేలుడు కారణంగా మృతదేహాలు ఛిద్రమై చెల్లాచెదురుగా పడిపోయాయి. బీతావహ వాతావరణం నెలకొనడంతో మంటలు ఆహాకారాలు, ఆర్తనాదాలతో ఆ ప్రాంతం ఒక్కసారిగా అల్లకల్లోలంగా మారింది. మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా ముక్కలు ముక్కలుగా మారి చెల్లాచెదరుగా పడిపోయాయి. ఈ కేసు దర్యాప్తులో వెలుగుచూస్తున్న విషయాలు విస్తుపోయేలా చేస్తున్నాయి. బాబ్రీ మసీదు కూల్చివేత రోజైన డిసెంబరు ఆరవతేదీన భారత్‌లో నాలుగు నగరాల్లో ముప్పైరెండు చోట్ల బాంబులు పేల్చి భారీ విధ్వంసం సృష్టించాలనీ జైషే మహమ్మద్ ఉగ్రవాద సంబంధం ఉన్న ఎనిమిది మందిని దర్యాప్తు అధికారులు విచారించడంతో నిర్ఘాంతపరిచే విషయాలు వెలుగుచూశాయి. ఏకంగా ఇరవైఏడుకు పైగా పాతకార్లు కొనుగోలుచేసినట్లు అధికారుల దృష్టికి వచ్చినట్లు తెలిసింది. అత్యంత శక్తివంతమైనపేలుడు పదార్థాలను ఆ కార్లలో అమర్చి మారణహోమం సృష్టించాలని ఉగ్రవాదులు పన్నిన కుట్ర బయటపడింది. ఏదిఏమైనా పెద్ద ప్రమాదం తప్పిందనే చెప్పచ్చు. ఏ కోణం నుంచి చూసినా ఇందులో పాక్ హస్తం ఉందనే విషయం రూఢీ అవుతున్నది. ఇలా పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు భారత్‌లో బాంబులు పేల్చడం అమాయకుల ప్రాణాలను బలితీసుకోవడం ఇది మొదటిసారి కాదు. భారత గడ్డపై తాము ప్రవహింప చేస్తున్న రక్తపుటేర్లను చూసి వారు విజయగర్వంతో ఊగిసలాడుతుండవచ్చు. కానీ వారు సృష్టిస్తున్న ఈ బీభత్సకాండకు సాధారణ ప్రజలు గగుర్పాటు చెందుతున్నారు. ఇదంతా ఎందుకు చేస్తున్నారు? ఏమి ఆశించి ఈ నరమేధానికి సంకల్పిస్తున్నారు? ఇందులో అన్నెంపున్నెం ఎరుగని అమాయక ప్రజలను ఎందుకు బలి తీసుకుంటున్నారో సామాన్యులకు అర్థంకాని విషయం. ఇప్పటికే అనేక సమస్యలతో సతమతమవుతూ కూడా అభివృద్ధి పథంలో పయనిస్తున్న భారత్‌ను దొంగదెబ్బతీయాలనే దుష్టపన్నాగాలతో ఈ అమాయకులను బలి తీసుకుంటున్నారనే విషయం సామాన్యులకు అర్థంకాకపోవచ్చు. విప్లవాత్మక సంస్కరణలతో ఆర్థికంగా పుంజుకుంటున్న భారతదేశాన్ని చూసి ఓర్చుకోలేక సహించలేక ఈర్ష్యాద్వేషాలతో అన్నిటికంటే ముఖ్యంగా విదేశాల నుంచి కుప్పలు తెప్పలుగా పడుతున్న పెట్టుబడుల ప్రవాహాన్ని నివారించి నిరోధించడానికి కుత్సితత్వంతో పొరుగునున్న పాక్ చేస్తున్న దుశ్చర్యలేనని సామాన్యులకు తెలియకపోయినాపాలకులకు,

### ఒక్క మాట

మేధావులకు పెద్దల అందరికి తెలిసిందే. ఏఅవకాశం దొరికినా భారత్‌లో బీభత్సం సృష్టించడానికి వెనుకాడరని కూడా తెలుసు. 2008లో ముంబయిలో ఏకంగా దొంగ యుద్ధానికే పాల్పడ్డారు. దాదాపు ఇరవై ఐదుమంది ఉగ్రవాదులు కరాచి నుంచి సముద్రమార్గంద్వారా దేశముఖద్వారం సాక్షిగా ముంబయి నగరానికి ప్రవేశించి దాదాపు యుద్ధమే ప్రకటించారు. రెండు రోజులకుపైగా బీభత్సం సృష్టించారు. నక్షత్రపు హోటళ్లను ముట్టడించారు. వందలాది మందిని బందీలుగా పట్టుకున్నారు. విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో పలువురు విదేశీయులతోపాటు నూటయాభై మందికిపైగా నిహతులైనట్లు మరో మూడువందల యాభై మందికిపైగా క్షతగాత్రులైనట్లు అధికారవర్గాలే అప్పట్లో ప్రకటించాయి. అనధికార లెక్కలెన్నో ఇప్పటికి కూడాతెలియదు. అదేకాదు హైదరాబాద్‌లో గోకుల్‌చాట్, లుంబినీపార్క్, మక్కామసీద్ వద్ద జరిగిన పేలుళ్లలో గాయపడినవారు నేటికీ అంగవైకల్యులై కుటుంబానికి భారమై జీవనం సాగిస్తున్నారు. ఈ దాడులతో పొంచి ఉన్న ప్రమాదాన్ని వెయ్యికళ్లతో నిఘా వేయాల్సిన గూఢచారి సంస్థలు విఫలమవుతున్నాయనే ఆరోపణలను కొట్టివేయలేం. ఆనాడు ముంబయి దాడి ప్రారంభమైన తర్వాత పోరాటం ఉగ్రవాదులతో స్థానిక పోలీసుల శక్తి సరిపోదని గ్రహించిన పాలకులు వారితోపాటు త్రివిధ దళాల సైన్యాన్ని రంగంలోకిదింపారు. ఆ పోరులో ఆణిముత్యాల్లాంటి అగ్రసేన ఉన్నతాధికారులతో పాటు పదకొండు మంది కిందిస్థాయి పోలీసు ఉద్యోగులను బలిపెట్టాల్సి వచ్చింది. ఈ దాడులు జరిగినప్పుడల్లా ఇలాంటివి భవిష్యత్తులో జరగకుండాచూసేందుకు జాతీయభద్రతా చట్టాన్ని వినియోగించడంతోపాటు పటిష్టమైన చర్యలు చేపడతామని నిఘా వ్యవస్థను మరింతగా వ్యవస్థీకరిస్తామని పాలకులు పదేపదే చెబుతుంటారు. ఎన్ని చట్టాలుతెచ్చినా, మరెన్ని సంస్థలను ఏర్పాటు చేసినా, ఇంకెన్ని హెచ్చరికలు చేసినా వాటిని అమలు చేయాల్సింది క్షేత్రస్థాయిలో ఉన్న పోలీసులనే విషయాన్ని విస్మరించకూడదు. ప్రాణాలను పణంగా పెట్టి, అరాచకశక్తులతో పోరాటం చేయడానికి పోలీ సులకు అంతతెగింపు, సామర్థ్యం ఉందా? అత్యాధునిక ఆయుధాలున్నాయా? ఆస్థాయిలో శిక్షణ ఉందా? ఇవన్నీ జవాబులేని ప్రశ్నలే. పోలీసుల శక్తిసామర్థ్యాలను శంకించడం లేదు. వారిని అవమానించడం అంతకంటే కాదు. శక్తియుక్తులను ప్రదర్శించడానికి ఉత్సాహం ఉన్నా అందుకు రాజకీయనేతలు అంగీకరించి అనుమతి ఇస్తారా? అనేది అనుమానమే. ఓట్ల రాజకీయాల ముందు ఈ సమస్య అంతగా కన్పించకపోవచ్చు. బాధితుల హోరు, ఆక్రందనలు గోడు విని పించకపోవచ్చు. ఖండనలు, పరామర్శలతో సరిపించుకుంటారు. కాలం గడిచేకొద్దీ మరిచిపోతుంటారు. అందుకే ఈ మారణహోమం కొనసాగుతూనే ఉన్నది. పోలీసు యంత్రాంగాన్ని సమయాత్తం చేసే సంకల్పబలం లేదేమోననిపిస్తున్నది. ఒకవేళ పాలకులు చెప్పినా కదలి సమరరంగంలో దూకగల ఆత్మస్థైర్యం తమ వెంటనేతలు ఉంటారనే నమ్మకం పోలీసుల్లో ఏనాడో సన్నగిల్లింది. ఇక ఈపేలుళ్లలో అమాయకులైన తమ ఆప్తులను కోల్పోయిన వారి విషాద గాథలు వింటుంటే హృదయం ద్రవించకతప్పదు. అత్యంత పటిష్టమైన భద్రత నడుమఉన్న దేశరాజధాని ఢిల్లీఎర్రకోట సమీపంలో పేలుడుకు పాల్పడ్డారంటే ఇక దేశంలో ఇతర నగరాలపరిస్థితి ఏమిటనే ప్రశ్న ఉదయిస్తుంది. ముందుగా పసిగట్టే సామర్థ్యం, వ్యూహం రాష్ట్రాల్లో ఉంటుందా అనేది అనుమానమే. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఉగ్రవాదుల అనుచరులు తలదాచుకుంటున్నారనే ప్రచారం ఎన్నోరోజుల నుంచి వినిపిస్తున్నది. ప్రస్తుతం ఢిల్లీ ఎర్రకోటవద్ద పేలుళ్లకు సంబంధించిన ఒక ఉగ్రవాది మూలాలు ఇక్కడే ఉన్నట్లు చెప్తున్నారు. వాస్తవంగా 1993 లో ముంబయి వరుస పేలుళ్లలతో మారుమ్రోగితే అదే యేడాది ఐపిఎస్ అధికారి కృష్ణప్రసాద్ హత్యతో ఆ మూలాలు నగరంలో బయటపడ్డాయి. అప్పటి నుంచి చాప కింద నీరులా అదివిస్తరిస్తూనే ఉంది. అందుకోసం ఉగ్రవాద కదలికను ఎప్పటిప్పుడు కనిపెట్టి విధ్వంసక చర్యలను నివారించేందుకు ప్రత్యేకంగా పోలీసు వ్యవస్థను ఏర్పాటుచేశారు. నిధులను కేటాయించారు. అయినా ఆశించిన ఫలితాలుచేకూరడం లేదు. ఇలాంటి సంఘటనలు జరగకుండా తిప్పికొట్టే స్థాయికి మన పోలీసుయంత్రాంగాన్ని సమయాత్తపరచాలి. అందుకు అవసరమైన ఆయుధ శిక్షణ, అత్యాధునిక సంపత్తిలాంటివి సమకూర్చాలి. ప్రజల్లో అభద్రతాభావానికి ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాలి. ఇప్పటికైనా పాలకులు ఉక్కుపాదమంటూ మాటల్లో కాకచేతల్లో చూపాలి. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతంకాకుండా నిర్దాక్షిణ్యంగా అణచివేయాలి. ప్రతి రాజకీయవాది సంకుచిత స్వార్థ ప్రయోజనాలుపక్కనబెట్టి దేశభద్రతకు నడుంకట్టాల్సినతరుణమిది. ఇందులో ఏమాత్రం ఓట్లకోసం దోబూచులాడితే జాతినైతికంగా మనోధైర్యం కోల్పోతుంది. ఎల్లకాలం భయాందోళనలతో కాలంవెల్లబుచ్చడం సమంజసంకాదు. అశాంతి రాజ్యమేలడం అరాచకపరిస్థితులు నెలకొనడం దేశానికి క్షేమంకాదు. •

# రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్!

ఇస్కా రాజేష్ బాబు

భారత ఆర్థిక వ్యవస్థ గురించి కీలక సమాచారంవెలుగులోకి వచ్చింది. 2038 నాటికి మన భారత్‌కొనుగోలు శక్తి సమానత్వం పరంగా ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగనుంది. ఇప్పటివరకు అభివృద్ధి చెందుతున్న దేశంగా ఉన్న ఇండియా, త్వరలోనే ప్రపంచంలో టాప్ ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలవబోతోంది. ఈ విషయం ఏదో ఊహ కాదు. ప్రముఖ అంతర్జాతీయ కాంపెనీ ఈవై తాజా నివేదిక ప్రకారం 2038 నాటికి భారతదేశం కొనుగోలు శక్తి సమతుల్యత ప్రకారం ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగబోతుంది. కొంతమందికి పీపీపీ అన్న పదం కొత్తగా అనిపించవచ్చు. సింపుల్‌గా చెప్పాలంటే ఒక్కో దేశంలో ఒకే తరహా వస్తువులకు ఉన్న ధరల తేడా ఆధారంగా ఆ దేశం ఆర్థిక శక్తిని అంచనా వేస్తారు. దీనివల్ల వాస్తవానికి ప్రజలు ఎంత కొనగలుగుతున్నారన్న దాని మీదస్పష్టమైన అవగాహన వస్తుంది. ఈ ఈవై నివేదిక ఐఎంఎఫ్ (ఇంటర్నేషనల్ మోనిటరీ ఫండ్ ) అంచనాల ఆధారంగా రూపొందించబడింది. 2030 నాటికి భారత్ ఆర్థిక వ్యవస్థ (పీపీపీప్రకారం) 20.7 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరుకుంటుందని అంచనా. ఇది అమెరికా, జర్మనీ, జపాన్ లాంటి పెద్ద దేశాల కంటే ఎక్కువ కావడం విశేషం. భారత్ ఎదుగుదలకు యువ జనాభా కారణంగాచెప్పవచ్చు. 2025 నాటికి భారత జనాభా మాధ్య వయస్సు 28.8 సంవత్సరాలు మాత్రమే. ఇది పని చేయగల శక్తివంతమైన వయస్సు. ఉన్నత ఆదాయం, పొదుపు రేటు కూడా మరో కారణంగా చెప్పవచ్చు. భారత్‌లో పొదుపు చేయడానికి పెట్టుబడులకు మంచి ఆదరణ ఉంది. కరెంట్ అకౌంట్ స్థిరత్వం కూడా మరో కారణం. ప్రభుత్వరుణం జీడీపీతో పోల్చినప్పుడు 2024లో 81.3 శాతం ఉండగా 2030 నాటికి అది 75.8శాతానికి తగ్గే అవకాశం ఉంది. చైనా ఇప్పటికీ ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. అయితే వారిలో వృద్ధాప్య జనాభా పెరగడం, ప్రభుత్వ రుణం పెరగడం వంటి సవాళ్లు ఉన్నాయి. అమెరికా మంచి స్థితిలో ఉన్నా, వారి రుణం జీడీపీ కంటే 120 శాతం ఎక్కువగా ఉంది. జర్మనీ, జపాన్ వంటి దేశాలు వృద్ధజనాభా, గ్లోబల్ ట్రేడ్‌పై ఎక్కువ ఆధారపడటం వల్ల కొంత పరిమితుల మధ్య కొనసాగుతున్నాయి. ఈవై నివేదిక ప్రకారం, మనం టెక్నాలజీ, మానవ వనరులు, పెట్టుబడుల పరంగా ముందుకు సాగుతున్నాం. మార్పులవల్ల దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా మారుతోంది. భారత్‌కు ఉన్న యువశక్తి, పెట్టుబడులఅవకాశాలు, స్థిరమైన అప్పు పరిమితి ఇవన్నీ గ్లోబల్ అస్థిరత ఉన్నా మనకు మంచి వృద్ధిని కలిగిస్తాయని నివేదిక అంచనా వేస్తోంది. 2028 నాటికి మార్కెట్ ఎక్స్ఛేంజ్ రేట్ ప్రకారం జర్మనీని దాటి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ మారనుంది. ఐఎంఎఫ్‌భారత జీడీపీ వృద్ధి అంచనాను 6.4 శాతానికి పెంచింది. బలమైన దేశీయ వృద్ధిని హైలైట్ చేసింది. అమెరికా సుంకాల ప్రభావాన్ని అధిగమించి, బ్రిక్స్ దేశాలలో భారత్ అత్యంత వేగవంతమైన వృద్ధి రేటును నమోదు చేస్తుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది. ఇంటర్నేషనల్ మానిటరింగ్ ఫండ్ ఇటీవల ప్రస్తుత ఆర్థికసంవత్సరానికి భారత జీడీపీ వృద్ధి అంచనాను 6.4 శాతంగా అంచనా వేసింది. ఇది బలమైన వృద్ధి నేపథ్యంలో అమెరికా సుంకాల ప్రభావాన్ని అధిగమించింది. ఐఎంఎఫ్ అంచనా ప్రకారం ప్రపంచజనాభాలో సగంమంది ప్రాతినిధ్యం వహిస్తున్న బ్రిక్స్‌దేశాలలో భారత్ అత్యంత వేగవంతమైన వృద్ధి రేటును చూస్తుందని అంచనా. అయితే బ్రిక్స్‌దేశాలలో ఇథియోపియా అత్యధికంగా 7.2శాతం వృద్ధి అంచనాను కలిగి ఉంది. బ్రిక్స్ దేశాలలో సగటు వృద్ధి 3.8 శాతం. జీ 7 దేశాలతో పోలిస్తే బ్రిక్స్‌దేశాలలో సగటు వృద్ధి 3.8 శాతంగా ఉంటుందని అంచనా, ఇది చాలా ఎక్కువ. సగటున బ్రిక్స్ వృద్ధి జీ 7రేటును మూడు రెట్లు మించి ఉంటుందని అంచనా. ఐఎంఎఫ్ అంచనా ప్రకారం జీ 7 సగటు వృద్ధి1శాతం ఉంటుందని అంచనా. వృద్ధాప్యజనాభా, తగ్గిన కార్మిక సరఫరా, పెరిగిన ఆర్థిక ఒత్తిడి ఈ దేశాలు ఎదురుగాలులను ఎదుర్కొంటున్న ప్రధాన కారకాల్లో ఉన్నాయి. మరీ ముఖ్యంగా 2025 లో జర్మనీ ప్రపంచంలోనే అత్యంత నెమ్మదిగా జీడీపీ వృద్ధి రేటును నమోదు చేసే దేశాలలో ఒకటిగా ఉంటుందని భావిస్తున్నారు. ఐ ఎం ఎఫ్ ప్రకారం ఆ దేశ జీడీపీ కేవలం 0.2శాతం మాత్రమే పెరుగుతుందని అంచనా. మరోవైపు భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఏప్రిల్ జూన్ కాలంలో ఐదు త్రైమాసికాల గరిష్ట వృద్ధిరేటు 7.8 శాతం సాధించింది. ఏప్రిల్ 2025 వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్‌లో దేశ ఆర్థిక వృద్ధిని 2025కి 6.2 శాతం, 2026 కి 6.3 శాతంగా అంచనా వేసింది. •

# ఈ సమాజం మత్తు వదిలేదెప్పుడు?

సీపతి వినయ్

చైతన్యమే మార్పుకు మార్గం, దేశం అభివృద్ధి చెందాలంటే యువత జాగ్రత్తగా, సృజనాత్మకంగా ముందుకు సాగాలి. కానీ నేటి కాలంలో ఆ యువశక్తిలో ఒక ముఖ్యమైన భాగం మత్తు పదార్థాల బారినపడుతోంది. ఇది శరీరాన్ని మాత్రమే కాదు, మనసును, కుటుంబాన్ని, భవిష్యత్తును సైతం నశింపజేస్తున్న నిశ్శబ్ద వ్యాధిగా మారింది. అందుకే మత్తు పదార్థాల నిర్మూలన ఇప్పుడు సామాజిక బాధ్యతగా, ప్రభుత్వ ప్రాధాన్యంగా నిలవాలి. మత్తు పదార్థాల ముప్పు పెరుగుతోంది. ప్రతీ రోజు వార్త పత్రికలో డ్రగ్ కేస్, గంజాయి స్వాధీనం, మద్యం మాఫియా వంటి శీర్షికలు కనబడటం సర్వసాధారణమవుతోంది. ఇది కేవలం చట్టవిరుద్ధ చక్రంలో జరిగే వ్యాపారం మాత్రమే కాదు, ఇది మన సమాజపు నాడిని నశింపజేస్తున్న మెత్తని విపత్తు. అసలు ప్రమాదం ఎక్కడంటే, ఈ వ్యసనం మొదట వినోదంగా, తర్వాత అలవాటుగా, చివరికి జీవన విధానంగా మారిపోతుంది. పాఠశాలల పిల్లల నుండి కళాశాల యువత వరకు, పట్టణ కార్మికుల నుండి గ్రామ కూలీల వరకు ఎవరూ దీనికి పూర్తిగా దూరంగా లేరు. మొదట పొగాకు, సిగరెట్, బీడీతో మొదలు పెట్టిన వారు క్రమంగా మద్యం, గంజాయి, డ్రగ్‌లు వంటి ఘోర మత్తు పదార్థాల వైపు వాలుతున్నారు. ఈ వ్యసనం కేవలం వ్యక్తి ఆరోగ్యానికే కాదు, కుటుంబాల ఆర్థిక స్థితికి విపత్తుగా మారింది. ఆరోగ్య నాశనం, ఆర్థిక పతనం మత్తు పదార్థాలు మన ఆరోగ్యవ్యవస్థలో ప్రమాదకరమైన మార్పులను కలిగిస్తాయి. కాలేయం దెబ్బతినటం, ఊపిరితిత్తుల పనితీరు తగ్గిపోవటం, రక్తపోటు, హృద్రోగాలు, మానసిక క్షోభలు ఇవన్నీ మత్తు వ్యసనంతో వచ్చే దుష్పరిణామాలు. శారీరకంగా బలహీనత మాత్రమే కాదు, బుద్ధి, నిర్ణయం, ఆలోచనలను మత్తు నాశనం చేస్తుంది. మత్తులో నేరాలు, హింస, రోడ్డు ప్రమాదాలు పెరుగుతాయి. ఈ మత్తు సామాజిక భద్రతకే సవాలుగా నిలుస్తోంది. ఆర్థికంగా కూడా మత్తు పదార్థాల వినియోగం హానికారకం. దినసరి కూలీ సంపాదనలో పెద్ద భాగం మత్తుకే వెళ్తుంది. కుటుంబాలు అప్పుల్లో పడతాయి. పిల్లల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు అన్నీ బలిపీఠంపై వేయబడతాయి. దేశ సంపదను సృష్టించాల్సిన యువతే తాను సృష్టించిన విష బంధంలో చిక్కుకుంటుంది. భారతదేశంలో ఎన్‌డిపిఎస్ చట్టం (1985) మత్తు పదార్థాల ఉత్పత్తి,



సరఫరా, దాచివేత, వినియోగంపై కఠిన చర్యలను నిర్దేశిస్తుంది. కానీ వాస్తవంలో ఈ చట్టం ఒక్కటే సరిపోదు, చట్టం భయంతో కొద్దిమందిని నియంత్రించవచ్చు కానీ ప్రయోజనకర మార్పు తెచ్చేది ప్రజల చైతన్యమే. అందుకే ప్రతి విద్యాసంస్థలో మత్తు వ్యతిరేక క్లబ్‌లు ఏర్పరచాలి. విద్యార్థుల్లో సేవా భావం, ఆరోగ్య చైతన్యం పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రభుత్వం, పోలీసు శాఖలు మాత్రమే కాకుండా ఉద్దేశపూర్వకంగా పని చేసే స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ వ్యసన నిర్మూలన యుద్ధంలో భాగస్వాములవ్వాలి. మత్తు వ్యసనం ఎక్కువగా కుటుంబ నిర్లక్ష్యంతో ప్రారంభమవుతుంది. తల్లిదండ్రులు పిల్లలలో ఏర్పడే భావోద్వేగ మార్పులను గుర్తించడం చాలా ముఖ్యం. స్నేహంగా మాట్లాడటం, సహనంగా వినడం, సమస్యలపై బోధించడం ఇవే సరైన మార్గాలు. పిల్లల పట్ల నియంత్రణ కంటే చైతన్యం, ఒత్తిడి కంటే ప్రేమ ఉత్తమ పరిష్కారం. సమాజస్థాయిలో, ముఖ్యంగా గ్రామాలలో, కాలనీల్లో మత్తు వ్యతిరేక కమిటీలు ఏర్పరచవచ్చు. వయోవృద్ధులు యువతతో తరచూ చర్చలు జరపాలి. మత్తు వ్యసనంతో బాధపడుతున్నవారిని విడిచిపెట్టకుండా సమాజం తిరిగి వారిని మంచి దారిలో నడిపించాలి. వారిని తక్కువచూపు చూడకుండా, కొత్త జీవితానికి ప్రేరణనివ్వాలి. టెలివిజన్, సినిమా, సోషల్ మీడియా ఇవన్నీ ప్రజల ఆలోచనలపై ప్రభావం చూపుతాయి. ఈ వేదికల్లో మత్తును ఆసక్తిగా, ఫ్యాషన్‌గా చూపించడం తగ్గించాలి. బదులుగా మత్తు వ్యసనం భయంకర ఫలితాలను నిజ జీవిత ఉదాహరణలతో చూపాలి. విశ్వవిద్యాలయాలు, గ్రామీణ పాఠశాలలు, పోలీసు శిక్షణ సంస్థలు కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే తర్వాత ఫలితాలు వస్తాయి. యువతకు క్రీడలు, యోగా, వాలంటీర్ సేవా కార్యక్రమాల మీద దృష్టిపెట్టే అవకాశం ఇవ్వాలి. ఈ మార్పే మత్తు రహిత జీవితానికి మూలం అవుతుంది. భవిష్యత్ దిశమత్తు పదార్థాలను నిర్మూలించడం కోసం చట్టం, అవగాహన, సమాజం సహకారం ఈ మూడు వర్గాల ఐక్యత అవసరం. చట్టం నియంత్రణ ఇస్తుంది, సమాజం సుస్థిర మార్పు తేగలదు, అవగాహన ఆత్మబలం ఇస్తుంది. ఈ మూడు కలిసినప్పుడే మత్తు వ్యసనం లేని ఆత్మగౌరవ భారతం నిర్మించవచ్చు. మన యువతను రక్షించడం అంటే దేశ భవిష్యత్తును కాపాడడం. ప్రతి పాఠశాల, కుటుంబం, మీడియా, ప్రభుత్వం అందరూ ఈ యుద్ధంలో భాగస్వాములు కావాలి. మత్తును విరమించి ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని ప్రతిజ్ఞ చేయడం సమాజ పట్ల మన కర్తవ్యం. నేటి అవసరం కొద్దిపాటి నినాదాలు కాదు, దీర్ఘకాల చైతన్యం. అందుకే మనం అందరం ఒకే మాట చెప్పాలి మత్తు లేని మనసు, మత్తు లేని సమాజం, మత్తు లేని భారతం. అదే మన నిజమైన స్వాతంత్ర్యం. •

# 'ఎస్కేపేడ్' సక్సెస్

## అంగారకుడి దిశగా సాగుతున్న ప్రయాణం

### మార్స్‌పై వాతావరణాన్ని పరిశీలించేందుకు నాసా ప్రయోగించిన రెండు ఉపగ్రహాలు



**వాషింగ్టన్, నవంబరు 14:** అమెరికా అంతరిక్ష సంస్థ నాసా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మార్క్ మిషన్ 'ఎస్కపేడ్' ప్రయోగం విజయవంతమైంది. అపరకుబేరుడు, అమెజాన్ అధిపతి జెఫ్ బెజోస్‌కు చెందిన 'బ్లూ ఆర్జిన్'కు చెందిన జంబో రాకెట్ అంతరిక్ష నౌకను నింగిలో ప్రవేశపెట్టింది. తర్వాత సదరు రాకెట్ విజయవంతంగా భూమిని చేరింది. వాతావరణ సమస్యలు, సౌర తుపాను కారణాలతో కొన్ని రోజులుగా వాయిదా పడుతూ వస్తున్న 'ఎస్కపేడ్' మిషన్ ఎట్టకేలకు గురువారం అంగారకుడి దిశగా తన ప్రయాణాన్ని ప్రారంభించింది. ఫ్లోరిడా తీరంలో కేప్ కెనవెరల్ స్పేస్ స్టేషన్ నుంచి అతిశక్తివంతమైన రాకెట్ అయిన 'న్యూ గ్లెన్'తో అంతరిక్ష నౌక ఆకాశంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రయోగంతో 321 అడుగుల భారీ రాకెట్ అయిన 'న్యూ గ్లెన్'.. రోబోటిక్ మార్స్ సైన్స్, భారీ వాణిజ్య రాకెట్లకు సంబంధించి కొత్త శకానికి నాంది పలికింది. 'ఎస్కపేడ్'ను నాసా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టడానికి గల కారణం ఈ మిషన్‌లో రెండు ఉపగ్రహాలు ఉండడమే. బ్లూ, గోల్డ్ పేర్లు కలిగిన ఈ ఉపగ్రహాలు అంగారకుడి వాతావరణాన్ని పరిశీలించనున్నాయి. అంగారక గ్రహం ఎలా తన వాతావరణాన్ని కోల్పోయిందో ఇవి పరిశోధించనున్నాయి. మార్స్ పరిణామం, నివాసయోగ్యతకు సంబంధించి అర్థం చేసుకోవడానికి ఈ ప్రయోగం ఉపయోగపడనుంది. అంతేకాకుండా ఈ ఉపగ్రహాలు మార్స్ అయస్కాంత క్షేత్రం, ప్లాస్మా వాతావరణాన్ని శోధించనున్నాయి. బిలియన్ల యేళ్ల కొద్ది నిగూఢంగా ఉన్న డేటాను ఇవి సేకరించనున్నాయి.

'ఎస్కసేడ్' అంతరిక్ష వాహక నౌక ఒక యేడాదిపాటు భూకక్ష్యలో తిరుగుతూ 2027 నాటికి అంగారకుడి కక్ష్యలోకి చేరనుంది. ఒకసారి మార్స్ కక్ష్యలోకి ప్రవేశించగానే బ్లూ, గోల్డ్ ఉపగ్రహాలు పనిచేయడం ప్రారంభిస్తాయి. ప్రయోగం తర్వాత జంబో రాకెట్ అయిన 'న్యూ గ్లెన్' తిరిగి భూమిని చేరింది. అట్లాంటిక్ సముద్రంలోని రికవరీ షిప్ జాక్లయిన్‌పై సురక్షితంగా దిగింది. దీంతో బ్లూ ఆర్జిన్ చరిత్రలో ఈ ప్రయోగం ఒక మైలురాయిగా మిగిలింది. ఇప్పటి వరకు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్‌కు మాత్రమే రాకెట్ల రీయూజబుల్ టెక్నాలజీ ఉంది. తాజాగా 'బ్లూ ఆర్జిన్' ఆ మార్క్‌ను పొందింది. దీంతో స్పేస్ ఎక్స్‌కు బ్లూ ఆర్జిన్ పోటీదారుగా మారింది.

# ఉప ఎన్నికల్లో కొంత భేదం, కొంత మోదం



**న్యూఢిల్లీ, నవంబరు 14:** జమ్మూకాశ్మీర్‌తోపాటు ఏడు రాష్ట్రాల్లో 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో బిజెపికి తీపి విజయాలు, చేదు ఓటములు లభించాయి. ఉప ఎన్నికలు జరిగిన 8 స్థానాల్లో బిజెపి రెండు స్థానాల్లో విజయం సాధించగా, కాంగ్రెస్ రెండు సీట్లు చేజిక్కించుకుంది. రాజస్థాన్‌లోని సిట్టింగ్ స్థానాన్ని బిజెపి చేజార్చుకోగా, కాంగ్రెస్ విజయం సాధించింది. అలాగే తెలంగాణలో బిఆర్‌ఎస్ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. తెలంగాణలోని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థి డిపాజిట్ కోల్పోవడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ అసెంబ్లీ నియోజకవర్గం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ పరిధిలోనిది. జమ్మూకాశ్మీర్‌లోని నగ్రోటాలో బిజెపి సిట్టింగ్ స్థానం తిరిగి కైవసం చేసుకుంది. దేవేందర్ సింగ్ రాణా మరణంతో ఆ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించగా, అతని కుమార్తె దేవ్‌యాని రాణా 24,647 ఓట్ల తేడాతో జమ్మూకాశ్మీర్ నేషనల్ పాంథర్స్ పార్టీ అభ్యర్థి

## బిజెపికి జమ్ముకశ్మీర్‌లో గెలుపు, రాజస్థాన్‌లో ఓటమి

### ఆయా రాష్ట్రాల్లో అధికార పార్టీలదే హవా

హర్ష్ దేవ్ సింఘ్‌పై విజయం సాధించారు. మరోవైపు అధికార నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) సిట్టింగ్ స్థానం 'బుద్గామ్'లో పరాజయం పాలైంది. ఇక్కడ పిడిపి అభ్యర్థి అగా సయ్యద్ ముంతాజిర్ 4,478 ఓట్లతో గెలుపొందారు. ఒడిశాలో నుపాడ స్థానాన్ని అధికార బిజెపి తిరిగి నెలబెట్టుకుంది. కాంగ్రెస్ అభ్యర్థి ఘసి రామ్ మాజీపై 83,748 ఓట్ల తేడాతో బిజెపి అభ్యర్థి జయ్ ధోలకియా విజయం సాధించాడు. రాజస్థాన్‌లో అధికార బిజెపి సిట్టింగ్ స్థానం "అంటా"లో 15,612 ఓట్లతో ఓడిపోయింది. ఇక్కడ ప్రతిపక్ష కాంగ్రెస్ అభ్యర్థి ప్రమోద్ జైన్ విజయం సాధించారు. పంజాబ్‌లో టర్న్‌టరన్ నియోజకవర్గంలో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) మళ్లీ జెండా ఎగరేసింది. శిరోమణి అకాలీదల్ అభ్యర్థి సుఖ్వీందర్ కౌర్‌ను 12,091 ఓట్ల తేడాతో ఆప్ అభ్యర్థి హర్మీత్ సింగ్ సంధు ఓడించాడు. తెలంగాణలోని జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించాడు. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో నిర్వహించిన ఉప ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున దివంగత గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత పోటీ చేయగా, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ 24,729 ఓట్లతో విజయం సాధించాడు. జార్ఖండ్‌లో అధికార జెఎంఎం తన సిట్టింగ్ స్థానం ఘట్‌శిలను తిరిగి నిలబెట్టుకుంది. ప్రతిపక్ష బిజెపి అభ్యర్థి బాబులాల్ సొరేన్‌పై 38,601 ఓట్ల తేడాతో జెఎంఎం అభ్యర్థి సోమేష్ చంద్ర సొరేన్ విజయం సాధించాడు. మిజోరంలో ఎంఎన్‌ఎఫ్ అభ్యర్థి డా. ఆర్.లలాథంగ్లియానా 562 ఓట్ల తేడాతో జొరమ్ పీపుల్స్ మూవ్‌మెంట్ అభ్యర్థి వన్‌లాల్‌సైల్వోను ఓడించాడు. మొత్తంగా ఉప ఎన్నికల ఫలితాల తీరును పరిశీలిస్తే,

రాజస్థాన్, జమ్మూకాశ్మీర్ మినహా ఆయా రాష్ట్రాల్లోని అధికార పార్టీ అభ్యర్థులే విజయం సాధించారు. రాజస్థాన్‌లో అధికార బిజెపి సిట్టింగ్ స్థానాన్ని చేజార్చుకోగా, కాశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ తన స్థానాన్ని ప్రతిపక్ష పిడిపికి అప్పగించింది.

# బీహార్‌లో కాంగ్రెస్ మరింత పతనం

- 2020కంటె తక్కువగా సీట్లు, ఓట్లు - పనిచేయని రాహుల్ ఓట్ చోరీల ప్రచారం
- తాజా ఫలితాల్లో 6 సీట్లు మాత్రమే - 8.75 శాతానికి పడిపోయిన ఓట్లు

**పాట్నా, నవంబరు 14:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలలో అత్యంత ఘోరపరాభవం కాంగ్రెస్‌కు ఎదురైంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి, ప్రత్యేకించి ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి భారీ షాక్ ఇచ్చాయి. బీజేపీ ఓట్లను దొంగిలిస్తోందంటూ రాహుల్ చేపట్టిన ఓటర్ అధికార్ యాత్ర పూర్తిగా విఫలమైంది. పోటీ చేసిన 61 స్థానాల్లో కాంగ్రెస్ కేవలం 6 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. ఈ ఏడాది ఆగస్టులో రాహుల్ గాంధీ 'ఓటర్ అధికార్ యాత్ర' ప్రారంభించారు. సుమారు 1,300 కిలోమీటర్ల మేర 25 జిల్లాల్లోని 110 నియోజకవర్గాల గుండా ఈ యాత్ర సాగింది. అయితే, యాత్ర సాగిన ఒక్క నియోజకవర్గంలో కూడా కాంగ్రెస్‌కు అనుకూల పవనాలు వీయకపోవడం గమనార్హం. గతంలో రాహుల్ చేపట్టిన 'భారత్ జోడో' యాత్ర 2023 తెలంగాణ, 2024 లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి మేలు చేశాయని భావించినప్పటికీ, బీహార్‌లో ఆ మ్యాజిక్ పనిచేయలేదు. ఎన్నికల జాబితా సవరణల పేరుతో బిజెపి ఓట్లను తొలగిస్తోందన్న రాహుల్ ఆరోపణలను బీహార్ ఓటర్లు విశ్వసించలేదని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. దీనికి తోడు, మహాఘట్‌బంధన్‌లో ఐక్యత లేకపోవడం, తేజస్వి యాదవ్‌ను సిఎం అభ్యర్థిగా ప్రకటించడంలో కాంగ్రెస్ సంశయించడం, ఉమ్మడి ప్రచార వ్యూహం కొరవడటం వంటి అంశాలు కూడా ఓటమికి ప్రధాన కారణాలుగా విశ్లేషకులు భావిస్తున్నారు. యాత్రతో కార్యకర్తల్లో వచ్చిన ఉత్సాహం ప్రచారం ముగిసేనాటికి నీరుగారిపోయింది. 2020 ఎన్నికలతో పోలిస్తే... ఓట్లు, సీట్ల పరంగా కాంగ్రెస్ పార్టీ చాలా దిగజారిపోయింది. 2020లో 27శాతం ఓట్లతో 21 స్థానాల్లో విజయం సాధించగా, ఈ సారి 8.75శాతం ఓట్లు రాగా 6 స్థానాల్లో గెలుపొందింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 22.2 శాతం ఓట్లు పొంది 3 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. గత మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ గణనీయంగా బీహార్‌లో చతికిలపడిపోతోంది. ప్రతి ఎన్నికల్లోనూ ఓట్లు, సీట్ల పరంగా తగ్గుతూ వస్తోంది.



## బుద్గాంలో సిఎం ఒమర్ అబ్దుల్లాకు షాక్..

## పిడిపి అభ్యర్థి విక్టరీ

**శ్రీనగర్, నవంబరు 14:** జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లాకుషాక్ ఎదురైంది. గత ఏడాది ఆయన రాజీనామా చేసిన కంచుకోట బుద్గామ్ లో నేషనల్ కాన్ఫరెన్స్ ఓడిపోయింది. పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థిగా సయ్యద్ ముంతాజీర్ ఈ స్థానాన్ని గెలుచు కున్నారు. గత ఏడాది జరిగిన జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో కుటుంబానికి కంచుకోట అయిన గందేర్‌బాల్‌తో పాటు పార్టీ కంచుకోట బుద్గామ్‌లో ఒమర్ అబ్దుల్లా పోటీ చేశారు. రెండు స్థానాల్లో గెలుపొందడంతో బుద్గామ్ స్థానానికి రాజీనామా చేశారు. కాగా, నవంబర్ 11న బుద్గామ్‌తోపాటు నగ్రోటాకు ఉప ఎన్నికలు జరిగాయి. శుక్రవారం వెలువడిన ఫలితాలు సీఎం ఒమర్ అబ్దుల్లాకు షాక్ ఇచ్చాయి. మెహబుబా ముఫ్తీ నేతృత్వంలోని పీడీపీ అభ్యర్థి అగా సయ్యద్ ముంతాజీర్ బుద్గామ్‌లో విజయం సాధించారు.

## తరన్‌తరన్ సెగ్మెంట్‌లో ఆప్ విజయం



**అమృత్‌సర్, నవంబరు 14:** ఆమ్ ఆద్మీ పార్టీ పంజాబ్ లో తన సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకుంది. తారన్ తరన్ నియోజకవర్గం నుంచి పంజాబ్ అసెంబ్లీ కి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆప్ ఎమ్మెల్యే కశ్మీర్ సింగ్ సోహాల్ ఈ ఏడాది జూన్‌లో మరణించడంతో ఆ స్థానానికి ఈ నెల 11న ఉప ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఆప్ అభ్యర్థి హర్మీత్ సింగ్ సంధూ 12 వేలకు పైచిలుకు ఓట్లతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో ఆప్ అభ్యర్థికి మొత్తం 42,649 ఓట్లు రాగా శిరోమణి అకాలీదళ్ అభ్యర్థి, తన సమీప ప్రత్యర్థి రంధావాకు 30,558 ఓట్లు పోలయ్యాయి. అంటే 12,091 ఓట్ల మెజారిటీతో ఆప్ తన సిట్టింగ్ స్థానంలో గెలిచింది. స్వతంత్ర్య అభ్యర్థి మన్‌దీప్ సింగ్ 19,620 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. కాంగ్రెస్‌కు నాలుగో స్థానం, బీజేపీకి ఐదో స్థానం దక్కింది. కాగా ఈ విజయం వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌కు కలిసివచ్చే అవకాశం ఉంది. పంజాబ్‌లో ఆప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు మొత్తం ఏడు స్థానాలకు ఉప ఎన్నికలు జరుగగా ఆరు స్థానాల్లో ఆప్ గెలిచింది.

# పడిలేచిన కెరటం చిరాగ్‌పాశ్వాన్!

## ఒక్కసీటునుంచి 75% స్ట్రైక్‌రేట్ సాధించిన యువకెరటం



**పాట్నా, నవంబరు 14:** ప్రధానిమోడీకి హనుమంతుడి లాంటివాడినని ఆయనకు విధేయుడిగానే కొనసాగుతానని ముందునుంచి చెపుతూ వస్తున్న ఎల్జేపీ పాశ్వాన్ పార్టీ అధినేత చిరాగ్‌పాశ్వాన్ ఒక్కసీటునుంచి పడిలేచి ఏకంగా 22 స్థానాలు సాధించిన అధినేతగా నిలిచారు. బీహార్‌ప్రభుత్వం ఏర్పాటులో ఇపుడు కీలకంగా కొనసాగుతున్నారు. ముందునుంచి కూడా పాశ్వాన్‌కుటుంబం మోడీకి అండగానే నిలిచింది. రాముడికి ఆంజనేయుడిగా ఆనాడు రామ్‌విలాస్‌పాశ్వాన్ నిలిస్తే ఇపుడు చిరాగ్‌పాశ్వాన్‌కూడా అదే విధంగా కొనసాగారు. ఒక్కసీటుకే పరిమితమై రాజకీయాల్లో వెనక్కి నెట్టేసారని భావించిన చిరాగ్‌పార్టీ ఇపుడు ఏకంగా 22 స్థానాలు నిలబెట్టుకుని తన సత్తాను చూపించింది. ఈ విజయంతో చిరాగ్‌పై ఉన్న "ఓట్ కట్టర్" అనే ముద్ర పూర్తిగా తుడిచిపెట్టుకునిపోయింది. ఎన్డీయే కూటమిలోని బిజెపి జెడియులతోకలిసి పోటీచేసిన ఎల్జేపీఆర్వీపీ పార్టీ మంచి పనితీరుచూపించింది. పాట్నాలోని రాజకీయ సమీకరణాలనుపూర్తిగా మార్చివేసింది. 2020 ఎన్నికలతోపోలిస్తే చిరాగ్‌కు అతిపెద్ద రాజకీయ మలుపుగా నిలిచింది. ఆనాటి ఎన్నికల్లో చిరాగ్ 137 స్థానాల్లో పోటీచేసినా ఒకే సీటు గెలిచారు. అప్పటి సీఎం నితీష్‌కుమార్‌ను టార్గెట్‌చేసుకుని చేసిన ప్రచారం జెడియు ఓట్లను సమూలంగా చీల్చివేసింది. దీనితో ఆపార్టీ బలం 71 నుంచి 43స్థానాలకు పడిపోవడంతో చిరాగ్ కీలకం అయ్యారు. అయితే ఈసారి ఎల్జేపీ కేటాయించిన 29 స్థానాల్లో 22 స్థానాల్లో గెలిచి తన టార్గెట్, సత్తాను నిరూపించింది. పార్టీలో అంతర్గత కుమ్ములాటలు, బాబా పశుపతినాథ్ పరాస్‌తో చీలిక తర్వాత చిరాగ్ రాజకీయంగా తన బలం క్రమేపీ పునరుద్ధరించుకోగలిగారు. ఎన్నికల సంఘం పార్టీగుర్తును పేరును సైతం హోల్డ్‌లో ఉంచింది. ఆదశలోనే కొత్తపార్టీని స్థాపించి తన తండ్రి వైభవాన్ని కొనసాగించారు. 43 ఏళ్ల చిరాగ్ గతంలో నితీష్‌కుమార్‌పైనే తన అభ్యంతరాలని, ప్రధానిమోడీ లేదా బిజెపితో కానేకాదని స్పష్టంచేసారు. అయితే ఈ ఎన్నికల్లో ఆయన వైరాన్ని పక్కనపెట్టారు. పార్టీ ఉత్తర, మధ్య, దక్షిణ బీహార్‌లలోని బహదూర్‌గంజ్, గోవింద్ గంజ్, మహువా, భక్తియార్‌పూర్‌వంటి నియోజకవర్గాల్లో తన సత్తాను చూపించింది.

# 95సార్లు ఓడిపోయి రికార్డు సాధించిన రాహుల్

## బీహార్ ఎన్డీయే విజయంపై బిజెపి సెటైర్లు



**న్యూఢిల్లీ, నవంబరు 14:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్ష మహాగఠ్‌బంధన్ కూటమి చితికిలపడిపోయింది. 243 అసెంబ్లీ స్థానాలకు గానూ 30 స్థానాల్లో కూడా ప్రభావంచూపించలేదు. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ప్రభంజనం సృష్టించింది. మూడింట రెండు వంతుల మెజారిటీతో దూసుకుపోయింది. ఏకంగా 200కిపైగా స్థానాల్లో గెలిచింది. ఇక ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష కూటమి ఘోర పరాభవం కావడంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ లక్ష్యంగా బీజేపీ నేతలు సెటైర్లు వేస్తున్నారు. రాహుల్ ఇప్పటి వరకూ 95 ఎన్నికల్లో ఓడిపోయారంటూ ఎద్దేవా చేస్తున్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. 2004 నుంచి 2025 వరకూ దేశంలో జరిగిన ఎన్నికల్లో రాహుల్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ దాదాపు 95 ఎన్నికల్లో ఓడిపోయిందని బీజేపీ నేత అమిత్ మాలవీయ అన్నారు. 'ఇది రాహుల్ గాంధీకి మరో ఎన్నిక, మరో ఓటమి. ఈ ఓటమితో రాహుల్ 95 సార్లు ఓడిన రికార్డును కైవసం చేసుకున్నారు. ఎన్నికల ఓటముల్లో స్థిరత్వానికి అవార్డులు ఉంటే అవన్నీ రాహుల్‌కే దక్కుతాయంటూ మాలవీయ ఎక్స్ పోస్టులో ఎద్దేవా చేశారు. ప్రస్తుతం ఈ పోస్టు వైరల్ అవుతోంది. కాగా, దేశంలో ఓట్ల చోరీ జరిగిరందంటే రాహుల్ గత కొంతకాలంగా తీవ్ర ఆరోపణలు చేస్తోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీహార్ ఎన్నికల్లో 'ఓట్ చోరీ' అస్త్రంగా బరిలోకి దిగారు. ఎన్నికలకు ముందు దాదాపు 23 జిల్లాల పరిధిలో 16 రోజులపాటూ 'ఓటర్ అధికార్ యాత్ర' చేపట్టారు. తమను ఓడించేందుకు బీజేపీ, ఎన్నికల సంఘం కుమ్మక్కై కుట్రలు చేస్తున్నాయంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీ 'ఓట్ చోరీ' ప్రభుత్వం అంటూ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు.

# అసెంబ్లీ ఎన్నికల్లో జానపద గాయని సంచలనం

## 25 ఏళ్లకే ఆలినగర్ ఎమ్మెల్యేగా మైథిలీ ఠాకూర్ విజయం



**ఆలినగర్,(బీహార్), నవంబరు 14:** ఆధ్యాత్మిక, జానపద గీతాలను ఆలపిస్తూ సోషల్‌మీడియాను కుదిపేసిన మైథిలీ ఠాకూర్ ఇప్పుడు బీహార్ రాజకీయాల్లో సంచలన రికార్డు నెలకొల్పారు. బీహార్ అసెంబ్లీకి ఎన్నికైన 25 ఏళ్ల అతిపిన్న వయస్కురాలిగా నిలిచారు. మైథిలీ ఠాకూర్ అలీనగర్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా రంగంలోకి దిగిన ఆమె ఆర్జేడీ దిగ్గజ నేత వినోద్ మిశ్రాను 11 వేల పైచిలుకు ఓట్ల తేడాతో ఓడించారు. దాంతో తొలిసారి బీహార్ అసెంబ్లీలో అడుగు పెట్ట బోతున్నారు. వాస్తవానికి 2008లో అలీనగర్ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత బీజేపీ ఇక్కడ తొలిసారి జయకేతనం ఎగురవేసింది. ఇన్‌స్టా, యూట్యూబ్‌లో కలిపి ఆమెకు 1.1 కోట్ల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ఇక ఫేస్‌బుక్‌లో అయితే 1.4 కోట్ల మంది ఆమెను అనుసరిస్తున్నారు. 2024లో శబరి మీద పాడిన ఆమె పాట ప్రధాని మోదీని ఆకర్షించింది. ఆమెపై ప్రశంసల జల్లు కురిపించారు. మైథిలీ ఠాకూర్ 2000 జూలై 25న మధుబని లోని బేనిపట్టిలో జన్మించారు. ఆమె తండ్రి రమేశ్ ఠాకూర్ శాస్త్రీయ సంగీతకారుడు, గాయకుడు.

# పార్టీలను గెలిపించి సొంతింట్లో ఓటమి చవిచూసిన ప్రశాంత్‌కిశోర్



**పాట్నా,నవంబరు 14:** దేశంలో ప్రధాన రాష్ట్రాల ఎన్నికల్లో రాజకీయ పార్టీల విజయాల్లో కింగ్‌మేకర్‌గా నిలిచి ఆపార్టీలు ప్రభుత్వం ఏర్పాటుకు ఎంతో దోహదంచేసిన ఐపాక్ అధినేత, జన్‌సురాజ్‌పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్‌కిశోర్ సొంతరాష్ట్రంలో మాత్రం చతికిల పడ్డారు. పోటీచేసిన స్థానాల్లో ఏ ఒక్కస్థానాల్లోను విజయం సాధించలేకపోయారు. బీహార్‌లోని అన్ని 243 స్థానాల్లో తన అభ్యర్థులను పోటీకి దించారు. వస్తే 150 సీట్లు వస్తాయి లేదంటే పదిస్థానాలు వస్తాయి. రాజకీయ పార్టీల ఓట్లను ఖచ్చితంగా చీల్చగలమన్న ధీమాతో 2022నుంచే జన్‌సురాజ్‌పార్టీని స్థాపించి బీహార్ మొత్తం పాదయాత్రలుచేసారు. అన్నిస్థానాల్లో పోటీచేసినా కేవలం 3.5శాతం ఓట్లతోమాత్రమే సరిపెట్టుకుంది. బీహార్‌లో కొన్ని స్థానాల్లో మూడోస్థానానికే పరిమితం కావడం గమనార్హం. ఇండియా పొలిటికల్ యాక్షన్ కమిటీ (ఐపాక్)ను స్థాపించి బెంగాల్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, బీహార్‌లోని జెడియు అధినేత నితీష్‌కుమార్, ఆప్ కేజ్రీవాల్‌కు సలహాలు వంటివి ఇచ్చి ఆ పార్టీలు విజయంలో కీలక భూమిక పోషించారు. అంతేకాకుండా ఆయన వ్యూహరచన చేసిన పార్టీలన్నీ కూడా భారీ మెజార్టీస్థాపించి ప్రభుత్వాలను ఏర్పాటుచేసాయి. పార్టీపరంగా కొత్తముఖాలు, నేరచరితలేని, రాజకీయ నేపథ్యంలేని వారిని పరిచయం చేయడం కూడా ఆయనకు మైనస్ అయింది. అంతేకాకుండా సామాజికవేత్తలు, ఆర్థికవేత్తలు, మేధావులు, మాజీ ఉన్నతాధికారులను ఏకంచేసేందుకు ప్రయత్నాలుచేసినా అవేమీ ఫలించలేదు. విద్య ఆరోగ్యం, ఉద్యోగాలు, వలసలకట్టడిపై హామీలు ఇచ్చారు. అధికారంలోకి వస్తే మద్యపాన నిషేధం ఎత్తివేసి వచ్చే ఆదాయం మొత్తం అభివృద్ధికోసమే ఖర్చుచేస్తామన్నారు. ఆయనసభలకు రోడ్‌షోలకు భారీసంఖ్యలో ప్రజలు హాజరయినప్పటికీ వాటిని ఓట్లుగా మార్చుకోలేకపోయారు. ఎన్నికలకు ముందు కొన్నిచోట్ల పార్టీకేడర్ తిరుగుబాట్లు, చివరిక్షణంలో పార్టీలు మారడం వంటివికూడా జన్‌సురాజ్‌ను దెబ్బతీసాయని చెప్పాలి. ప్రధాన పార్టీలన్నీ కూడా జన్‌సురాజ్‌ను ప్రధాన పార్టీల బి-టీమ్ అంటూ ప్రచారాలుచేసారు.

# అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను క్షమాపణ కోరిన బిబిసి

## పరిహారం చెల్లించేందుకు మాత్రం తిరస్కరణ




**వాషింగ్టన్, నవంబరు 14:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ప్రఖ్యాత మీడియా సంస్థ బీబీసీ క్షమాపణలు తెలిపింది. ఆయన డిమాండ్ చేసిన 1 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 8,300 కోట్లు) నష్ట పరిహారాన్ని చెల్లించేందుకు మాత్రం నిరాకరించింది. 2021 జనవరి 6న ట్రంప్ చేసిన ప్రసంగాన్ని తప్పుగా ఎడిట్ చేసి తమ డాక్యుమెంటరీలో చూపించామని అంగీకరిస్తూ, ఈ మేరకు శ్వేతసౌధానికి బీబీసీ ఛైర్మన్ సమీర్ షా స్వయంగా లేఖ రాశారు. 2024 అమెరికా అధ్యక్ష ఎన్నికలకు కొద్ది రోజుల ముందు బీబీసీ తన ఫ్లాగ్‌షిప్ సిరీస్ పనోరమాలో "ట్రంప్: ఎ సెకండ్ ఛాన్స్?" అనే పేరుతో ఒక డాక్యుమెంటరీని ప్రసారం చేసింది. ఇందులో 2021 జనవరి 6న యూఎస్ క్యాపిటల్ భవనంపై దాడికి ముందు ట్రంప్ చేసిన ప్రసంగానికి సంబంధించిన వీడియోను ఉపయోగించారు. అయితే, దాదాపు గంట వ్యవధిలో ట్రంప్ మాట్లాడిన వేర్వేరు భాగాలను కలిపి, ఒకేసారి మాట్లాడినట్లుగా చూపించారు. ట్రంప్ తన మద్దతుదారులను ఉద్దేశించి "నాతో పాటు కవాతు చేయండి", "పిడికిలి బిగించి పోరాడండి" అన్న మాటలను ఒకే వాక్యంగా ఎడిట్ చేశారు. కానీ, తన మద్దతుదారులు శాంతియుతంగా నిరసన తెలియజేయాలని ఆయన కోరిన భాగాన్ని తొలగించారు. ఈ ఎడిటింగ్ వల్ల ట్రంప్ నేరుగా హింసకు పిలుపునిచ్చినట్లు పొరపాటున అర్థం వచ్చేలా ఉందని బీబీసీ తన ప్రకటనలో అంగీకరించింది. వేర్వేరు భాగాలను కలిపి చూపడం ద్వారా, అది ఒకే ప్రసంగం అనే తప్పుడు అభిప్రాయాన్ని మా ఎడిటింగ్ ఉద్దేశపూర్వకంగా కాకుండానే కలిగించిందని మేము అంగీకరిస్తున్నామని పేర్కొంది. ఈ వివాదం బీబీసీ ప్రతిష్టను దెబ్బతీస్తోందని, బాధ్యత తనదేనని పేర్కొంటూ డైరెక్టర్‌జనరల్ టిమ్ డేవి, న్యూస్ చీఫ్ డెబొరా టర్నెస్ తమ పదవులకు రాజీనామా చేశారు.

# సంక్షిప్తంగా..

## అల్‌ఫలా వర్సిటీలో ఉమర్ తాలిబన్ తరహా ఆంక్షలు




**న్యూఢిల్లీ, నవంబరు 14:** ఢిల్లీలోని ఎర్రకోట వద్ద కారు బాంబు పేల్చి ఆత్మాహుతి దాడికి పాల్పడిన డాక్టర్ ఉమర్ మహమ్మద్, గతంలో తాను పనిచేసిన యూనివర్సిటీలో తాలిబన్ తరహా కఠిన నిబంధనలు అమలు చేసేవాడని విద్యార్థులు వెల్లడించారు. ఈ ఉగ్రకుట్రతో సంబంధమున్న ఇద్దరు డాక్టర్లు పనిచేసిన ఫరీదాబాద్‌లోని అల్ ఫలా యూనివర్సిటీలో ఇండియా టుడే స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) చేపట్టిన స్టింగ్ ఆపరేషన్‌లో ఈ సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. నవంబర్ 10న జరిగిన ఐ20 కారు పేలుడులో ఆత్మాహుతి బాంబర్‌గా ఉన్న డాక్టర్ ఉమర్ మహమ్మద్, మరో నిందితుడు డాక్టర్ ముజమ్మిల్ సయీద్ గతంలో ఈ యూనివర్సిటీలోనే అధ్యాపకులుగా పనిచేశారు. వారి గురించి ఇండియా టుడే ప్రతినిధులు విద్యార్థులు, సిబ్బందిని

## ఆసుపత్రిలో కోలుకున్న బాలీవుడ్ నటుడు గోవిందా!



**ముంబయి, నవంబరు 14:** ప్రముఖ బాలీవుడ్ నటుడు గోవిందా ముంబైలోని తన నివాసంలో స్పృహ తప్పి పడిపోవడంతో ఆయన్ను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అయితే, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం పూర్తిగా మెరుగుపడిందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన అర్ధాంగి సునీత అహుజా స్పష్టం చేశారు. సునీత తన యూట్యూబ్ వ్లాగ్‌లో గోవిందా ఆరోగ్యం గురించి మాట్లాడుతూ గోవిందా ఇప్పుడు పూర్తిగా ఫిట్‌గా ఉన్నారు. తన కొత్త సినిమా దునియాదారీ కోసం ఆయన చాలా కష్టపడి వర్కౌట్లు చేస్తున్నారు. ఆ క్రమంలోనే అలిసిపోయి స్పృహ తప్పి పడిపోయారు. కానీ ఇప్పుడు ఆయన బాగానే ఉన్నారు. ఎవరూ ఆందోళన పడొద్దని ఆమె తెలిపారు. గోవిందా ఆసుపత్రిలో చేరిన విషయం ఆయన మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూ చూసి తనకు తెలిసిందని సునీత పేర్కొన్నారు.

## జమ్ముకాశ్మీర్‌లో నాగ్రోటాలో బిజెపి అభ్యర్థి విజయం



శ్రీనగర్, నవంబరు 14: జమ్మూకశ్మీర్‌లోని నాగ్రోటా అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి దేవయాని రాణా ఘన విజయం సాధించారు. అత్యంత ఆసక్తికరంగా సాగిన ఈ పోరులో అధికార పార్టీ అభ్యర్థి కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేకపోవడం రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమైంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు దేశంలోని పలు నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న క్రమంలో నాగ్రోటా తీర్పు వెల్లడైంది. ఈ నియోజకవర్గంలో రాణా కుటుంబానికి ఉన్న పట్టు మరోసారి నిరూపితమైంది. ఈ విజయంపై దేవయాని రాణా స్పందిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. నాగ్రోటా ప్రజలు నన్ను ఒక కుటుంబ సభ్యురాలిగా భావించి ఆశీర్వదించారు. మా తండ్రి రాణా సాహిబ్‌పై చూపిన ప్రేమాభిమానాలనే నాపై కూడా చూపించారని ఆమె అన్నారు. నాగ్రోటాలో వచ్చిన తీర్పే బీహార్‌లో కూడా కనిపిస్తోందని ఆమె వ్యాఖ్యానించారు.

## వృక్షమాత పద్మశ్రీ 'తిమ్మక్క' కన్నుమూత

**బెంగళూరు, నవంబరు 14:** ప్రముఖ పర్యావరణవేత్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత, 'వృక్షమాత'గా పేరుగాంచిన సాలుమరద తిమ్మక్క (114) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ప్రకృతిని ప్రేమించి, వేలాది మొక్కలను నాటి వాటినే తన పిల్లలుగా భావించి పెంచిన ఆమె మరణంతో పర్యావరణ ఉద్యమానికి తీరని లోటు ఏర్పడింది. కర్ణాటకలోని తుమకూరు జిల్లా గుబ్బి తాలూకాలో 1911 జూన్ 30న తిమ్మక్క జన్మించారు.

VIJAYAWADA MUNICIPAL CORPORATION
'E' Procurement Notice No.33/VMC/CDB/2025-26, Dt.14-11-2025
Roads, Drain, Culvert, Water supply, Motors, repairs, (Total 33 works)-Est. Amount Rs 426.74 Lakhs.
All rights are reserved to the Commissioner to Cancel or Reject the tenders without assigning any reasons there of
Further details and any corrigendum can be seen @www.tender.apeprocurement.gov.in.
S/d-
For COMMISSIONER

# సజ్జల శ్రీధర్‌రెడ్డి పిటిషన్‌పై విచారణ వాయిదా

**విజయవాడ,నవంబరు 14,ప్రభాతవార్త ప్రతినిధి:**లిక్కరు స్కామ్ కేసులో డిఫాల్ట్ బెయిల్ కోసం దాఖలు చేసిన పిటీషన్‌పై విచారణ జరిపేలా విజయవాడ ఏసిబీ కోర్టును ఆదేశించాలంటూ నిందితుడు సజ్జల శ్రీధర్‌రెడ్డి ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసారు.దానిపై విచారణను హైకోర్టు వచ్చే సోమవారానికి వాయిదా వేసింది. ఆ రోజు తగిన నిర్ణయం ప్రకటిస్తామని పేర్కొంది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. డిఫాల్ట్ బెయిలు మంజూరు చేయాలని వేసిన పిటీషన్‌ను విజయవాడ ఏసీబీ కోర్టు రిటర్న్ చేయడాన్ని సవాలు చేస్తూ సజ్జల శ్రీధర్ రెడ్డి హైకోర్టులో వ్యాజ్యం వేసిన విషయం తెలిసిందే. న్యాయవాది అభయ్ సిదా ్ధంత్ వాదనలు వినిపిస్తూ...రెగ్యులర్ బెయిలు పిటీషన్లను విచారించాలని, డిఫాల్ట్ బెయిలు పిటీషన్లపై కాదని సుప్రీం కోర్టు

ఉత్తర్వులిచ్చిన నేపథ్యంలో తన పిటీషన్‌పై విచారణ జరపలేదంటూ బెయిలు పిటీషన్‌ను రిటర్న్ చేస్తూ ఏసీడీ కోర్టు గత నెల 29న డాకెట్ ఉత్తర్వులిచ్చిందన్నారు. ఏసీబీ కోర్టు ఏదో ఒక నిర్ణయం ప్రకటించాలి తప్ప విచారణ జరపలేమని పిటీషన్‌ను రిటర్న్ చేయడం తగదన్నారు. పిటీషన్‌కు నంబరు కేటాయించి,విచారణ జరిపేలా ఏసీబీ కోర్టును ఆదేశించాలని కోరారు.



# ఎపిని నాలెడ్జి ఎకానమిగా తీర్చి దిద్దుతాం

## ఇన్నోవేటివ్ ప్రాజెక్టుల్లో సింగపూర్ కంపెనీలతో కలిసి పనిచేస్తాం

## సింగపూర్ బృందంతో ఎంఒయులో సిఎం చంద్రబాబు

**విశాఖపట్నం, నవంబర్ 14, ప్రభాతవార్త** :సింగపూర్ ప్రభుత్వం, సింగపూర్ కంపెనీలు ఇన్నోవేటివ్ ఆలోచనలతో పరిశ్రమలు నడిపిస్తాయని...ఇలాంటి ఆలోచనలతో ముందుకు వచ్చే సింగపూర్ కంపెనీలతో పనిచేసేందుకు ఏపీ ఉత్సాహంగా ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, సింగపూర్ హోం శాఖామంత్రి షణ్ముగం సమక్షంలో సింగపూర్ ప్రభుత్వంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు మంత్రి నారా లోకేష్ సింగపూర్ విదేశీ వ్యవహారాలు, ట్రేడ్ ఇండస్ట్రీ మంత్రి గాన్ సో హాంగ్ ఒప్పంద పత్రాలను ఇచ్చి పుచ్చుకున్నారు. అర్బన్ గవర్నెన్స్, రియల్ టైమ్, డిజిటల్ గవర్నెన్స్ ట్రాన్స్ ఫర్మేషన్, సుస్థిరాభివృద్ధి అంశాలపై అవగాహనా ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."ప్రపంచానికి అభివృద్ధి మోడల్ గా మారిన సింగపూర్ అంటే నాకు అమితమైన అభిమానం. అత్యంత బలమైన పబ్లిక్ పాలసీలు ఆ దేశంలో అద్భుతమైన అభివృద్ధికి కారణం అయ్యాయి. లీక్వాన్యూ లాంటి నేతలు సింగపూర్‌ను అద్వితీయమైన దేశంగా మలిచారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ అభివృద్ధిలో భాగం అయ్యాను. ఇప్పుడు మళ్లీ అమరావతిని నిర్మించే భాగ్యం నాకు కలిగింది. కోరగానే అమరావతి బృహత్ ప్రణాళికను రూపొందించి ఇచ్చిన సింగపూర్‌కు ధన్యవాదాలు. మధ్యలో కొన్ని సమస్యలు ఏర్పడినా మళ్లీ రాజధానిని పునర్నిర్మిస్తున్నాం. రాష్ట్రాన్ని నాలెడ్జి ఎకానమీగా తీర్చిదిద్దుతున్నాం. దేశంలో సుస్థిరమైన ప్రభుత్వం ఉంది. గత ఆరు దశాబ్దాలుగా సుస్థిరమైన ప్రభుత్వం సింగపూర్‌లో ఉంది. ఇప్పుడు భారతదేశం కూడా ఆ దిశగానే అడుగులు వేస్తోంది. ప్రధాని మోదీ, ఎన్డీఏపై ప్రజలకు విశ్వాసం ఉంది. బీహార్ ఎన్నికల ఫలితాల్లో ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల మద్దతుతో భారీ విజయాన్ని సాధించింది" అని సీఎం చంద్రబాబు అన్నారు.అద్భుతమైన ప్రయాణానికి నాంది: నారా లోకేష్ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ...'ఏపీ సింగపూర్ మధ్య కుదిరిన ఎంఓయూ ఓ అద్భుతమైన ప్రయాణానికి నాంది. రెండో ఛాన్స్ ఇచ్చినందుకు సింగపూర్ ప్రభుత్వానికి ధన్యవాదాలు. పాలనలో అపారమైన అనుభవం ఉన్న సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏపీ అభివృద్ధి చెందుతోంది. సింగపూర్ అభివృద్ధి వేగాన్ని ఏపీ అందుకునేలా పని చేస్తాం' అని చెప్పారు. ఇక సింగపూర్ విదేశీ వ్యవహారాలు, వాణిజ్యం పరిశ్రమల శాఖ మంత్రి గాన్ సో హాంగ్ మాట్లాడుతూ ఏపీ సింగపూర్ మధ్య బంధం మరింతగా బలపడాలని కోరుంటున్నామన్నారు. హెల్తీ వెల్తీ హ్యాపీ సొసైటీగా ఏపీ మారాలని ఆకాంక్షి ంచారు. సుస్థిరాభివృద్ధి, డిజిటల్, అర్బన్ గవర్నెన్స్, డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ లో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని గాన్ సో హాంగ్ వెల్లడించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ విజయవాడ సింగపూర్ మధ్య వారంలో మూడు రోజుల పాటు విమాన సర్వీసులు నడుస్తాయని ప్రకటించారు. ఇప్పటికే విశాఖ నుంచి సర్వీసులు నడుస్తున్నాయని తెలిపారు. సింగపూర్ మోడల్‌ను సీఎం చంద్రబాబు విశ్వసిస్తారని.. తాము ఆయన్ను విశ్వసిస్తామని రామ్మోహన్ నాయుడు చెప్పారు. సింగపూర్ హోం మంత్రి షణ్ముగం మాట్లాడుతూ హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా ఏపీని మార్చడానికి స్వర్ణాంధ్ర విజన్ చేపట్టడం సంతోషదాయకమన్నారు. సింగపూర్ ఏపీ మధ్య బలమైన బంధం ఉందని... ఏపీలో సింగపూర్ కంపెనీలకు పూర్తి సహకారం అందుతోందని చెప్పారు. అభివృద్ధిలో పరస్పర భాగస్వామ్యం అత్యంత కీలకమని షణ్ముగం అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం కుదుర్చుకుంటున్న ఒప్పందాలతో ఏపీ

## ఎపిలో హైడ్రో టర్బైన్ తయారీ యూనిట్ నెలకొల్పండి

### కిర్లోస్కర్ ఎండి అలోక్ కిర్లోస్కర్‌తో మంత్రి లోకేష్ భేటీ

**విశాఖపట్నం, నవంబర్ 14, ప్రభాతవార్త** కిర్లోస్కర్ బ్రదర్స్ లిమిటెడ్ (కెబిఎల్) ఎండి అలోక్ కిర్లోస్కర్ తో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ, రెన్యువబుల్ ఎనర్జీ లక్ష్యాలకు అనుగుణంగా హైడ్రో టర్బైన్లు, సౌర పంపింగ్ వ్యవస్థల తయారీ యూనిట్ ను ఎపిలో ఏర్పాటు చేయండి. నీటిపారుదల, మునిసిపల్ నీటి సరఫరా, పారిశ్రామిక వినియోగానికి కీలకమైన వర్టికల్ టర్బైన్ పంపుల కోసం తిశిలో ఒక ప్రత్యేక ప్లాంట్‌ను స్థాపించండి. ఎపి పారిశ్రామిక కారిడార్లలో ముఖ్యంగా విశాఖపట్నం చెన్నయ్ కారిడార్ లో ఐఓటి ఆధారిత మురుగునీటి పంపింగ్ వ్యవస్థ, నీటి నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేయండి. పారిశ్రామిక, పట్టణ మౌలిక సదుపాయాల కోసం గీలి/నీలీ సర్టిఫైడ్ ఫైర్ పంపులు, పెద్ద వాల్వ్‌లను ఉత్పత్తి చేసే శీశి పంపుల సౌకర్యాన్ని ఏర్పాటు చేయండి. ఎపిలో పారిశ్రామిక క్లస్టర్లు, స్మార్ట్ సిటీలలో భద్రతా వ్యవస్థలకు పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా అవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని మంత్రి లోకేష్ చెప్పారు. అలోక్ కిర్లోస్కర్ మాట్లాడుతూ... తమ సంస్థ ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా 80దేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో తమ సంస్థ కార్యాలయాలు ఉన్నాయని, ఎపి ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని చెప్పారు.




## ఎపిలో మెరైన్ పరికరాల తయారీ యూనిట్ నెలకొల్పండి

### సాగర్ డిఫెన్స్ ప్రతినిధులతో మంత్రి నారా లోకేష్ భేటీ

**విశాఖపట్నం, నవంబర్ 14, ప్రభాత వార్త** మానవ రహిత సముద్ర వ్యవస్థలు, అటానమస్ వెసల్స్, డిఫెన్స్ సొల్యూషన్స్ లో పేరెన్నికగన్న సాగర్ డిఫెన్స్ సంస్థ ప్రతినిధులు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తో భేటీ అయ్యారు. 2015లో ఏర్పాటైన ఈ సంస్థ సముద్ర భద్రత, నిఘా, పర్యావరణ పరిరక్షణ కోసం అత్యాధునిక ప్లాట్ ఫాంలను డిజైనింగ్, తయారీ కార్యకలాపాలు నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ... భారత్ ను మెరైన్ రోబోటిక్స్, డిఫెన్స్ ఇన్నోవేషన్ లో అగ్రగామిగా నిలపడమే తమ లక్ష ్యమని అన్నారు. దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు స్వదేశీ సాంకేతికతకు అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మెరైన్ రోబోటిక్స్, నావిగేషన్ వ్యవస్థలలో తాము మల్టిపుల్ పేటెంట్లను కలిగి ఉన్నట్లు చెప్పారు. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ 1057 కి.మీ.ల సువిశాల తీరప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్ లో అత్యాధునిక మెరైన్ పరికరాల తయారీ యూనిట్ నెలకొల్పాల్సిందిగా కోరారు. ఎఐ, ఐఓటి, స్వయం ప్రతిపత్తి వ్యవస్థలపై దృష్టిసారించాల్సిందిగా సూచించారు.

## సిఐఐ సదస్సు వేదికగా డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలకు శ్రీకారం

### వర్చువల్‌గా సిఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి గోయల్ శంకుస్థాపన

### డ్రోన్, స్పేస్ సిటీల్లో పెట్టుబడులకు 6 సంస్థల ఎంఓయు

**విశాఖపట్నం, నవంబరు 14 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రతిష్టాత్మక ప్రాజెక్టులైన డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో శుక్రవారం వర్చువల్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ముఖ్యమంత్రి డ్రోన్ సిటీ, స్పేస్ సిటీకి శంకుస్థాపన జరుపుకోవడం చారిత్రాత్మకంగా నిలిచిపోతుందన్నారు. ఫస్ట్ మూవర్స్ అడ్వాంటేజ్‌ని తామెప్పుడూ అందిపుచ్చుకుంటూనే ఉంటామని... డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలకు కేంద్రం మరింత సాయం చేయాలని సీఎం కోరారు. త్వరలో రాష్ట్రంలో డ్రోన్ ట్యాక్సీలు తీసుకువచ్చేంతలా ఈ రంగాన్ని అభివృద్ధి చేస్తామని, ఇందుకు అవసరమైన డ్రోన్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని చెప్పారు. క్వాంటం వ్యాలీని జనవరిలో ప్రారంభిస్తున్నామని, అలాగే గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఏపీని తీర్చిదిద్దుతున్నామని అన్నారు. మరోవైపు డ్రోన్ల వినియోగం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వాటికి డిమాండ్ విస్తృతంగా ఉందని, దీనిని ముందుగానే ఊహించి డ్రోన్ సిటీని తీసుకొచ్చిన ముఖ్యమంత్రి ఆలోచనను కేంద్రమంత్రి పీయూష్ గోయల్ కొనియాడారు. ఐటీకి గుర్తింపు లేని సమయంలోనే ఐటీ భవిష్యత్‌ను ఊహించి ఆరోజు అవకాశాలను సీఎం చంద్రబాబు అందిపుచ్చుకున్నారని ప్రశంసించారు. ఇప్పుడు డ్రోన్లు, స్పేస్, ఏఐ, క్వాంటం విషయంలోనూ చంద్రబాబు ముందంజలో ఉన్నారని అన్నారు. దేశంలోనే తొలిసారి డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలను నెలకొల్పిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని చెప్పారు. దేశం కోసం, రాష్ట్రం కోసం ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు కలిసి కట్టుగా పనిచేస్తున్నారని వెల్లడించారు.

# మహిళలు, బాలల రక్షణ కోసం సహాయ కేంద్రాలు

## 24గంటలు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వం

- కట్నం కోసం, శారీరక, మానసిక వేధింపులకు పాల్పడిన సందర్భంలో బాధితులు 181కి కాల్ చేయాలి

- యువతులు, విద్యార్థినులను ఎవరైనా వేధిస్తే 100కు ఫోన్ చేయాలి

**విజయవాడ,నవంబరు 14,ప్రభాతవార్త ప్రతినిధి:**మహిళలు, బాలల భద్రత, రక్షణ కోసం సహాయ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలు రోజంతా అంటే 24గంటలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మహిళల భద్రత, రక్షణ కోసం రోజులో 24 గంటలూ ఆయా కేంద్రాలు అందుబాటులో ఉంటాయి. గృహహింసకు గురైనా, దాడులు జరిగినా బాధితులు ఆయా కేంద్రాలను సంప్రదిస్తే వైద్య సాయంతోపాటు పునరావాసం కల్పిస్తారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు, పోలీసు, రెవెన్యూ, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ బాధితులకు చేయూతనిస్తారు. మహిళలను కట్నం కోసం వేధించడం, శారీరక, మానసిక వేధింపులకు పాల్పడిన సందర్భంలో బాధితులు 181 నంబరుకు ఫోన్ చేయొచ్చు. రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది వివరాలు నమోదు చేసుకుని బాధితులను ఆదుకునేలా చర్యలు చేపడతారు. కొందరు వ్యక్తులు సామాజిక మాధ్యమాల ద్వారా మహిళలతో పరిచయాలు పెంచుకుంటారు. ఈ క్రమంలో వివిధ రూపాల్లో వారిని బెదిరిస్తే 1930 నంబర్‌ను ఫోన్ చేసి సాయం కోరవచ్చు. పోలీసు అధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేస్తారు. ఆన్‌లైన్‌లో ఆర్థిక మోసాలకు పాల్పడిన వారిపై ఫిర్యాదు చేస్తే బ్యాంకుఖాతా నుంచి నగదు లావాదేవీలను నిలిపేస్తారు. న్యాయస్థానాల్లో కేసులకు సంబంధించి 15100 నంబరుకు ఫోన్‌చేసి న్యాయసేవలు పొందవచ్చు. కోర్టుల్లో న్యాయవాదులను పెట్టుకోలేని మహిళలకు ప్రభుత్వ న్యాయవాది ద్వారా చేయూత నిస్తారు. బాలలతో వెట్టిచాకిరీ చేయించడం, పారిశ్రామిక, కర్మాగారాల్లో పనుల్లో పెడితే వారిని రక్షి ంచేందుకు హెల్ప్‌లైన్ నంబర్ 1098కు ఫోన్ చేయవచ్చు. అధికారులు వెంటనే స్పందించి వారికి విముక్తి కల్పిస్తారు. బాలలపై హింస, దాడులకు పాల్పడితే వారిపై ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. మహిళలకు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో జెండర్ రిసోర్స్ కేంద్రాలు (జీఆర్‌సీ)ను ఏర్పాటు చేస్తోంది. ఈ క్రమంలోనే విశాఖపట్నం జిల్లాలో ఇప్పటికే రావికమతం, నక్కపల్లిలో సేవలు అందిస్తున్నాయి. నర్సీపట్నం, కె.కోటపాడుకు కొత్తగా మంజూరయ్యాయి. మరో మూడు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలున్నాయని అధికారులు తెలుపుతున్నారు. సామాజిక మాధ్యమాలు, సమాజంలో చోటుచేసుకుంటున్న పలు ఘటనలతో అతివలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కలత చెందడం, ఎవరికీ చెప్పుకోలేక వారిలో వారే కుమిలిపోతే మానసికంగా కుంగిపోతున్నారు. పోలీసు స్టేషన్ వరకు వెళ్లలేక మిన్నకుండిపోతున్నారు. ఇలాంటి వారందరికీ జీఆర్‌సీతో ఎంతో ప్రయోజనం చేకూరనుంది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా ప్రతినిధులే వీటిని నిర్వహిస్తున్నారు. ప్రత్యేక కమిటీలు బాధిత మహిళలకు దన్నుగా నిలిచి కష్టాల నుంచి గట్టెక్కించేందుకు తోడ్పాటునందిస్తాయి. కేంద్రాల్లోనే ఒకటి రెండు రోజులు వసతి సదుపాయం కలిస్పారు. మహిళలు, యువతులు, విద్యార్థినులను ఎవరైనా వేధిస్తే 100 నంబరుకు ఫోన్ చేస్తే వెంటనే స్పందించి ఆదుకుంటారు. దూరప్రాంతమైతే ఆ ప్రాంత పోలీసులకు సమాచారం చేరవేసి రక్షణ

## ఎపిలో సెకండరీశాటిలైట్ ఎండిఎఫ్ యూనిట్ ఏర్పాటు చేయండి

### యాక్షన్ టెసా సిఇఓ వివేక్ జైన్‌తో మంత్రి నారా లోకేష్ భేటీ

**విశాఖపట్నం, నవంబర్ 14, ప్రభాతవార్త** యాక్షన్ టెసా ఎండి, సిఇఓ వివేక్ జైన్ తో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సిఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ లో భేటీ అయ్యారు. యాక్షన్ టెసా భారతదేశంలోని ప్రముఖ ఇంజనీర్డ్ కలప ప్యానెల్ తయారీదారు. 1970లలో స్థాపితమైన ఈ సంస్థ పాదరక్షలు, ఎలక్ట్రానిక్స్, రియల్ ఎస్టేట్, రసాయనాలు, ఫ్లెక్స్ తయారీ, బొగ్గు మైనింగ్, ఇంజనీర్డ్ కలప ఉత్పత్తులలో విభిన్న కార్యకలాపాలను నిర్వహిస్తోంది. 2025లో రూ.4,865కోట్ల వార్షిక రెవిన్యూ సాధించిన యాక్షన్ టెసా దేశంలో ఎ క్లాస్ నగరాలు, 70శాతం బి క్లాస్ నగరాల్లో పాన్ ఇండియా ఉనికి కలిగి ఉంది. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... సెకండరీ/శాటిలైట్ ఎండిఎఫ్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటుచేయండి. ప్రస్తుతం సితార్ గంజ్ తయారీ కేంద్రం 7.5లక్షల సిబిఎం సామర్థ్యంతో పనిచేస్తున్నందున, ఎపిలో సెకండరీ యూనిట్ ఏర్పాటుచేస్తే అదనపు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లకు డిమాండ్ మద్దతునిస్తుందని చెప్పారు. సిఇఓ వివేక్ జైన్ మాట్లాడుతూ ఢిల్లీ ప్రధాన కేంద్రంగా పని చేస్తున్న తమ సంస్థలో ప్రస్తుతం 2,846మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. 2018లో మేం ఏడోతరం కాంటిరోల్ టెక్నాలజీని విజయవంతంగా ప్రారంభించాం. ఉత్పత్తి వైవిధ్యం కోసం డోమ్ టెక్నాలజీని ప్రవేశ పెట్టినట్లు చెప్పారు. ఎపి ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని వివేక్ జైన్ తెలిపారు.

# సిఐఐ సదస్సు తొలిరోజు రికార్డ్ స్థాయిలో పెట్టుబడులు

### - ఒక్కరోజులోనే అంచనాలను మించి ఎంఓయులు - 365 సంస్థలతో రూ.8,26,668 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు - ఈ ఒప్పందాలతో 13,32,445 మందికి ఉద్యోగావకాశాలు

**విశాఖపట్నం, నవంబరు 14 ప్రభాతవార్త:** విశాఖలో జరుగుతున్న 30వ సిఐఐ భాగస్వామ్య సదస్సు తొలిరోజు పెట్టుబడులు రికార్డ్ స్థాయిలో వచ్చాయి. శుక్రవారం ముఖ్యమంత్రి సమక్షంలో 41 ఒప్పందాలు, మంత్రుల సమక్షంలో మరో 324 ఒప్పందాలు జరిగాయి. మొత్తం 365 కంపెనీలు రూ.8,26,668 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూలు కుదుర్చుకున్నాయి. తద్వారా 12,05,174 ఉద్యోగాలు రానున్నాయి. ఈరోజు వచ్చిన పెట్టుబడుల్లో అత్యధికంగా 121 వాణిజ్య పరిశ్రమల శాఖకు చెందినవే ఉన్నాయి. తర్వాత స్థానంలో ఐటీఈ అండ్ సీ 95, విద్యుత్ రంగానికి చెందిన సంస్థలు 44 రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూలు చేసుకున్నాయి. సీఐఐ సమ్మిట్ రెండు రోజులు కలిపి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అధికారులు అంచనావేయగా, అందరి అంచనాలను మించి ఒక్కరోజులోనే పెట్టుబడులు రావడం రాష్ట్ర ప్రభుత్వంపై పెట్టుబడిదారులు పెట్టుకున్న విశ్వాసాన్ని మరోసారి రుజువుచేసింది.

**సిఎం సమక్షంలో 41 ఒప్పందాలు**

సిఎం చంద్రబాబు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వంతో ఒకేసారి 41 సంస్థలు ఎంఓయూలు కుదుర్చుకున్నాయి. ఈ 41 సంస్థలు మొత్తం రూ.3,50,186 కోట్ల పెట్టుబడులు రాష్ట్రంలో పెట్టనున్నాయి. దీంతో 4,16,290 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి. ఎంఓయూ చేసుకున్న సంస్థల్లో ఏఎం గ్రీన్ మెటల్స్ అండ్ మెటీరియల్స్, ఎకోరెన్ ఎనర్జీ, జాక్సన్ గ్రీన్, జీఎంఆర్ ఎనర్జీ, ఎస్సార్ రెన్యువబుల్స్, వారీ గ్రూప్, సీసన్ గ్లోబల్ ట్రేడింగ్, ఎస్ఏఈఎల్, జెఎం బాక్సీ, శ్రీ సిమెంట్, రిలయన్స్ కన్స్యూమర్ ప్రోడక్ట్స్, హిందుస్థాన్ షిప్‌యార్డ్, టాటా పవర్, పతంజలి ఫుడ్, ఇండస్ కాఫీ, కెల్లాగ్ ఇండియా తదితర సంస్థలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్ధనరెడ్డి, సీఎస్ విజయానంద్ పాల్గొన్నారు.

**సమ్మిట్‌కు ముందురోజు 35 ఎంఓయులు**

సమ్మిట్‌కు ముందు రోజు 35 సంస్థలు రూ.3,65,304 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం చేసుకున్నాయి. 1,26,471 ఉద్యోగాలు రానున్నాయి.

మొత్తంగా గురు, శుక్రవారాలు రెండ్రోజుల్లో రాష్ట్రానికి రూ.11,91,972 కోట్ల విలువైన పెట్టుబడులు వచ్చాయి. 400 సంస్థలు పెడుతున్న ఈ పెట్టుబడులతో 13,32,445 మందికి ఉద్యోగాలు రానున్నాయి.

## అభివృద్ధికి మార్గం పెట్టుబడులే : సిఎం

**విశాఖపట్నం, నవంబరు 14 ప్రభాతవార్త:** పెట్టుబడులు, నూతన ఆవిష్కరణలు, భాగస్వామ్యాలే అభివృద్ధికి మార్గమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సీఐఐ భాగస్వామ్య సదస్సును కేవలం పెట్టుబడుల కోసం మాత్రమే చూడొద్దని నెట్‌వర్కింగ్ కోసం, మేధోపరమైన చర్చల కోసం, ఆవిష్కరణల కోసం ఏర్పాటు చేశామని అన్నారు. 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభ ప్లీనరీ సదస్సులో పాల్గొని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. సౌదీ, రష్యా, యూకే,

ఆస్ట్రేలియా, జర్మనీ, శ్రీలంక, జపాన్, కెనడా తదితర దేశాల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరు కావటం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. పరస్పరం పెట్టుబడుల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధించగలమనే విషయాన్ని గుర్తించాలని సీఎం కోరారు. సింగపూర్ చాలా చిన్న దేశమైనా అమరావతి మాస్టర్ ప్లాన్ రూపొందించి ఇచ్చిందని తెలిపారు.

# సత్యసాయి శతజయంతి వేడుకలకు పెరుగుతున్న భక్తుల రద్దీ

## సుందరంగా ముస్తాబైన పుట్టపర్తి పురవీధులు - ప్రత్యేక ఆకర్షణగా సత్యసాయి లేజర్ షో

**పుట్టపర్తి రూరల్ నవంబర్ 14 ప్రభాతవార్త:** భగవాన్ సత్యసాయి బాబా జయంతి వేడుకలకు దేశ విదేశాల నుండి భక్తుల రద్దీ రోజురోజుకు పెరుగుతుండడంతో పుట్టపర్తి పురవీధులు భక్తులతో కి కిటకిటలాడుతున్నాయి. పెరుగుతున్న భక్తులను దృష్టిలో ఉంచుకొని సెంట్రల్ ట్రస్ట్ మరియు ప్రభుత్వం అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ప్రశాంతి మందిరం వెస్ట్ గెట్, విద్యుత్ సబ్స్టేషన్ పక్కన, చైతన్య జ్యోతి, భక్తులకు వసతి, మరుగుదొడ్లు,త్రాగునీటి సౌకర్యం కల్పించారు. ఉదయం అల్పాహారం మొదలుకొని రాత్రి భోజనం వరకు అన్న ప్రసాదాన్ని ఈనెల 13 నుండి 24 వరకు భక్తులకు అందిస్తున్నారు. పుట్టపర్తి పురవీధులు, సత్యసాయి విద్యాసంస్థలు, పరిపాలనా భవనాలు, ప్రధాన రహదారులు రంగురంగుల విద్యుత్ దీప కాంతులతో ప్రకాశిస్తున్నాయి. వివిధ ఆకృతులతో ఏర్పాటుచేసిన స్వాగత తోరణాలు భక్తులకు స్వాగతం పలుకుతున్నాయి. సత్యసాయి వైభవాన్ని తెలుపుతూ చిత్రావతి హారతి ఘాట్లో ప్రదర్శిస్తున్న వాటర్ అండ్ లేజర్ షో వేడుకల్లో ప్రత్యేకంగా ఆకర్షణగా నిలిచింది. సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్లోని 10 జోన్ల నుండి వేలాది మంది విదేశీ భక్తులు ఈ వేడుకల్లో పాల్గొననున్నారు. హిల్ వ్యూయు స్టేడియంలో 19న జరిగే మహిళ దినోత్సవ వేడుకల్లో దేశ ప్రధాని నరేంద్ర మోడీ హాజరవుతుండడంతో పటిష్ట బందోబస్తు చర్యలను ఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో చేపట్టారు.రవాణా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర నలుమూలల నుండి 300 బస్సులు పుట్టపర్తికి ప్రత్యేక సర్వీసులుగా నడపనున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా మరో 200 బస్సులను పెంచనున్నట్లు తెలిపారు.

ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 12 ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి ఉచిత వైద్య సేవలందించనున్నారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో మొబైల్ టాయిలెట్స్, త్రాగునీరు, పార్కింగ్ ప్రదేశాలు, లైటింగ్, చిత్రావతి సుందరీకరణ, రహదారి మరమ్మత్తులను, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పనులను చేపట్టారు.

తిరుమల తరహాలో పుట్టపర్తి ప్రధాన రహదారుల గుండా సాయిశ్వరాయ విద్మహే అను నామస్మరణ భక్తులలో ఆధ్యాత్మికతను నింపుతోంది. భద్రతా చర్యల దృష్ట్యా 214 నిఘా కెమెరాలు,

డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. వేడుకల్లో భాగంగా శుక్రవారం ప్రముఖ వీణ వాయిద్య కారిని రూపాపనకర్ బృందం అద్భుతమైన సంగీత ప్రదర్శనను నిర్వహించారు.



వాటర్ అండ్ లేజర్ షోలోని ఒక దృశ్యం

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం

## - 24729 ఓట్ల మెజార్టీతో గెలిచిన నవీన్‌యాదవ్

**జూబ్లీహిల్స్, నవంబరు 13, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగించింది. ఆ పార్టీ అభ్యర్థి వల్లాల నవీన్‌యాదవ్ ఈ ఎన్నికల్లో జయకేతనం ఎగురవేశారు. తన సమీప ప్రత్యర్థి బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై 24,729 ఓట్ల మెజార్టీతో విజయాన్ని దక్కించుకున్నారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందుకోసం 42 టేబుళ్లను ఏర్పాటుచేశారు. మొత్తం నమోదైన 1,94,631 ఓట్లను 10 రౌండ్లలో కౌంటింగ్ నిర్వహించారు. బ్యాలెట్ ఓటింగ్‌లో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు 43, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతగోపీనాథ్‌కు 25 ఓట్లు, బీజేపీకి 20 ఓట్లు, నోటాకు 2ఓట్లు పోలయ్యాయి. ఇక షేక్‌పేట డివిజన్ నుంచి ఎన్నికల కౌంటింగ్‌ను ప్రారంభించగా మొదటి రౌండ్ నుంచే నవీన్ యాదవ్ స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించారు. రౌండ్ రౌండ్‌కు అధిక్యత మరింత పెరుగుతూ వచ్చింది. ఏ ఒక్క రౌండ్‌లోనూ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఆధిక్యాన్ని ప్రదర్శించ లేకపోయారు. నవీన్ యాదవ్‌కు 98,988 ఓట్లు, మాగంటి సునీతగోపీనాథ్‌కు 74,259 ఓట్లు, బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి 17,061 ఓట్లు పోలయ్యాయి. బీజేపీకి ఇక్కడ డిపాజిట్ గల్లంతయ్యింది. దీంతో



నవీన్‌యాదవ్ 24,729 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఆయనకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి. సాయిరాం ధృవీకరణ పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నవీన్‌యాదవ్ నియోజకవర్గ ప్రజలకు తన కృతజ్ఞతలు తెలిపారు. ఇది ప్రజల విజయమని, అభివృద్ధికి, ప్రజాపాలన ప్రభుత్వానికి ఓట్లు వేశారన్నారు



శుక్రవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న 'ప్రత్తిపాటి'

## ఎన్‌డిఏ విజయంలో లోకేష్ కీలక పాత్ర

చిలకలూరిపేట, నవంబరు 14 ప్రభాతవార్త: టిడిపి జాతీయప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ ఎక్కడ అడుగుపెడితే అక్కడ విజయపరంపర కొనసాగుతుందని చెప్పడానికి బీహార్‌లో ఎన్డీయే కూటమి విజయమే నిదర్శనమని మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఎపిని పెట్టుబడులకు గేట్‌వేగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్‌లకే దక్కుతుందని ఆయన స్పష్టంచేశారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)లో భాగంగా ప్రజల నుంచి ప్రత్తిపాటి అర్జీలను స్వీకరించారు. వాటి పరిష్కారంపై అధికార యంత్రాంగానికి సూచనలుచేసి, అర్జీదారులకు భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే పారిశ్రామికవేత్తల చూపు ఎపివైపు మరలిందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వర రావు, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్‌ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్, కామినేని సాయిబాబు, ప్రధాన కార్యదర్శి ఎం.రవి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## టిడ్కో గృహాలకూ ఉచిత ఇసుక

విజయవాడ, నవంబరు 14 పభాతవార్త ప్రతినిధి: వైసిపి హయాంలో తీసుకొచ్చిన ఇసుక విధానాన్ని రద్దు చేసి... టిడ్కో గృహాలు పూర్తి చేసేందుకు ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసేలా సాంకేతిక కమిటీ ఇచ్చిన నివేదికను ప్రభుత్వం ఆమోదించింది. నిర్ధేశించిన గడువు లోగా గృహాల్ని పూర్తి చేసే గుత్తేదారులకు సిమెంట్, ఇనుము, ఇతర సామాగ్రి ధరల్ని చెల్లించేందుకు అనుమతినిచ్చింది. కోవిడ్‌తో పనులు జరగని కారణంగా అప్పట్లో గుత్తేదారులు తీసుకున్న మొబిలైజేషన్ అడ్వాన్స్‌పై వడ్డీకి మినహాయింపునిచ్చింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. 25 శాతం కంటే తక్కువ పనులు పూర్తైన 42 వేల టిడ్కో గృహాలను వైకాపా ప్రభుత్వం అధికారం లోకి రాగానే రద్దు చేసింది. మరో 62 వేల గృహాలకు రివర్స్ టెండర్ పేరుతో టిడిపి హయాంలో టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులను తొలగించి వేరే వారికి కట్టబెట్టింది. ఈ గుత్తేదారులు అప్పటి వరకు చేసిన పనులకు గాను బిల్లులు చెల్లించకుండా వేధించింది. వారు చేసిన పనులకు ఏ విధంగా బిల్లులు చెల్లించాలనే దానిపై కమిటీ ఇచ్చిన సూచనలకు ఆమోదం తెలిపింది.

## కృష్ణాడెల్టాలో ఆరుతడి పంటలే వేసుకోవాలి

విజయవాడ. నవంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: కృష్ణాడెల్టా పరిధిలో రైతులు రబీ పంటకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని కృష్ణాడెల్టా సిస్టమ్ స్రోలింగ్ చీఫ్ ఇంజనీర్ బి.రాంబాబు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈఏడాది రికార్డుస్థాయిలో కృష్ణానదికి వరద రావడంతో శ్రీశైలం, నాగార్జున సాగర్, పట్టిసీమ, ప్రకాశం బ్యారేజ్ కింద ఖరీఫ్ పంటకు 222 టిఎంసిల నీటిని సరఫరా చేశామన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్, ప్రకాశం బ్యారేజ్ పరిధిలోని ఖరీఫ్ పంటలకు 208 టిఎంసిలు, 2026 మే వరకు తాగు నీటి అవసరాలకు మరో 20 టిఎంసిలతో, సాగు, తాగు నీటి అవసరాలకు మొత్తంగా 228 టిఎంసిలు కావలసి ఉందని తెలిపారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాల నుండి ఆంధ్రప్రదేశ్ వాడుకోగా ప్రస్తుతం మిగిలిన వాటా 118 టిఎంసిలు మాత్రమే. రాబోవు జూన్‌లో సాగు, మంచి నీటి అవసరాల దృష్ట్యా పులిచింతల రిజర్వాయర్‌లో నిల్వ ఉంచిన 40 టిఎంసిలతో కలిపి, కృష్ణాడెల్టా పరిధిలో అందుబాటులో ఉన్న నీరు 158 టిఎంసిలు మాత్రమే. ఎగువ నుండి కృష్ణా నదికి వరద ప్రవాహం తగ్గడంతో అందుబాటులో ఉన్న 158 టిఎంసిలతోనే, ప్రస్తుత ఖరీఫ్, తాగు నీటి అవసరాలకు వాటర్ మేనేజ్మెంట్ చేయాల్సి ఉంది. పులిచింతల రిజర్వాయర్ నీటితో 2026 జూన్ మొదటి వారంలోనే తాగునీటి అవసరాలతో పాటు, ఖరీఫ్ పంటకు నీరు విడుదల చేసేలా తగుచర్యలు తీసుకుంటున్నామని చీఫ్ ఇంజనీర్ బి.రాంబాబు వివరించారు.



## దుర్గమ్మవారి ఆలయంలో వేదోక్తంగా కార్తీకమాస పూజలు

ఇంద్రకీలాద్రి, నవంబరు 14, ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో శుక్రవారం కార్తీకమాస పూజలు వేదోక్తంగా నిర్వహించారు. ఇఓ, చైర్మన్లు కార్యక్రమంలో పాల్గొనగా వేదపండితులు అర్చనలు చేశారు. కార్తీకమాస పూజల్లో భక్తులు పాల్గొనాలని ఇఓ చైర్మన్లు తెలిపారు. సహస్ర దీపకాంతులతో శ్రీ స్వామి అమ్మవార్లు భక్తులను ఊంజల్ సేవలందుకుని అనుగ్రహించారు. పవిత్ర కార్తీకమాసం సందర్భంగా సహస్ర లింగార్చన సేవలో పాల్గొనాలని భక్తులకు ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు తెలిపారు. అర్చకస్వాములు వేదమంత్ర పఠనాలతో శ్రీ స్వామివారికి సేవలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. సాయంసంధ్యాకాలంలో శ్రీ స్వామి అమ్మవార్లు ఊంజల్‌పై భక్తుల సేవలందుకుని అనుగ్రహించారు. ఈ సందర్భంగా చతుర్వేద పఠనాలు పండితులు చేశారు. దుర్గమ్మవారిని శుక్రవారం సినీ దర్శకుడు హారీష్ శంకర్ దర్శించుకున్నారు.

### ఇఓ ఆకస్మిక తనిఖీ

దుర్గమ్మవారిని కార్తీకమాసం శుక్రవారం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఇఓ వికె శీనానాయక్ ఆలయ కౌంటర్లు, భోజన ప్రసాదం, ప్రసాదం కౌంటర్లు తదితరాల్లో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఒక దివ్యాంగుని గమనించి ఆయనకు వెంటనే దర్శనం, భోజన ప్రసాదం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇఓ తీసుకున్న చర్యలతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు.



# ఎపి అభివృద్ధిలో భాగస్వాములవుతాం

**• యువతలో నైపుణ్యం పెంచి ఉద్యోగాలిస్తాం • సిఎం చంద్రబాబు విజన్ అద్భుతం...**

**ఎపి అభివృద్ధి కచ్చితం • 30వ భాగస్వామ్య సదస్సులో ప్రముఖ పారిశ్రామిక వేత్తలు**



విశాఖపట్నం, నవంబరు 14 ప్రభాతవార్త: విశాఖలో ప్రారంభమైన రెండు రోజుల భాగస్వామ్య సదస్సులో పాల్గొన్న వివిధ ప్రముఖ సంస్థలకు చెందిన పారిశ్రామిక వేత్తలు ఎపిలో జరుగుతున్న అభివృద్ధి గురించి పారిశ్రామికాభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం తెచ్చిన పాలసీల గురించి మాట్లాడారు. అదానీ పోర్ట్స్, సెజ్ ఎండి కరణ్ అదానీ మాట్లాడుతూ... స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో ఆంధ్రప్రదేశ్ ఆధునికంగా మారుతోందన్నారు. భారత దేశంలో వేగంగా ఎదుగుతున్న స్టార్టప్ స్టేట్‌గా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని కరణ్ అదానీ అభిప్రాయపడ్డారు. దీనికి మార్గదర్శిగా ముఖ్యమంత్రి



చంద్రబాబు వ్యవహరిస్తున్నారని వెల్లడించారు. ఎపిలో డేటా సెంటర్లు, ఓడరేవులు, సిమెంట్ ఉత్పత్తి తదితర రంగాల్లో అదానీ సంస్థ పనిచేస్తోందని వివరించారు. ఎపి వృద్ధిలో అదానీ సంస్థ కూడా భాగస్వామి అవుతోందని స్పష్టం చేశారు. నైపుణ్యం ఉన్న యువత, మానవ వనరులు, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ఎపిని మంత్రి నారా లోకేష్ తీర్చిదిద్దుతున్నారని కరణ్ అదానీ కితాబిచ్చారు.

జీఎంఆర్ సంస్థ అధినేత గ్రంధి మల్లిఖార్జునరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌కు అనుగుణంగా ఎపిలో అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయాలు వస్తున్నాయన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంలో భాగస్వామి అయి నందుకు సంతోషంగా ఉందని జీఎమ్మార్ అధినేత చెప్పారు. ఇంటిగ్రేటెడ్ ఏరో స్పేస్ ఎకో సిస్టంను ఆంధ్రప్రదేశ్‌లో సిద్ధం చేస్తున్నామని మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్ హాలింగ్ సెంటర్ కూడా భోగాపురం ఎయిర్ పోర్టులో వస్తుందని జీఎమ్మార్ సంస్థ అధినేత ప్రకటించారు.

### సిబిఎన్ ఏర్పాటు చేసిన జినోమ్ వ్యాలీ నుంచే కోవిడ్ టీకాలు

ఈ సదస్సులో పాల్గొన్న భారత్ బయోటెక్ ఎండి, సిఐఐ ఉపాధ్యక్షురాలు సుచిత్రా కె.ఎల్లా మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూ భారత్ ముందుకు వెళ్తోందని, గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో స్వయం ప్రతిపత్తి సాధించేలా దేశం ముందడుగు వేస్తోందని చెప్పారు. భాగస్వామ్యం, ఆవిష్కరణలు, విలువ ఆధారిత ఉత్పత్తులతోనే ఆత్మనిర్భర్ భారత్ ఆవిష్కృతం అవుతుందని అభిప్రాయపడ్డారు. కోవిడ్ లాంటి విపత్తు వచ్చినప్పుడు ప్రపంచానికి వాక్సిన్ అందించగలిగిన దేశంగా భారత్ అవతరించిందని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు జీనోమ్ వ్యాలీ లాంటి ఎకోసిస్టమ్‌ను తయారు చేశారని... అదే జీనోమ్ వ్యాలీలో భారత్ బయోటెక్ కోవిడ్‌కు వ్యాక్సిన్ తయారు చేసి అందించిందని సుచిత్రా ఎల్లా వివరించారు.

అలాగే బజాజ్ ఫిన్ సర్వ్ చైర్మన్, ఎండి సంజీవ్ బజాజ్ ప్రసంగిస్తూ... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భారతదేశానికి గ్రోత్ ఇంజిన్‌లా ముందుందని అన్నారు.



వెయ్యి కిలోమీటర్ల తీరం కలిగిన ఎపి... ట్రేడ్, టెక్నాలజీ, ఇన్నోవేషన్‌కు గేట్ వేగా ఉంటోందన్నారు. యువతకు అండగా ఉండేలా రాహుల్ బజాజ్ స్కిల్లింగ్ సెంటర్లు... విజయవాడ, విశాఖ, రాజమండ్రి, శ్రీసిటీ, తిరుపతిలో ఏర్పాటు చేస్తామని సంజీవ్ బజాజ్ ప్రకటించారు. భారత్ ఫోర్జ్ జాయింట్ ఎండి అమిత్ కల్యాణి ప్రసంగిస్తూ... ప్రపంచవ్యాప్తంగా ఏఐ, డేటా యుగం నడుస్తోందని... ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఎపి కూడా ఈ రంగాల్లో ముందడుగు వేస్తోందని అన్నారు. ఎపి వృద్ధిలో భారత్ ఫోర్జ్ కూడా భాగస్వామి అవుతోందని వెల్లడించారు. నౌకా నిర్మాణం, పర్యాటకం లాంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని భారత్ ఫోర్జ్ నిర్ణయించిందని చెప్పారు. ఇప్పటికే డిఫెన్స్ ఉత్పత్తుల తయారీలో ఎపిలో పనిచేస్తున్నామని... రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువతకు నైపుణ్యాలు కల్పించే అంశంలోనూ భారత్ ఫోర్జ్ సంస్థ భాగస్వామి అయ్యిందని అమిత్ కల్యాణి వివరించారు. లులూ గ్రూప్ చైర్మన్ యూసఫ్ అలీ మాట్లాడుతూ... ఎపి ప్రజలు, ముఖ్యమంత్రి చంద్రబాబు కలలకు అనుగుణంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతోందని... రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో లులూ గ్రూప్ అత్యాధునిక మాల్స్‌తో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తోందని అలీ చెప్పారు.

# ఐదేళ్ల పాలనంతా అరాచకం

**• అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించారు**

**• పాలకొల్లులో సైకిల్ ర్యాలీలో మంత్రి రామానాయుడు మండిపాటు**

పాలకొల్లు, నవంబరు 14 ప్రభాతవార్త: వైసిపి ఐదేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికి వదిలేసి పట్టించుకోలేని వైసిపి నాయకులు ఏ మొఖం పెట్టుకొని ప్రజల వద్దకు వస్తారని.... తిరిగే అర్హత గానీ మాట్లాడే హక్కు గానీ లేదని రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు గ్రామంలో జరిగిన తెలుగుదేశం పార్టీ పాలకొల్లు మండల అనుబంధ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా పూలపల్లి సెంటర్లో డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి వేలాదిమంది పార్టీ శ్రేణులతో కలిసి పూలపల్లి, బగేశ్వరం మీదుగా లంకలకోడేరు చేరుకున్నారు. అక్కడ జరిగిన సభలో ముందుగా పార్టీ అనుబంధ కమిటీల సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అరాచకం, నిరంకుశత్వం, కక్షలు, వేధింపులు, కేసులతో ప్రజలను భయభ్రాంతులను చేశారని, నేడు కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్య పరిపాలన తో అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని.... ఇది మంచి ప్రభుత్వంగా ఆశీర్వదిస్తున్నారని తెలిపారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ ఐదేళ్లలో రాష్ట్రాన్ని ఆర్థికంగా విచ్ఛిన్నం చేసి విధ్వంసం చేశాడన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అనేక అభివృద్ధి పనులను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా ధ్వంసం చేసిందని అందుకు ప్రభుత్వం మారడమే కారణమన్నారు. ప్రజలంతా విజ్ఞతతో ఓటును అభివృద్ధి వైపు వెయ్యాలి గాని విధ్వంసం వైపు కాదన్నారు. రాష్ట్రంలో పరిపాలన దక్షత గల చంద్రబాబు, ఆయనకు తోడు పవన్ కళ్యాణ్,



వీరిద్దరికీ అండగా మోడీ కలయికతో కూటమి ప్రభుత్వ 16 నెలల్లో అభివృద్ధి సంక్షేమం పరుగులు పెడుతుందన్నారు. ముఖ్యంగా అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు వంటి అనేక పనులతో పాటు సూపర్ సిక్స్ నెరవేర్చారన్నారు. ప్రభుత్వంలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజా ప్రభుత్వమని తెలిపారు. పాలకొల్లు నియోజకవర్గంలో గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ నాయకులు అభివృద్ధి సంక్షేమాన్ని పట్టించుకోలేదని, నేడు అధికారం కోల్పోయాక అబద్ధాలు అసత్యాలతో కాలయాపన చేస్తున్నారని ఇటువంటి వారి మాటలు నమ్మి మళ్లీ మోసపోవద్దు అన్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో టిడిపి ప్రభుత్వంలో పెద్ద ఎత్తున అభివృద్ధి జరగడంతో పాటు పలు పనులు అసంపూర్తిగా ఉన్న దశలో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో నాయకులు పట్టించుకోకపోగా విధ్వంసానికి గురిచేసారన్నారు. నేడు మళ్ళీ అధికారంలోకి కూటమి ప్రభుత్వ రావడంతో ఆయా పనులను పూర్తిచేసేలా పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చినట్లు మంత్రి రామానాయుడు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్రావు, నియోజకవర్గ ఇన్చార్జ్ పెచ్చెట్టి చంద్రమౌళి, సర్పంచ్ చొప్పల రజిని, ఎంపీటీసీ ఆకుల ధనలక్ష్మి ్మ, ఏం సి చైర్మన్ కోడి విజయభాస్కర్, ఏంసివై చైర్మన్ దాసరి రత్నం రాజు, మాతా రత్నం రాజు, నియోజకవర్గ మండల ప్రెసిడెంట్లు, పాముల రజినికుమార్, గండేటి వెంకటేశ్వరరావు, మామిడశెట్టి పెద్దిరాజుగొట్టిముక్కల సూర్యనారాయణ రాజు, పెచ్చెట్టి బాబు, కర్నేను రోజా రమణి పెనుమత్స సత్యనారాయణ రాజు, కలిదిండి రామచంద్ర రాజు, కామి శెట్టి అయ్యప్పనాయుడు ఇంటి శ్రీరాముడు, అంగర వీరభద్ర కుమార్, పెనుమత్స సాయిరాజు, పెనుమత్స శ్రీనివాసరాజు, రాయి ప్రసాద్, అందుకోటి వీరభద్రం, కౌరు సందీప్ కుమార్, , ద్రాక్షారపు జ్యోతి సాగి వెంకటరామరాజు పాల శ్రీనివాసరావు కందుల వెంకటేశ్వరరావు, వీరమల్లు శ్రీనివాసరావు చెల్లబోయిన సహదేవుడు కౌరు మురళీకృష్ణ, ఉంగరాల సూర్యనారాయణ, నడపనా పురుషోత్తం, నెక్కంటి దుర్గారావు, కుడక కోటేశ్వరరావు, చొప్పల వెంకట్రావు, చాగంటి అన్నవరం, ఇబ్బ నాగార్జున, తలూరి విజయలక్ష్మి, ఎల్లపు లోకేష్ తులసి రావు, ఆర్మిల్లి చిన్ని, ముప్పిరి సత్యనారాయణ, కర్నేని గౌరీ నాయుడు దేవరపు దొరబాబు, కడలి గోపాలరావు, మహమ్మద్ జానీ, మండల నాయకులు మరియు గ్రామ నాయకులు తదితరు నాయకులు పాల్గొన్నారు.

# రైల్వేలో ఖాళీ ఉద్యోగాలు భర్తీచేయాలి

**- వేతన సంఘం నివేదిక సంబంధం లేకుండా అలవెన్స్‌లు అమలుచేయాలి**

**- ఆల్ ఇండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రెటరీ శివగోపాల్ మిశ్రా డిమాండ్**

విజయవాడ, నవంబరు 14 ప్రభాతవార్త: ఎనిమిదవ వేతన సంఘం నివేదిక జాప్యాన్ని నివారించే క్రమంలో 2026 జనవరి 1 నుండి వేతన సంఘం నివేదికతో సంబంధం లేకుండా రైల్వే ఉద్యోగులకు వేతనాలు, అలవెన్సులు అమలు చేయాలని ఎన్‌సిజెసిఎం స్టాఫ్ సైడ్ సెక్రటరీ, ఆల్ ఇండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ శివగోపాల్ మిశ్రా కేంద్రాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం విజయవాడలో జరిగిన సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ 55వ వార్షిక సాధారణ మండలి సమావేశం అనంతరం యూనియన్ జనరల్ సెక్రెటరీ శివ గోపాల్ మిశ్రా, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రెటరీ సిహెచ్ శంకరరావు మీడియాతో మాట్లాడారు. 55వ వార్షికోత్సవ సమావేశానికి తెలంగాణ, రాయలసీమ, కోస్తా ఆంధ్ర, నాంథేడ్ డివిజన్ల నుంచి రైల్వే ఉద్యోగులు హాజరుకోవటం హర్షనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఒత్తిడి మేరకు జనవరి మూడో వారం 2025లో ఎనిమిదో వేతన సంఘం ఏర్పాటు చేసినప్పటికీ చైర్మన్ నియామకం నియమ నిబంధనల ఏర్పాటు వంటివి 14 నెలల తర్వాత ప్రకటించడంతో ఉద్యోగులకు ఆర్థికంగా తీవ్రమైన నష్టంతో పాటు అలవెన్స్ రూపంలో మరింత నష్టం జరుగుతుందని, వీటి నివారణకు వేతన సంఘ నివేదికతో సంబంధం లేకుండా ఉద్యోగుల





వేతనాలు, అలవెన్స్ లను ఉద్యోగులకు నూతన సంవత్సరం కానుకగా జనవరి ఒకటి నుండి అమలులోకి తేవాలన్నారు. ఇక్ నాన్ కంట్రిబ్యూటరీ ఫండ్ పెన్షన్ వంటి పదాలను ఉపయోగించటంతో పెన్షన్ ఉద్యోగుల హక్కుగా కాకుండా ప్రభుత్వం పై ఏర్పడే ఆర్థిక భారం దృష్టితో చూపడుతుందని ఇది ఉద్యోగం విరమణ చేసిన వారితో పాటు ఉద్యోగులను ఆందోళన కలిగిస్తుందన్నారు. రైల్వేలను ఆధునికరించడాన్ని స్వాగతిస్తున్నామని అదే సమయంలో ఉద్యోగులపై అధిక పని భారం తగ్గించి, మానసిక ఒత్తిడి, ఆరోగ్య సమస్యలకు గురికాకుండా చూడాలని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. రైల్వేలలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానం అనేది రైల్వేలకు భద్రతకు తీవ్రమైన ముప్పుగా మారిందన్నారు. రైల్వే ఆస్తుల భద్రత, ప్రయాణికుల సురక్షితం కొరకు వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర రైల్వే మంత్రి ప్రధానమంత్రిపై ఒత్తిడి తీసుకువచ్చి విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ సేవలు ప్రారంభ దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో హిందూ మజ్దూర్ సభ ఏపీ జనరల్ సెక్రెటరీ జి ఎన్ శ్రీనివాసరావు, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ బెజవాడ డివిజన్ అధ్యక్షులు ఎస్ రామగుప్త, సెక్రెటరీ ఎం లీల, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఎస్సి, ఏజిఎస్ జి ఉదయ్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## విస్పోట్ కవచ్-9లో ఎపి పోలీసు ప్రతిభ జాతీయ స్థాయిలో రెండవ స్థానం

విజయవాడ, నవంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: విస్పోట్ కవచ్-9లో ఆంధ్రప్రదేశ్ ఆక్టోపస్ బృందం అత్యుత్తమ ప్రతిభ కనబరచి 2వ స్థానం సాధించింది. ఈ జాతీయ స్థాయి పోటీల్లో నేషనల్ సెక్యూరిటీ గార్డ్ ట్రైనింగ్ సెంటర్, మానేసర్, హర్యానాలో ఈ నెల 10 నుండి 14 వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర సాయుధ పోలీసు దళాల నుంచి మొత్తం 23 బృందాలు పాల్గొన్నాయి. భారీ పోటీ వాతావరణంలో అక్టోపస్-ఏపీ బృందం అత్యుత్తమ శిక్షణా నైపుణ్యాలు, ఆపరేషనల్ సామర్థ్యాలు, సమన్వయంతో ప్రత్యేక ప్రతిభను కనబరచింది. అక్టోఫస్ ఆంధ్రప్రదేశ్ బృందానికి ఇన్‌చార్జ్‌లుగా ఇన్‌స్పెక్టర్లు వి కుమార్, గోపిచంద్, సారథ్యం వహించారు. వారి నాయకత్వం, వ్యూహాత్మక మార్గదర్శకత్వంతో బృందం అత్యుత్తమ ప్రదర్శన చేసి దేశవ్యాప్తంగా 2వ స్థానం సాధించింది. ఈ విజయంతో ఆక్టోపస్ దళం యొక్క సాంకేతిక నైపుణ్యం, ఆపరేషనల్ సంసిద్ధత, క్రమశిక్షణ, ప్రొఫెషనల్ ప్రమాణాలు మరొకసారి రుజువయ్యాయి. ఈ విజయంపై ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఐపిఎస్ అధికారులు శ్రీకాంత్, సెంథిల్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు బృంద సభ్యులను అభినందించారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయండి

విజయవాడ, నవంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: అంగన్‌వాడీ కేంద్రాలను ప్రి స్కూల్ పిల్లలతో బలోపేతానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కోరింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా వార్డు, గ్రామ సచివాలయాల్లో శుక్రవారం వినతిపత్రాలు అందించినట్లు యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.బేబీరాణి, కె.సుబ్బరావమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రి స్కూల్ పిల్లలకు తల్లికి వందనంతో పాటు యూనిఫాం, టై, బెల్ట్, బూట్లు ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రిస్కూల్ పిల్లలు తగ్గిపోతున్నారనే కారణం చూపి కేంద్రాలను విలీనం చేయాలని ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని పేర్కొన్నారు. ఇవి బలోపేతం కావాలంటే 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలను రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదయ్యే విధంగా చూడాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా జివో ఇవ్వాలని తెలిపారు. పిల్లలకు గుడ్లు, పాలు, భోజనం, ఉదయం 12.30గంటలకే పూర్తవుతుందని పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటల వరకు కేంద్రాల్లో ఉంటున్న సందర్భంగా పిల్లలకు స్నాక్స్, బిస్కెట్స్ అందించాలని కోరారు.



## ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.కోటి విరాళం

తిరుమల, నవంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమలకు వచ్చిన భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు వడిస్తున్న ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు దాత భారీ విరాళమిచ్చారు. శుక్రవారం తిరుమలలోని టిటిడి ఛైర్మన్ క్యాంప్ కార్యాలయం లో ఛైర్మన్ బిఆర్‌నాయుడును దాత విజయ వాడకు చెందిన మోనిష్ వెంకట సత్యప్రకాశ్ తరపున ప్రతినిధి భూషణ్ కోటి రూపాయలు విరాళాల డిడిని ఎస్వీ అన్నప్రసాదంకు అందజేశారు.



## వేదవిద్యార్థులకు వస్త్రాలు పంపిణీ

తిరుమల, నవంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల ధర్మగిరిలోని వేదవిజ్ఞానం పీఠంలో వేదవిద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి వస్త్రాలను పంపిణీ చేశారు. శుక్రవారం పాఠశాల ప్రాంగణంలో టిటిడి ఆలయ డిప్యూటీ ఇఒ ఎం.లోకనాథం, వేదవిజ్ఞానపీఠం ప్రిన్సిపాల్ కుప్పా శివసుబ్రమణ్య అవధాని, వేదపండితులతో కలసి 380మంది విద్యార్థులకు వస్త్రాలను అందజేశారు. ఒక్కొక్కరికి నాలుగు పంచెలు, దుప్పటి వెంకయ్యచౌదరి పంపిణీ చేశారు.



## తిరుమలేశుని ఆశీస్సులందరిపై కలగాలి


తిరుమల, నవంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి కరుణాకటాక్షాలు, ఆశీస్సులు ప్రజలందరిపై కలగాలని పలువురు ప్రముఖులు ఆకాంక్షించారు. భగవంతుని ఆశీస్సులతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని తెలిపారు. శుక్రవారం ఉదయం నైవేద్య విరామసమయంలో సింగపూర్ హోంమంత్రి షణ్ముగం, మలేషియా ఎంపి గణపతిరావుతో కలసి రాష్ట్ర మంత్రి నారాయణ, బోర్డు సభ్యుడు సుదర్శన్, సినీ కళాకారుడు ఆనందసాయి, నటి వాసుకితో వేర్వేరుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం స్వాగతం పలికారు. ఆలయం లోపల ధ్వజస్తంభానికి నమస్కరించిన వీళ్ళు ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## అలరించిన థాయ్ డ్రామాటిక్ ఆర్ట్స్

తిరుపతి, నవంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నృత్యవాహిని అంతర్జాతీయ సాంస్కృతిక మార్పిడి నృత్య మహోత్సవంలో శుక్రవారం థాయ్ డ్రామాటిక్ ఆర్ట్స్ అందరినీ ఆకట్టుకుంది. థాయ్‌లాండ్‌కు చెందిన ట్రెడిషనల్ ఆర్ట్ ఫార్మ్ ఖోన్ నృత్యం. చియాంగ్ మై రాజ్‌భాట్ యూనివర్సిటీ డాక్టర్ విపడా పెచ్చాట్ సదస్సులో నృత్యం గురించి వివరించారు. ఆమె బృందం కళాకారులు నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. మధ్యాహ్నం గర్బానృత్యం గుజరాత్ ప్రజా నృత్యంపై సదస్సు జరిగింది.


## సిఎం, డిసిఎం బాలల దినోత్సవ శుభాకాంక్షలు



విజయవాడ, నవంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలియజేశారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. చిన్నారుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని సిఎం అన్నారు. కల్మషం లేని మనసులు చిన్నారులకే సొంతమని.. నైతిక విలువలతో కూడిన విద్యను అందించడం తప్పనిసరి అని ఉపముఖ్యమంత్రి పవన్ వెల్లడించారు.

# మాజీ ఎవిఎస్ఒ మృతిలో కుట్ర?

**- ఫిర్యాదిదారుడుకి రక్షణ కల్పించాలంటున్న రాజకీయనేతలు**








తిరుపతి, నవంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: ఏడుకొండలస్వామి కానుకల లెక్కించే పరకామణి నుండి విదేశీ డాలర్లు చోరీ కేసులో కీలక ఫిర్యాదిదారుడు, మాజీ ఏవిఎస్ఒ వై.సతీశ్‌కుమార్ మృతి వెనుక కుట్రదాగి ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరూ ఊహించని రీతిలో ఈ కేసులో విచారణకు వస్తున్న సమయంలో రైల్వేట్రాక్ పక్కన మృతదేహం పడిఉండటం మరిన్ని అనుమానాలకు తావిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీస్ అధికారి, ప్రస్తుతం గుత్తి రైల్వేపోలీస్ సిఐగా పనిచేస్తున్న సతీశ్ కుమార్ మృతిపై సమగ్ర విచారణ జరపాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి డిమాండ్ చేశారు. ఆయన మృతి పెద్దల పాపపు ఆటలో ఓ ఘట్టమేనని అభివర్ణించారు. సతీశ్ మృతి హత్య, అత్మహత్య ప్రజలకు వెల్లడించాలన్నారు. కేసు పూర్వాపురాలు అనేక కుట్రలు, అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ కారణంగానే సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని కోరినట్లు గుర్తుచేశారు. విచారణలో పారదర్శకత పాటించాలని, నిందితులు ఎంతటి వారైనా శిక్షించేటట్లు వ్యవహరించాలని మురళీ సూచించారు. ఇదిలా ఉండగా తిరుమల పరకామణి నిందితుడు రవికుమార్‌కు ప్రాణహాని ఉందని, వెంటనే అతన్ని కస్టడీలోకి తీసుకోవాలని జనసేన నేత కిరణ్ రాయల్ సూచించారు. హైకోర్టు ఆదేశాలతో సిఐడి అధికారులు విచారణ జరుపుతున్న సమయంలో మాజీ ఏవిఎస్ఓ సతీశ్‌కుమార్ అనుమానాస్పద మృతి సంఘటన అనేక అనమానాలకు తావిచ్చిందన్నారు. డిసెంబర్2కి సీల్డుకవర్‌లో దర్యాప్తు అంశాలను సమర్పించాల్సి ఉండటంతో సిఐడి అన్ని కోణాల్లో విచారణ చేస్తున్న సమయంలో ఇలా జరగడం, గాయాలతో మృతదేహం ఉండటం, అతనిని ఎవరు హతమార్చారనేది తేల్చాలని, డిజిపి దీనిపై వెంటనే చర్యలు తీసుకుని ప్రజల్లో అనుమానాలను నివృత్తిచేయాలని కిరణ్ రాయల్ తెలిపారు.

ఇదిలా ఉండగా సతీశ్‌కుమార్ మృతిపై ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. సతీశ్ కుమార్‌ను విచారణలో సిఐడి అధికారులు బెదిరించిన కారణంగానే ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. బలవంతంగా తనపేరు చెప్పాలని విచారణ అధికారులు ఒత్తిడి చేశారని, పరకామణి కేసులో వస్తున్న వార్తల వల్ల కలత చెంది మానసికంగా బాదపడి విచారణలో వేధింపుల వల్ల ఆత్మహత్య చేసుకున్నాడని భూమన ఆరోపించారు. ఒక సౌమ్యుడు, నిజాయితీ అధికారి అయిన సతీశ్ తనపై అధికారి సివిఎస్ఒ నంసింహకిశోర్ చెప్పినట్లు కేసు రాజీచేసుకున్నానని విచారణలో వెల్లడించాడన్నారు. అయితే కొందరు విజిలెన్స్ అధికారులు, సిఐడితో సంబంధంలేని ఓ అధికారి సతీశ్‌కుమార్‌ను బూతులుమాట్లాడి బెదిరించడంతోనే ఈ దారుణానికి ఒడిగట్టాడని కరుణాకర్‌రెడ్డి చెప్పడం వెనుక పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ దురుద్దేశ్యంతోనే విచారణ జరగుతోందని మండిపడ్డారు.

కాగా కీలకదశలో ఏవిఎస్ఒ సతీశ్‌కుమార్ మృతిపై అనుమానాలు వీడటం లేదు. హత్య కోణంలో అనంతపురం పోలీసులు విచారణ చేస్తున్నారు. రవికుమార్ ప్రతిపాదనలతో అతని ఆస్తులపై వైసిపి, అప్పటి టిటిడి పెద్దలు ఆసక్తి చూపారు. రవికుమార్‌కు చెందిన కొన్ని ఆస్తులను విరాళంగా టిటిడి తీసుకుంటున్నట్లు అప్పట్లోనే వెల్లడించి 2023 సెప్టెంబర్ 9న లోక్‌అదాలత్‌లో కేసు రాజీ చేయించే వరకు కుట్రదాగి ఉందనేది, ఇప్పుడు మాజీ ఏవిఎస్ఒ సతీశ్ అనుమానాస్పద మృతి వెనుక కుట్ర ఉందనేది వెలుగు చూడనుంది.

### సతీష్ మరణం అనుమానాస్పదం

**- వైసిపి నాయకులు సాకే శైలజానాథ్**

విజయవాడ, నవంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి మాజీ ఎవిఎస్ఒ సతీష్‌కుమార్ మరణం అనుమానాస్పదమని వైసిపి నాయకులు సాకే శైలజానాథ్ ఆరోపించారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పరకామణి కేసులో సతీష్ కుమార్‌ను విచారించిన సిట్ మళ్లీ విచారణకు రావాలని నోటీసు ఇచ్చిందని తెలిపారు. ఇప్పుడు రైల్వేట్రాక్‌పై మృతదేహం కనిపించిందని అన్నారు. సతీష్‌కుమార్ మరణంపై అందరిలోనూ అనుమానాలు ఉన్నాయని, పోలీసుల వేధింపుల వల్లే ప్రాణాలు తీసుకున్నాడన్న వాదనలూ ఉన్నాయని తెలిపారు. సిట్ విచారణలో ఏం జరిగిందో కూడా తేలాల్సి ఉందని పేర్కొన్నారు. సతీష్‌కుమార్ సిట్ విచారణలో తాను ఎలాంటి తప్పు చేయలేదని చెప్పినట్లు ప్రచారం జరుగుతోందన్నారు. అయినా వేధించడం వల్లే బలవన్మరణానికి పాల్పడ్డాడని తిరుపతి ప్రజలు మాట్లాడుకుంటున్నారని అన్నారు. పరకామణిలో డాలర్ల చోరీ కేసులో అప్పటి టిటిడి ఛైర్మన్ భూమనను లాగేందుకు కుట్రచేసి సతీష్‌పై తీవ్ర ఒత్తిడి చేసినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. అందువల్లే సతీష్‌కుమార్ మరణం అనుమానాస్పదమని, వీటికి ప్రభుత్వమే సమా ధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టిటిడిని రాజకీయ కేంద్రంగా మార్చారని విమర్శించారు.

## పరకామణి కేసు రాజీలో సూత్రధారులెవరు?

**సిఐడి దృష్టి ఇక కీలక వ్యక్తులపైనే!**

తిరుపతి, నవంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల పరకామణి భవనంలో 2023 ఏప్రిల్‌లో జరిగిన విదేశీ కరెన్సీ చోరీ కేసు వ్యవహారంలో తదనంతరం పరిణామాలపై విచారణ చేపట్టిన సిఐడి అధికారులు అసలు సూత్రధారులెవరనేది గుర్తించే విషయంలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే ఈ కేసులో కుట్రదారులు ఎవరనేది దాదాపుగా సిఐడి నిగ్గుతేల్చేసింది. గత వారం రోజులుపైగానే తిరుపతి పద్మావతి విశ్రాంతి గృహంలో సిఐడి చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలోని బృందం పూర్తిగా శుక్రవారం అనుమానాస్పదంగా మృతి చెందిన మాజీ ఏవిఎస్ఒ సతీశ్‌కుమార్, మరో ఇద్దరు సిఐలు, ఇద్దరు విజిఒలు, ఓ ఎస్ఐని, పరకామణి డిప్యూటీ ఇఒ, సూపరింటెండెంట్, ఆ రోజు విధుల్లో ఉన్న ఉద్యోగులను విచారణ చేసి ఆధారాలు రాబట్టారు. ఇప్పుడు కీలక ఫిర్యాదిదారుడు మృతితో తదుపరి గత టిటిడి మాజీ సివిఎస్ఒ నరసింహకిశోర్‌ను, టిటిడి మాజీ అధికారిని, మాజీ ఛైర్మన్‌ను కూడా విచారణ చేపట్టేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. శుక్రవారం రెండవసారి సిఐ జగన్మోహన్‌రెడ్డిని, చంద్రశేఖర్, మాజీ విజిఒ బాలిరెడ్డిని, ఎస్ఐని అన్ని కోణాల్లో విచారణ చేసి వివరాలు రాబట్టారు. గత బోర్డులోని పెద్దలు, టిటిడి అధికారి ఆదేశాలతోనే ఇలా చేయాల్సి వచ్చిందని క్లైమాక్స్‌లో వెల్లడించారనేది సమాచారం. సిఐడి బృందం అన్ని కోణాల్లో నిందితుడు రవికుమార్‌ను, అతని కుటుంబసభ్యులను, గత పోలీస్ అధికారులును విచారణ చేసింది. శ్రీవారి కానుకగా రూ.14 కోట్ల విలువైన ఆస్తులను రవికుమార్ నుండి టిటిడికి విరాళంగా ఇప్పించాలని ఎందుకు అనుకున్నారు. ఎవరు ఆదేశించారనేది ఇప్పుడు కీలకంగా విచారణలో రానుంది. ఇదే కేసులో పిల్‌ను, పిటిషన్‌ను ప్రదాన న్యాయమూర్తి బెంచ్ విచారణ చేయనుండటంతో జరగబోయే పరిణామాలు ఎలా ఉంటాయనేది ఆందోళనకరంగా మారింది.

## ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అడ్డుకున్న గ్రామస్తులు

పెద్దపంజాణి, నవంబరు 14 ప్రభాతవార్త: కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలను అటవీ అధికారుల సమాచారంతో గ్రామసు_్తలు అడ్డుకున్న సంఘటన శుక్రవారం వేకువజామున చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలంలోని అప్పినపల్లిలో చోటుచేసుకుంది. నిందితులు పరారయ్యారు. ఈసంఘటనకు సంబంధించి గుర్తు తెలియని స్మగ్లర్లు కారులో రూ.7 లక్షల విలువ చేసే పది ఎర్రచందనం దుంగలను పులిచెర్ల నుంచి అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్నారు. పోలీసులు, అటవీ అధికారులకు సమాచారం రాగా వారు వెంబడించారు. అయితే వాహనాన్ని దుండగులు ఆపకుండా ముందుకు నడపసాగారు. మార్గమధ్యలో ఓ వ్యక్తిని సైతం ఢీ కొట్టబోయారన్నారు. విషయాన్ని పలమనేరు ఎఫ్ఆర్వో నారాయణకు తెలుపగా ఆయనతో పాటు పలమనేరు సిఐ మురళీమోహన్, గంగవరం సిఐ పరశు రాముడుకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అప్పినపల్లి గ్రామస్తులను అప్రమత్తం చేయగా గ్రామస్తులు అడ్డుకోగా స్మగ్లర్లు శంకరరాయలపేట చెరువు కట్ట కింద వాహనాన్ని నిలిపేసి



పరారైనట్లు చెప్పారు. అనంతరం అక్కడకు చేరుకున్న అటవీ అధికారులు ఎర్రచందనం దుంగలను కారుతో సహా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు. ఈ విషయం మండలంలో కలకలం రేకెత్తించింది.

### గ్రామస్తులకు డి.సిఎం పవన్ ప్రశంసలు

అక్రమంగా తరలుతున్న ఎర్రచందనాన్ని పట్టుకున్న అప్పినపల్లి గ్రామస్తులను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన ఎక్స్ ఖాతా వేదికగా అభినందించారు. గ్రామస్తుల చొరవ, ధైర్యాన్ని ప్రశంసించారు. అలాగే అటవీశాఖ అధికారులు, పోలీసులను పవన్ అభినందించారు.

# శతజయంతి ఉత్సవాలకు సర్వం సిద్ధం

- భక్తుల కోసం 300 అదనపు బస్సులు, 165 ప్రత్యేక రైళ్లు
- 5 వేల మంది పోలీసులతో భద్రత: జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

శ్రీ సత్యసాయి జిల్లా, నవంబరు 14 ప్రభాత వార్త ప్రతినిధి: భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను భవ్యంగా, ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం పుట్టపర్తిలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కలెక్టర్ మాట్లాడుతూ పుట్టపర్తికి వచ్చే భక్తుల కోసం రైల్వే స్టేషన్ నుండి ప్రశాంతి నిలయం వరకు ఉచిత బస్సులు ఏర్పాటు చేసి రవాణా సేవలు అందిస్తున్నామన్నారు. అలాగే దాదాపు 300 అదనపు బస్సు సర్వీసులు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని, యాత్రికుల రద్దీని బట్టి బస్సుల సంఖ్యను పెంచనున్నట్లు కలెక్టర్ తెలిపారు రైల్వే శాఖ ద్వారా 165 స్పెషల్ రైళ్లు నడపనున్నట్లు సమాచారం ఉందన్నారు. ప్రశాంతి నిలయం పరిసర ప్రాంతాల్లో యాత్రికుల కోసం విస్తృతంగా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు. ముఖ్యంగా ఫుడ్ కౌంటర్లు, మెడికల్ క్యాంపులు త్రాగునీరు ఏర్పాట్లు, పార్కింగ్ స్థలాల్లో ప్రత్యేక ఫుడ్ కౌంటర్లు, అన్ని పార్కింగ్ ప్రాంతాల్లో రాత్రి వేళ అవసరమైన లైటింగ్ సదుపాయాలు, వృద్ధులు, వికలాంగులకు మినీ బస్సుల ద్వారా ప్రత్యేక రవాణా, మున్సిపాలిటీల ఆధ్వర్యంలో 300 మంది శానిటేషన్ వర్కర్లు, సూపర్వైజర్లు నియమించి పర్యవేక్షణ కొనసాగుతోందని తెలిపారు. ఈ నెల 19 నుండి 23 వరకు ప్రధానమంత్రి, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు సహా అనేక మంది ప్రముఖులు పుట్టపర్తి చేరుకునే అవకాశముందని చెప్పారు. వారి రాకపోకల కోసం ప్రత్యేక మార్గాలు, ప్రత్యేక రవాణా సౌకర్యాలు సిద్ధం చేశామని తెలిపారు.

### 5,000 మంది పోలీసుల నియామకం

పుట్టపర్తి మొత్తం ప్రాంతంలో రద్దీ తగ్గేందుకు, భద్రత బలోపేతం చేసేందుకు 5 వేల మంది పోలీసులు షిఫ్టుల వారీగా విధుల్లో నియమించారని జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. ఏదైనా అత్యవసర పరిస్థితిని వేగంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక యంత్రాంగం సిద్ధం ఉందన్నారు. ఇంటగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ద్వారా 24/7 ప్రకారం పర్యవేక్షణ చేస్తారని, అదేవిధంగా పట్టణం చుట్టుప్రక్కల 250 నిఘా కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. యాత్రికులు ఏదైనా సమాచారానికి లేదా సహాయానికి 1800 233 5598 టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేయవచ్చన్నారు.



కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సూచనలిస్తున్న జిల్లా కలెక్టర్

### ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీ

ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ పుట్టపర్తి పట్టణ పరిధిలోని ఏర్పాట్లను స్వయంగా క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించారు. శుక్రవారం ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్‌ను కలెక్టర్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. రైల్వే స్టేషన్ నుంచి పుట్టపర్తికి ఉచిత బస్సులు ఏర్పాటు, కార్లు, బస్సుల పార్కింగ్, త్రాగునీటి వసతి, ఉచిత వైద్య శిబిరం తదితరాలను పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూమ్ సందర్శించి విధులలో ఉన్న సిబ్బంది నిర్వహిస్తున్న పనిని పరిశీలించి, తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఆర్టీసీ, మున్సిపల్, పంచాయతీ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వెలుగులీనుతున్న పుట్టపర్తి

**నిరంతరాయ కరెంట్ సరఫరానే ఎస్పిడిసిఎల్ లక్ష్యం**



అనంతపురం, నవంబరు 14 ప్రభాతవార్త బ్యూరో: శ్రీసత్యసాయి బాబా జయంతి వేడుకల సందర్భంగా నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేసేందుకు ఎపిఎస్పిడిసిఎల్ నడుం బిగించింది. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే పుట్టపర్తిలో విద్యుత్ వెలుగులను విరజిమ్మేందుకు విద్యుత్ శాఖ ముందస్తు ప్రణాళికతో మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసింది. జయంత్యోత్సవాలు-1 సమయంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతుందని అంచనావేసిన ఎపిఎస్పిడిసిఎల్ అందుకనుగుణంగా విద్యుత్ సబ్‌స్టేషన్, ట్రాన్స్ ఫార్మర్లు, లైన్ల వంటి విద్యుత్ వ్యవస్థను అభివృద్ధి చేసింది. నిరంతరాయ విద్యుత్ సరఫరాను కొనసాగించేందుకు పవర్ బ్యాకప్ సౌకర్యాన్ని కూడా అందుబాటులో ఉంచింది. సరఫరాలో అంతరాయం తలెత్తితే సరఫరా పునరుద్ధరణ కోసం 24 గంటలూ పనిచేసే కంట్రోల్ రూమ్‌లను కూడా ఏర్పాటు చేసింది. శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు(ఎస్ఎస్ఎస్సిటీ) కోసం ప్రత్యేకంగా వెంగలామచెరువు వద్ద 33/11 కెవి సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసింది. లోడ్‌ను సమర్థవంతంగా భరించేందుకు వీలుగా సబ్‌స్టేషన్‌లో 28 ఎంవిఏ పవర్ ట్రాన్స్ ఫార్మర్ను ఏర్పాటు చేశారు. పోలీస్ శాఖ విధులకు ఆటంకం ఏర్పడకుండా పోలీస్ కార్యాలయం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని 100 కెవిఏ నుంచి 160 కెవిఏకి పెంచారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద 100 కెవిఏ ట్రాన్స్ ఫార్మర్, సందీప్ బెల్ వ్యూ లేఅవుట్, వెస్ట్ గేట్, ఇతర పోలీసు వసతి ప్రాంతాల్లో కూడా కొత్త ట్రాన్స్ ఫార్మర్లను, లైన్లను ఏర్పాటు చేయడం జరిగింది.

### రూ. 7.20 కోట్ల వ్యయంతో పుట్టపర్తి విద్యుత్ వ్యవస్థ బలోపేతం

పుట్టపర్తిలో విద్యుత్ సరఫరా పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు వీలుగా ముందస్తు ప్రణాళికను రూపొందించి, కట్టుదిట్టంగా అమలు చేశాం. ఈ ప్రణాళికలో భాగంగానే రూ.7.20 కోట్ల వ్యయంతో పుట్టపర్తి విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేశాం. శ్రీసత్యసాయి బాబా జయంతోత్సవాలకు ముందే కీలక విద్యుత్ పనులను పూర్తి చేశాం. ఈ ఉత్సవాలకు తరలివచ్చే లక్షలాది మంది భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో వుంచుకుని, నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరానే ధ్యేయంగా 150 మంది డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సిబ్బందిని నియమించడంతోపాటు 60 మంది కాంట్రాక్టు సిబ్బందిని సేవలకు అందుబాటులో వుంచాం. ఈ కృషి వినియోగదారుల పట్ల అంచలంచలమైన సంస్థ నిబద్ధతను ప్రతిబింబిస్తుందని గట్టిగా విశ్వసిస్తున్నాం.

– ఎపిఎస్ పిడిసిఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి

## ఏనుగు జాడకై 'డ్రోన్'తో జల్లెడ

కుప్పం, నవంబరు 14 ప్రభాతవార్త: కుప్పం మండలం కూర్మానిపల్లి మల్లకుంట వద్ద రైతు కిట్టప్పను హతమార్చిన ఏనుగు జాడను కనుగొనేందుకు అటవీ అధికారులు సరిహద్దు అటవీ ప్రాంతాన్ని డ్రోన్ సాయంతో జల్లెడ పట్టారు. కుప్పం సరిహద్దుతో పాటు తమిళనాడు అటవీ ప్రాంతంలో సైతం డ్రోన్ ఎగరవేయించారు. అయితే ఏనుగు జాడ తెలియరాలేదు. అయితే ఏనుగు తమిళనాడులోని హోసూరు వైపు వెళ్లి ఉంటుందని అటవీ అధికారులు పేర్కొంటున్నారు. మరలా ఏనుగు తిరిగి ఇటువైపు రాకుండా ఇరు రాష్ట్రాల అటవీ అధికారులు అప్రమత్తమైనట్లు తెలిసింది. ఏనుగును దట్టమైన అటవీ ప్రాంతంలో తరిమేందుకు తమిళనాడు అధికారులతో మాట్లాడినట్లు ఎఫ్ఆర్వో జయశంకర్ తెలిపారు.

## నర్సింగ్ ప్రవేశాల నిబంధనల సవరణ

విజయవాడ, నవంబరు 14 పభాతవార్త ప్రతినిధి: భారత నర్సింగ్ కౌన్సిల్ (ఐఎన్‌సీ) మార్గదర్శకాలకు అనుగుణంటీ అనుగుణంగా ప్రైవేటు నర్సింగ్ కళాశాలల్లో బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాల నిబంధనలను సవరిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 2025-26 నుంచి నీట్ నర్సింగ్ ప్రవేశపెట్టేవరకు ఏపీ నర్సింగ్ సెట్-2025 ర్యాంకు, స్కోరు ఆధారంగా ప్రవేశాలు జరుగుతాయని పేర్కొంది. జనరల్ విద్యార్థులకు 50 పర్సంటైల్, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు 40, జనరల్-పిడబ్ల్యూడీలకు 45, ఎస్సీ, ఎస్టీ, ఎబీసీ క్యాటగిరీలకు చెందిన పిడబ్ల్యూడీలకు 40 పర్సంటైల్‌ను అర్హతగా నిర్ణయించింది. కన్వీనర్ కోటా 60 శాతానికి రిజర్వేషన్ వర్తిస్తుందని, మేనేజ్‌మెంట్ కోటా 40 శాతం వెబ్ కౌన్సెలింగ్ ద్వారా మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తామని పేర్కొంది. ఈ రెండు కోటాల ప్రవేశాలను డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య యూనివర్సిటీ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి, వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తుందని పేర్కొంది. మైనార్టీ కళాశాలల్లో సీట్లు ముందుగా ఆ వర్గం అభ్యర్థులతో నింపాలని, వారు లేకపోతే మెరిట్ ఆధారంగా ఇతరులకు కేటాయించాలని పేర్కొంది. ఎంపిక భాధ్యతను వీసీ నేతృత్వంలోని కమిటీకి అప్పగించింది.

## ఓఎంసీ గనుల సరిహద్దుల నిర్ధారణ కమిటీ పునర్నియామకం

విజయవాడ, నవంబరు 14 పభాతవార్త ప్రతినిధి: ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి చెందిన గనుల హద్దులను క్షేత్రస్థాయిలో ఖరారు చేసేందుకు సుప్రీం కోర్టు ఆదేశాలతో ఏర్పాటు చేసిన కమిటీని పునర్నియమిస్తూ ప్రభుత్వం ఉత్త ర్వులు జారీ చేసింది. తొలుత ఈ కమిటీలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుధాంశు దులియా ఛైర్మన్‌గా, కేంద్ర సాధికార కమిటీ తరపున చంద్రప్రకాశ్ గోయల్, గనుల శాఖ సంయుక్త సంచాలకుడు డి.శ్రీనివాసరావు, అనంతపురం డీఎఫ్ఓ గురుప్రభాకర్, కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ తరపున డాక్టర్ జి.త్రినాథ్‌కుమార్ సభ్యులుగా సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖ సంచాలకుడిని కన్వీనర్‌గా నియమించారు. వీరితో పాటు అనంతపురం కలెక్టర్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖకు చెందిన కర్నూలు ఆర్‌జెడీ, గనుల శాఖ డీడీ కమిటీకి సహకారం అందిస్తానని గతంలో ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొ న్నారు. తాజాగా వీరిని కమిటీ నుంచి తొలగించి, సుప్రీం కోర్టు సూచించిన శాఖ అధికారులనే సభ్యులుగా కొనసాగేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు షురూ!



విజయవాడ, నవంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. విజయవాడలోని ఠాగూర్ లైబ్రరీలో స్థానిక శాసనసభ్యులు బోండా ఉమా మహేశ్వరరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజాభివృద్ధికి వ్యక్తి అభివృద్ధికి పుస్తక పఠనం ఎంతగానో తోడ్పడుతుందని పేర్కొన్నారు ఆధునిక దేవాలయాలు అయిన గ్రంథాలయాల ఆవశ్యకతను ఆధునిక తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా రచయితల సంఘ కార్యదర్శి డాక్టర్ జీవి పూర్ణచంద్ర, కార్పొరేటర్ నేలిబండ్ల బాలస్వామి, చంద్రిక యుపిఎస్సి ట్రైనర్, గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి, సిబ్బంది జి ఉమారాణి, వై.ధనలక్ష్మి, డి.నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ఫణిబాబు, దుర్గమ్మ, సునీత, బ్రైట్ మైండ్స్ అధ్యక్షురాలు స్వాతి పూర్ణిమ, వివిధ స్కూల్స్ విద్యార్థులు తల్లిదండ్రులు ప్రధానోపాధ్యాయులు టీచర్స్ పాల్గొన్నారు.




విసిని సత్కరిస్తున్న దృశ్యం

## విలువలతో కూడిన విద్య విద్యార్థులకు అవసరం

**ద్రవిడ వర్సిటీ వి.సి. ఆచార్య దొరస్వామి**

కుప్పం, నవంబరు 14 ప్రభాతవార్త: ప్రస్తుత తరుణంలో విద్యార్థులకు విలువలతో కూడిన విద్య ఎంతో అవసరం అని ఇందుకు తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలని ద్రవిడ వర్సిటీ వైస్ ఛాన ్సలర్ ఆచార్య ఎం.దొరస్వామి సూచించారు. శు క్రవారం స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో భారత రత్న దివంగత నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి విసి ఆచార్య దొరస్వామి, ఎస్వీ గ్రూప్స్ ఛైర్మన్ బిఎం దయానిధి, డైరెక్టర్ లోహిత కృష్ణ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విసి మాట్లాడుఎతూ నేటి బాలలే రేపటి నవభారత రత్నాలు అని వారి బంగారు భవితకు అందరూ కలసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. పిల్లలు ఇష్టపడి చదవడం అలవర్చుకోవాలన్నారు. చిన్నతనం నుంచే అ ందరితో సోదరభావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విజయవాడ భవానీ దీపంలో అడ్వెంచర్ థ్రిల్ సిటీ

విజయవాడ, నవంబరు 14 పభాతవార్త ప్రతినిధి: విజయవాడ లోని భవానీ ద్వీపంలో 'అడ్వెంచర్ థ్రిల్ సిటీ' ఏర్పాటుకు విశ్వనాథ్ ఎవెన్యూ సంస్థకు పది ఎకరాల భూమి కేటాయింపుతో పాటు రాష్ట్ర పర్యాటక విధానంలో భాగంగా ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు ప్రకటించింది. ఈ నెల 7న రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస ఐపీబీ) సమావేశంలో నిర్ణయించిన మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని పర్యాటక శాఖను ఆదేశించింది. పర్యాటకులను ఆకట్టుకునేలా ప్రాజెక్ట్ ఏర్పాటుకు రూ.51.48 కోట్లు వెచ్చించనున్నారు. దీంతో 250 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించింది.

### తాళ్ళపాలెంలో వినోదాల ఉద్యానం

విజయవాడ, నవంబరు 14 పభాతవార్త ప్రతినిధి: కృష్ణాజిల్లా మచిలీపట్నం వద్ద తాళ్ళపాలెంలో రూ.157.53 కోట్లతో వినోదాల ఉద్యానం, రిసార్ట్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన మైరా బేసైడ్ రిసార్ట్స్‌కు 20 ఎకరాల భూమి కేటాయించడంతో పాటు పలు రాయితీలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాజెక్ట్ ఏర్పాటుతో 380 మందికి ఉపాధి లభించ నుంది. ఈ మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని పర్యాటక సంస్థను ఆదే శిస్తూ, ఆ శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అజయ్‌జైన్ ఉత్తర్వులు జారీ చేశారు.

# మగువ మెచ్చిన పిఛవాయిూ!

ఫ్యాషన్ ఫ్యాషన్

టీనేజీ అమ్మాయిలయినా, పాతికేళ్ల పడుచులయినా పదహారణాల తెలుగుదనం ఉట్టిపడేది లంగాఓణీ కడితేనే కదా! అందుకే అమ్మాయిలు ఇప్పుడు వాటికే ఓటేస్తున్నారు. పెళ్లి కూతుర్ని చేసినప్పుడు, స్నేహితురాలి రిసెప్షన్.. అంటూ వేడుకలకి సంప్రదాయ దుస్తుల్లో సందడి చేస్తున్నారు. ఇంత మది మెచ్చే పరికిణీఓణీ ఎప్పుడూ ఒకే తరహా డిజైన్‌లో ఉంటే ఏం బాగుంటుదనుకున్నారేమో డిజైనర్లు.. సంప్రదాయ దుస్తులకి చారిత్రక కళల్ని జోడిస్తున్నారు. అలా ఇప్పుడు ట్రెండ్ అవుతున్నాయ్ ఈ 'పిఛవాయిూ లంగాఓణీ'లు పిచ్‌వాది.. దాదాపు నాలుగువదల ఏళ్ల చరిత్ర. రాజస్థాన్‌లోని నాథ్‌ద్వారాకి చెందిన ప్రాచీన కళ ఇది.



# దివ్యాంగ విద్యార్థుల కోసం ..

శారీరక, మానసిక రుగ్మత లలో ముందు కెళ్ల కుండా అడ్డు కుంటా యను కుంటారు. చాలామంది. కానీ పట్టుదల, అంకితభావంతో ఈ లోపాల్ని జయించినప్పుడే మనమేంటో నిరూపించుకోగలమంటు న్నారు **డాక్టర్ కిరణ్ కుమారి**. 19 ఏళ్ల వయసులో ఓ అరుదైన ఆరోగ్య సమస్య కారణంగా కంటి చూపును కోల్పోయిన ఆమె జీవితం ఒక్క సారిగా చీకటైంది. అయినా ఆ చీకట్లోనే జీవితాంతం మగ్గాలను కోలేదు. సానుకూల దృక్పథంతో అడుగు ముందుకేసి ఉన్నత చదువులు చదివారు. ప్రస్తుతం పంజాబీ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆమె.. మరోవైపు దివ్యాంగులు, దృష్టిలోపం ఉన్న వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్నారు. ఇలా ఆమె చొరవను గుర్తించిన 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్)' ఇటీవలే ఓ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును ఆమెకు అప్పగించింది. ఇందులో భాగంగా రూ.15 లక్షల గ్రాంట్‌ను కూడా అందించింది. దీంతో ఈ మహిళా ప్రొఫెసర్ కథ నెట్టింట్లో వైరల్‌గా మారింది. ఉన్నట్లుండి కంటి చూపు కోల్పోతే.. ఇక జీవితమే వ్యర్థమను కుంటారు చాలామంది. కానీ కిరణ్ అలా అనుకోలేదు. పంజాబ్‌లోని పటియాలలో పుట్టిపెరిగిన ఆమె చిన్నతనం నుంచి తెలివైన విద్యార్థిని. డాక్టర్ కావాలని, సమాజానికి సేవలందించా లని ఎన్నో కలలుకన్నారు. ఈ లక్ష్యంతోనే ఇంటర్ పూర్తిచేసి మెడికల్ ఎంట్రన్స్ పరీక్ష రాశారు. కానీ పాసవ్వకున్నారు బీఎస్సీ వైద్యుడు ఎంపిక చేయా లని నిర్ణయించు కున్నారు.



**అలా చూపు పోయింది!....** 19 ఏళ్ల వయసులో లుధియానాలోని ఓ కాలేజీలో బీఎస్సీ నర్సింగ్ రెండో సంవత్సరం చదువు తున్న ప్పుడు మెనింజైటిస్ (బ్రెయిన్ ఫీవర్)కి లోనయ్యారు కిరణ్. ఈ సమస్య కారణంగా నేను కంటి చూపు పూర్తిగా కోల్పోయా. ఒకానొక సమయంలో నా జీవితమే ముగిసిందన్నకున్నా. కానీ నా కుటుంబం, స్నేహితులు ప్రోత్సాహంతో ఈ చీకటి దశ నుంచి బయటపడాలని నిర్ణయించుకున్నా. మూడేళ్లు ఉండి స్థానిక పునరావాస పర్యటన.. చూపు లేకపోయినా నా పనులు నేను సొంతంగా చేసుకోవడం, ఎవరి సహాయం లేకుండా నడవడం, బయటికి వెళ్లడం నేర్చుకున్నా. బ్రెయిలీ, టైపింగ్.. వంటి నైపుణ్యాలూ నాకు అక్కడ నేర్పించారు. దీంతో నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. జీవితంలో ఏదైనా సాధించగలననిపించింది. ఆపై 'ఇంగ్లీష్ బ్రెయిలీ స్టెనోగ్రఫీ' ఏడాది కోర్సు పూర్తిచేసి.. స్థానికంగా ఉన్న ఓ ఎడ్యుకేషన్ సెంటర్‌లో 'స్టెనోగ్రఫీ ఇన్‌స్ట్రక్టర్‌గా' చేరారు. అక్కడ అంధ విద్యార్థులకు స్టెనోగ్రఫీ పాఠాలు చెప్పా.. అంటోన్న కిరణ్.. దృష్టి లోపం ఉన్న విద్యార్థుల సంక్షేమం కోసం పలు విద్యా సంస్థలతో కలిసి పనిచేశారు.

**వాళ్ల కోసం.....** ఓ సెంటర్! ఇలా దృష్టిలోపం ఉన్న విద్యార్థుల సంక్షేమం కోసం పాటుపడేదే తనకూ ఉన్నత చదువులు చదవాలన్న ఆలోచన వచ్చిందంటున్నారు కిరణ్. ఆపై అదే విశ్వవిద్యాలయంలో సోషియాల చదివారు. ఇలా పీజీలో ప్రతిభ కనబరిచి యూనివర్సిట లోనే రెండో స్థానంలో నిలిచిన యూజీసీనెట్‌లో అర్హత సాధించి.. పంజాబీ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఇలా ఓ ఉపాధ్యాయురాలుగా అటు విద్యార్థులకు పాఠాలు బోధిస్తూనే.. ఇటు 'దృష్టి లోతుగా అధ్యయనాలు చేసి పీహెచ్‌డి పట్టా కూడా అందుకున్నారు. 'ఓ ప్రొఫెసర్‌గా విద్యార్థులకు పాఠాలు బోధించడమే కాదు.. దివ్యాంగులుదృష్టి లోప విద్యార్థుల సంక్షేమం కోసం యూనివర్సిటీలో ఓ ప్రత్యేక కేంద్రం పంజాబ్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన సలహా బోర్డులో 2018లో సభ నామినేట్ అయినప్పుడు ఈ ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. 2021లో అది వచ్చింది.. అం టోన్న కిరణ్.. ఈ సెంటర్ ద్వారా ఈ యూని వర్సిటీ దివ్యాంగ విద్యార్థుల కోసం పాటుపడు తున్నారు. □

# నీ వెనకే నేనుంటా !



అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, సకల దేవాధిదేవుడు శ్రీమన్నారాయణుడు. జగన్నాథుడైన ఆ మహావిష్ణువు ధరించిన దశావతారాల్లో ప్రతి ఒక్కటీ ప్రత్యేకమే. ఓం నమో నారాయణాయ' అన్న అష్టాక్షరీ మంత్ర పూర్ణ స్వరూపం శ్రీకృష్ణ భగవానుడు. 'కృష్ణస్తు భగవాన్ స్వయమ్' అన్న మహర్షుల హక్కుకు ప్రతిగా శిష్టరక్షకుడిగా, దుష్టశిక్షకుడిగా, ధర్మపరిరక్షకుడిగా ఆయన అవతరించాడు. 'కృష్ణ' అన్న పేరు పరమ పవిత్రమైంది. అతి విశిష్టమైంది. కృష్ణ అన్న పదంలోని 'క' కారం బ్రహ్మ =చకం. 'ఋ'కారం విష్ణు వాచకం. 'ష'కారం శివ వాచకం. 'ణ' కారం ధర్మవాచకం. ఆ పేరులో కల దేవతలూ నిక్షి ప్తమై ఉన్నారు. ఒక్క కృష్ణ నామస్మరణం సర్వదేవతా ప్రార్థనా పుణ్య పాదితమై, ధర్మమార్గ ప్రబోధితమై, సకల పాపహరణమై నిలిచి, తలచిన వారికి ముక్తిని పాదిస్తుంది. తయుగంలో ధ్యానం వల్ల, త్రేతాయుగంలో యజ్ఞం వల్ల, ద్వాపరయుగంలో పూజలు, వ్రతాల వల్ల అదే ఫలితాలన్నీ కలియుగంలో కేవలం హారేరామ హారేరామ రామరామ హారేహరే, హారేకృష్ణ కృష్ణ కృష్ణకృష్ణ హారేహరే అన్న నామమంత్ర స్మరణతో పొందగలుగుతారు. దీన్ని స్వయంగా మ్మదేవుడు నారదుడికి వివరించాడని పురాణ వచనం. హావిష్ణువు మహోన్నత అవతారమైన శ్రీకృష్ణుడు... అసంఖ్యాక రాక్షసుల అరాచకాలను వెంచలేక, ఆ దుష్టుల భారాన్ని మోయలేక, శరణు కోరిన భూదేవి కోరికను మన్నించాడు. మిపై అవతరించాడు. శ్రీముఖ నామ సంవత్సరం, శ్రావణమాసం, బహుళ అష్టమి తిథి, రోహిణీ వృషభ లగ్నంలో జన్మించిన అత్యంత శుభ ముహూర్తం. కంసుడి బారినపడకుండా దేవుణ్ణి గోకులంలో దించాడు వసుదేవుడు. అక్కడ పూతన, శకటాసుర, వృత్రాసుర, ధేనుకాసుర, సురాది ఎందరో రాక్షసులను బాల్యంలోనే సంహారించాడు మాధవుడు. బాలకృష్ణుడిగా, చిలిపి అడిగా, రాధాకృష్ణుడిగా దర్శనమిచ్చాడు. శ్రీకృష్ణ లీలంటే ఇష్టపడని వాళ్లుండరు. కానీ ఆ లీలు వివరించే కథలు కేవలం కాలక్షేపం కోసం కాదు. జ్ఞాన వైరాగ్యాలతో కూడకుని, భక్తి శ్రద్ధలకు నెలవైనవి. అందులో నివృత్తి మార్గం వివరించడం విశేషం. □

# నవ్వుల విందు



ఎదుటి వ్యక్తి ప్రేమగా పలకరించి.. ఓ చిరునవ్వు చిందిస్తే చాలు మనసుకు హాయిగా ఆహ్లాదంగా ఉంటుంది. నవ్వుల గొప్పతనం తెలిసిన పాకశాస్త్ర ప్రవీణులు కేకుల్నీ, కుకీకస్‌నీ స్మైలీలుగా రూపొందించారు. విరబూసిన ఈ నవ్వుల్ని చూస్తే మన ముఖాల్లో వెలుగులు పూయడం ఖాయం. □



**చెలి చిట్కా**

- మాదీఫలకాయ, గోరింటాకు, నారింజలవేరు చెక్కనూరి రాసిన అరికాళ్లమంటలు తగ్గును.
- కాల్చిన అల్లపుముక్కను ఉప్పుతో అద్ది తింటున్న అరుచి తగ్గును.
- కృష్ణతులసి ఆకురసమును కర్కాయలగంధముతీసి (రెండూకలిపి రాయచుండిన తెల్లమచ్చలు పోవును

# చుక్కకూర ప్రయోజనం- 2

ఆరోగ్య భాగ్యం

**జీర్ణక్రియ:** చుక్కకూరలోని అధిక ఫైబర్ తిన్న తర్వాత భోజనం అరుగుదలకి, కడుపుబ్బరానికి మంచిది. ఆహారం తేలికగా జీర్ణమై శరీరానికి ఆరోగ్యానిస్తుంది. నోటిలో అధిక లాలాజలం ఊరేవారికి మంచిది. ఆకలిని కల్గిస్తుంది. వాంతులు, వికారం, ఎసిడిటీ, మొలలు, ఫిస్టులా, నీళ్ళ విరేచనాలు, అల్సర్స్, స్కర్వీ వంటి జీర్ణకోశ సమస్యల్ని వేడిని, మంటని తగ్గిస్తుంది. ఆ రుచిని తొలగించి రుచిని పుట్టిస్తుంది. అనారోగ్యాలతో బాధపడి కోలుకునే వారికిది పథ్యంగా పనిచేస్తుంది. **ఎముకలు :** చుక్క కూరలోని కాల్షియం వల్ల ఎముకలు పటిష్టంగా తయారవుతాయి. ఇది ఎదిగే పిల్లలకి చాలా మంచిది. పిప్పిపళ్ళు రావు. పాలదంతాలు, శాశ్వత దంతాలు వచ్చేటప్పుడు పిల్లలకి మంచిది. ఎత్తు పెరుగుతారు. వయస్సు పెరిగే కొద్దీ వచ్చే సమస్యల్ని కీళ్ళ నొప్పులు మెడ, నడుంనొప్పి, ఎముకల పెళుసుదనాన్ని తగ్గించి ఆస్టియొపోరోసిస్ వ్యాధి రాకుండా కాపాడుతుంది. **గుండె:** చుక్కకూరలోని పాలీఫినాల్స్ వల్ల గుండెలో బ్లాక్స్ రాకుండా చేస్తుంది. రక్తనాళాల్లో క్రొవ్వు పేరుకోకుండా బి.పి.ని కంట్రోల్ చేస్తుంది రక్త నాళాల్లో నైట్రిక్ ఆక్సైడ్ సెల్ బాగా పెరిగేటట్లు చేస్తుంది. దీని వల్ల రక్తనాళాలు వ్యాకోచం చెందుతాయి. హార్ట్‌ఎటాక్, స్ట్రోక్ పక్షవాతం, గుండె జబ్బులు రావు. రక్తప్రసరణ మెరుగవుతుంది. ఎనర్జీ లెవల్స్ పెరుగుతాయి. **జుట్టు:** జుట్టు రాలడం, చుండ్రు, తెల్లవెంట్రుకలు రావడం వంటి సమస్యలు రాకుండా జుట్టు ఒత్తుగా పెరుగుతుంది. స్కాల్ప్‌కి మంచిది. కేశ సౌందర్యం మెరుగుపడుతుంది. **చర్మం :** చుక్కకూరలోని విటమిన్ ఎ,సి వల్ల గజ్జి, తామర, పొక్కులు, గుల్లలు, పుండ్లు, చర్మసమస్యలు తగ్గిపోతాయి. గాయాలు, పుండ్లపై చుక్కాకు రసం రాస్తే త్వరగా మానుతుంది. **ఇమ్యూనిటీ :** చుక్కకూలోని విటమిన్ సి, ఆంటీ ఆక్సిడెంట్స్ వల్ల తరుచు రోగాల బారిన పడకుండా చేస్తుంది. జ్వరాల ఎలర్జీలు, వైరల్ ఇన్ఫెక్షన్స్ రావు. వాపులు తగ్గుతాయి. **ఔకేన్సర్‌లు:** చుక్కకూరలోని ఆంటి కేన్సర్ గుణం వల్ల శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ని తగ్గించి రొమ్ము కేన్సర్, సర్విక్స్ కేన్సర్, మలాశయ కేన్సర్, రెక్టల్ కేన్సర్‌ల్ని తగ్గిస్తాయి.

**స్త్రీలు:** బహిష్టు సమస్యలని అధిక రక్తస్రావాన్ని

**స్త్రీలు:** బహిష్టు సమస్యలని అధిక రక్తస్రావాన్ని నిరోధిస్తుంది. రక్తహీనత లేకుండా చేస్తుంది. ఇది గర్భిణీలకి, బాలంతలకి మంచిది. బాలింతలకి పాలు పడతాయి. **పురుషులు :** చుక్కకూరలోని జింక్, విటమిన్ వల్ల వీర్యవృద్ధి, వీర్యకణాల చలనం, లైంగిక సామర్థ్యం పెరుగుతుంది. సంతానలేమి ఉన్న వారు దీన్ని వాడడం మంచిది. **కన్ను :** చుక్క కూరలోని ఎ విటమిన్ వల్ల రేచీకటి, దృష్టిలోపాలు తగ్గుతాయి. కంటిచూపు మెరుగవుతుంది. ఎదిగే పిల్లలకి చుక్కకూరని ఇవ్వడం వల్ల కంటి అద్దాలు వాడనవసం లేదు. **యూరిన్ :** మూత్రంలో మంట, నొప్పి, చీము రావడాన్ని తగ్గించి మూత్ర విసర్జన సాఫీగా జారీ అయ్యేలా చేస్తుంది. మూత్రమార్గంలో ఏర్పడు ఇన్ఫెక్షన్స్‌ని తగ్గిస్తుంది. డయాబెటిస్: రక్తంలో చక్కెరస్థాయిల్ని తగ్గించి డయాబెటిస్‌ని కంట్రోల్ ఉంచుతుంది. శంకకీర భాగాలకి ఆక్సిజన్ సరఫరా బాగా జరిగేలా చేసి అదనపు క్రొవ్వు, బరువుని తగ్గిస్తుంది. □



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

# 'బైకర్' సాంగ్ రిలీజ్



చార్మింగ్ స్టార్ శర్వా, మాళవిక నాయర్, అభిలాష్ రెడ్డి కంకర, యువి క్రియేషన్స్ 'బైకర్' నుంచి ప్రెట్టీ బేబీ సాంగ్ రిలీజ్‌చార్మింగ్ స్టార్ శర్వా తన అప్ కమింగ్ మూవీ 'బైకర్' లో మోటార్‌సైకిల్ రేసర్‌గా ప్రేక్షకులను థ్రిల్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో యువి క్రియేషన్స్ ఈ సినిమాని నిర్మించింది. ఫస్ట్ లుక్, ఫస్ట్ ల్యాప్ గ్లింప్స్‌తో ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేసింది.'ప్రెట్టీ బేబీ' వీడియో సాంగ్ ని రిలీజ్ చేసిన మేకర్స్ బైకర్ మ్యూజిక్ ప్రమోషన్స్ ని కిక్ స్టార్ట్ చేశారు. జిబ్రాన్ ఈ పాటని అదిరిపోయే బీట్స్ తో డ్యాన్సింగ్ నెంబర్‌గా కంపోజ్ చేశారు. ఈ సాంగ్ లో శర్వా, మాళవిక నాయర్ కెమిస్ట్రీ అదిరిపోయింది. 1990, 2000 బ్యాక్ డ్రాప్ లో సాగే"బైకర్" రేసింగ్ యాక్షన్‌తో పాటు ఎమోషనల్, మల్టీ జనరేషనల్ ఫ్యామిలీ డ్రామా. ఈ సినిమాకి సినిమాటోగ్రఫీ జె.యువరాజ్, అనిల్ కుమార్ పి ఎడిటర్. రాజీవన్ ప్రొడక్షన్ డిజైనర్. ఎ పన్నీర్ సెల్వం ఆర్ట్ డైరెక్టర్ గా వ్యవహరిస్తున్నారు, ఎన్ సందీప్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. బైకర్ డిసెంబర్ 6న థియేటర్లలో రిలీజ్ కానుంది.

# "మాస్టర్ సంకల్ప్" ట్రైలర్ లాంచ్



పలు ప్రతిష్టాత్మక అవార్డ్ లు పొందిన చిల్డ్రన్ ఫిలింస్ రూపొందించి దర్శక నిర్మాతగా తెలుగు చిత్ర పరిశ్రమలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు డా. భీమగాని సుధాకర్ గౌడ్. ఆయన శ్రీలక్ష్మి ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్, సంతోష్ ఫిలింస్ బ్యానర్స్ పై ఆదిత్య, క్రియేటివ్ జీనియస్, విక్కీస్ డ్రీమ్, డాక్టర్ గౌతమ్, అభినవ్ వంటి బాలల చిత్రాలను ప్రేక్షకులకు అందించారు. హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ప్రముఖ నటులు శివాజీ రాజా మాస్టర్ సంకల్ప్ చిత్ర ట్రైలర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దర్శక నిర్మాత డా. భీమగాని సుధాకర్ గౌడ్, శ్రీ మిత్ర చౌదరి, పెంచల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగానటుడు శివాజీ రాజా మాట్లాడుతూ పిల్లలు బాగుంటేనే సమాజం బాగుంటుంది. శ్రీ మిత్ర చౌదరి మాట్లాడుతూ ఫిలింమేకర్‌గా సుధాకర్ గౌడ్ గారు కమర్షియల్ సినిమాలు చేసి డబ్బులు సంపాదించుకోవచ్చు. కానీ ఆయన ఒక విద్యావేత్తగా బాలలను దగ్గరగా చూసిన అనుభవంతో వారు అన్ని విధాలా అభివృద్ధి చెందాలని, మంచి పౌరులుగా ఎదగాలని సినిమాల ద్వారా తన వంతు ప్రయత్నం చేస్తున్నారు. అన్నారు.పెంచల్ రెడ్డి మాట్లాడుతూ సుధాకర్ గౌడ్ గారు గతంలో ఆదిత్య, క్రియేటివ్ జీనియస్, విక్కీస్ డ్రీమ్, డాక్టర్ గౌతమ్, అభినవ్ వంటి బాలల చిత్రాలను మనకు అందించారు. ఆయన చేస్తున్న ఆరవ బాలల చిత్రం మాస్టర్ సంకల్ప్ ట్రైలర్ చాలా బాగుంది. యోగ, ధ్యానం వంటి మన ప్రాచీన సాధన మార్గాల ద్వారా పిల్లల్లో మానసిక రుగ్మతలను ఎలా తొలగించవచ్చో ఈ చిత్రం ద్వారా సుధాకర్ గౌడ్ గారు చక్కగా చూపించారు. అన్నారు.

# తెర

## 'కనకం లిరికల్' సాంగ్ రిలీజ్



మెట్రో శిరీష్ , శ్రియ శరణ్ ఏకే పిక్చర్స్ నాన్‌వయోలెన్స్ నుంచి కనకం లిరికల్ సాంగ్ రిలీజ్ మెట్రో శిరీష్ , శ్రియ శరణ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం నాన్‌వయోలెన్స్. ఆనంద కృష్ణన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఏకే పిక్చర్స్ నిర్మిస్తుంది.ఈ సినిమా నుంచి యువన్ శంకర్ రాజా కంపోజ్ చేసిన కనకం సాంగ్ ని రిలీజ్ చేశారు. భాష్య శ్రీ అర్థవంతమైన సాహిత్యంతో అలరించారు. మెట్రో శిరీష్ , శ్రియ శరణ్ ఎనర్జిటిక్ మూవ్స్‌తో ఆకట్టు కున్నారు.ఈ చిత్రంలో బాబీ సింహా, యోగి బాబు, అదితి బాలన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.యువన్ శంకర్ రాజా మ్యూజిక్ అందిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ ఎన్ ఎస్ ఉతయకుమార్, ఎడిటర్ శ్రీకాంత్.నటీనటులు: మెట్రో శిరీష్, బాబీ సింహా, యోగి బాబు, అదితి బాలన్ .

## 'దేవగుడి' రియల్ స్టోరీ

వేడుకలో హీరో శ్రీకాంత్ కంటెంట్‌ను నమ్ముకుని చెబుతున్నా.. 'దేవగుడి'తో సక్సెస్ కొడుతున్నాం నిర్మాత బెల్లం రామకృష్ణా రెడ్డిపుష్యమి ఫిలిం మేకర్స్ బ్యానర్ పై బెల్లం సుధారెడ్డి సమర్పణలో బెల్లం రామకృష్ణా రెడ్డి రచనా, స్వీయ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రం 'దేవగుడి'. ఈ చిత్రానికి లక్ష్మీ కాంత్ కనికే డిఓపిగా పని చేస్తుండగా షేక్ మదీన్, రఘు కుంచె సంగీతాన్ని అందించారు. నాగిరెడ్డి ఎడిటింగ్ బాధ్యతలను నిర్వర్తించారు. అభినవ శౌర్య, నరసింహ, అనుశ్రీ ప్రధాన పాత్రలు పోషించగా పలువురు నటీనటులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు. హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ.. 2013లో రామకృష్ణా రెడ్డి నిర్మాతగా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టారు. ఎంతో ప్యాషన్‌తో ఇండస్ట్రీలోకి వచ్చిన ఆయన ఎక్కడా కాంప్రమైజ్ అవకుండా సినిమాలు నిర్మించి సక్సెస్ అయ్యారు. అప్పట్లో . మీరే డైరెక్షన్ చేయవచ్చు కదా అని అనేవాడిని. వెంటనే డైరెక్టర్‌గా మారారు. ఆయన దర్శకత్వంలో వస్తున్న ఈ 'దేవగుడి' చిత్రం మంచి సక్సెస్ అవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. దర్శకనిర్మాత బెల్లం రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ.. ఈ వేడుకకు వచ్చిన మీడియా మిత్రులకు, బంధుమిత్రులకు ధన్యవాదాలు. 2013లో శ్రీకాంత్‌గారితో పుష్యమి ఫిలిం మేకర్స్ శ్రీకారం చుట్టాము. శ్రీకాంత్‌గారు ఏ నోటితో అన్నారో ఆ రోజు.. భయ్యా నువ్వు డైరెక్టర్ అయిపోవచ్చుగా అన్నీ.. ఆ తర్వాత నేను డైరెక్టర్‌గా మారాను.దృశ్యకావ్యం చేశాను. అప్పుడు కూడా ఆయన అభినందించారు. ఇప్పుడు మళ్లీ మా"దేవగుడి కోసం వచ్చారు. డిసెంబర్ 19న 'దేవగుడి' ఫైర్ ఉంటుంది.



## 'అనంత' టీజర్ లాంచ్



జగపతిబాబు, సుహాసిని ప్రధాన పాత్రల్లో వెటరన్ డైరెక్టర్ సురేష్ కృష్ణ దర్శకత్వంలో రూపొందిన డిఫైన్ ఫిల్మ్ 'అనంత' ఇన్నర్ వ్యూ బ్యానర్ పై గిరీష్ కృష్ణమూర్తి నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఆడియో టీజర్ లాంచ్ ఈవెంట్ చాలా గ్రాండ్‌గా జరిగింది. డైరెక్టర్ సురేష్ కృష్ణ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా నేను సినిమాలు చేస్తున్నాను. ఎంతో మంది ఎన్నో రకాలుగా నన్ను గుర్తిస్తున్నారు. గౌరవిస్తున్నారు. ఇంతకాలం నేను ఏం పొందాను తమ్మారెడ్డి భరద్వాజ్ మాట్లాడుతూ.. సురేష్ కృష్ణ గారు గొప్ప దర్శకులు. సినిమా అంటే ఎంతో ప్రేమ. ఆయన ఎప్పుడూ కూడా వర్క్ చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు అనంత సినిమాతో వస్తున్నారు. సాయి మాధవ్ బుర్ర మాట్లాడుతూ.. సురేష్ కృష్ణగారి వేడుకలో నేను భాగం అవ్వడం చాలా గర్వంగా ఫీల్ అవుతున్నాను. డైరెక్టర్ వీర శంకర్ మాట్లాడుతూ.. సురేష్ కృష్ణ గారు ఐకానిక్ డైరెక్టర్. ఆయన అన్ని భాషల్లో సినిమాలు చేశారు అని అన్నారు.

## "రాజు వెడ్స్ రాంబాయి" అందమైన ప్రేమ కథ - అడివి శేషు

అఖిల్, తేజస్విని జంటగా నటిస్తున్న సినిమా "రాజు వెడ్స్ రాంబాయి". ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్స్ ప్రొడక్షన్ ప్రేక్షకుల ముందుకు తీసు కొస్తోంది. "రాజు వెడ్స్ రాంబాయి" చిత్రాన్ని డా.నాగేశ్వరరావు పూజారి సమర్పణలో డోలాముఖి సుబల్టర్న్ ఫిలింస్, మాన్ సూన్స్ టేల్స్ బ్యానర్స్ పై వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మిస్తున్నారు. సాయిలు కంపాటి దర్శకత్వం వహిస్తున్నారు. నవంబర్ 21న "రాజు వెడ్స్ రాంబాయి" సినిమాను వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై వంశీ నందిపాటి, బన్నీ వాస్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తున్నారు. గురువారం హైదరాబాద్ లో హీరో అడివి శేష్ అతిథిగా ఈ చిత్ర ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి మాట్లాడుతూ రాంబాయి టైటిల్ సాంగ్ ను సోషల్ మీడియాలో ఇండియా వైడ్ టాప్ 2 లో ట్రెండ్ అయ్యేలా చేసిన ప్రేక్షకులు అందరికీ థ్యాంక్స్.నటుడు చైతు జొన్నలగడ్డ మాట్లాడుతూ మా సినిమా ఎలా ఉంటుందో ట్రైలర్ లో చిన్న శాంపిల్ మాత్రమే చూపించాం అన్నారు. నటుడు శివాజీ రాజా మాట్లాడుతూ ఇది చిన్న సినిమా కాదు. ఈ మూవీ వెనక ఈటీవీ విన్, బన్నీ వాస్, వంశీ నందిపాటి లాంటి వాళ్లున్నారు. రాంబాయి నీ మీద నాకు అనే పాట పెద్ద హిట్ అయ్యింది. అన్నారు.నిర్మాత బన్నీ వాస్ మాట్లాడుతూ "రాజు వెడ్స్ రాంబాయి" సినిమాను సపోర్ట్ చేసేందుకు హీరో అడివి శేష్ గారు రావడం సంతోషంగా ఉంది. నిర్మాత రాహుల్ మోపిదేవి మాట్లాడుతూ రకరకాల ప్రేమ కథల్ని మనం తెరపై చూసి మర్చిపోతాం. వాటిలో కొన్ని నిజంగా జరిగినవి కూడా ఉంటాయి. రాజు వెడ్స్ రాంబాయి సినిమా చూస్తే ప్రేమికులు తప్పుల్ని ఎలా సరిదిద్దుకోవాలి, తెలుస్తుంది. డైరెక్టర్ సాయిలు కంపాటి మాట్లాడుతూ "రాజు వెడ్స్ రాంబాయి" కథను వేణు అన్న దగ్గరకు తీసుకువెళ్లినప్పుడు స్క్రిప్ట్ కావాల్సిన ఫార్మేట్‌లో లేదు అన్నారు.



# ‘వై నాట్ 300’ స్టార్స్‌కు గుడ్ బై



## సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్రక్షాళన

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2025 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటతో ఫ్యాన్స్ చాలా అప్‌సెట్ అయ్యారు. వైనాట్ 300 అంటూ భారీ అంచనాలతో బరిలోకి దిగిన సన్‌రైజర్స్ ప్లే ఆఫ్స్ కూడా చేరకుండానే ఇంటి దారిపట్టింది. ఇక ప్రస్తుతం వచ్చే 2026 సీజన్ కోసం డిసెంబరులో వేలం జరగనున్న దృష్ట్యా హైదరాబాద్ ఫ్రాంచైజీ దృష్టి పెట్టింది. ఈ నెల 15లోపు రిటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాలను ఫ్రాంచైజీలు ప్రకటించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో తమకు అవసరం లేని ప్లేయర్లను వదులుకునేందుకు వై నాట్ 300 సిద్ధమైంది. సన్‌రైజర్స్ తమకు భారంగా మారిన ఆటగాళ్లను వదిలేయనుంది. ముఖ్యంగా టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ షమీతో పాటు, హెన్రిచ్ క్లాసెన్, అభినవ్ మనోహర్, రాహుల్ చాహర్, ఆడమ్ జంపా తదితరులను వదులుకోవాలని నిర్ణయించింది. షమీని రూ.10 కోట్లు పెట్టి కొన్నప్పటికీ, కనీసం 10 వికెట్లు కూడా తీయలేదు. 9 మ్యాచ్‌లు ఆడి 11.23 ఎకానమీతో 6 వికెట్లు మాత్రమే తీసాడు. రూ.3.20 కోట్లుపెట్టి కొనుగోలు చేసిన రాహుల్ చాహర్ కూడా అంతే. ఇక రూ.2.40 కోట్లకు తీసుకున్న ఆడమ్ జంపా రెండు మ్యాచ్‌లు ఆడేసరికి గాయం బారిన పడి ఇంటికి వెళ్లపోయాడు. అలాగే రూ.3.20 కోట్లు పెట్టి కొనుగోలు చేసిన అభినవ్ మనోహర్ కూడా తీవ్రంగా నిరాశర్చాడు. 8 మ్యాచ్‌ల్లో 12.20 స్ట్రైక్‌రేట్‌తో 61 పరుగులు చేశాడు. ఇక హెన్రిచ్ క్లాసెన్‌ను వదిలించుకోవాలనే దిశగా హైదరాబాద్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం హెన్రిచ్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై చెప్పి కేవలం టి20 లీగ్స్ మాత్రమే ఆడుతున్నాడు. పెద్దగా ఫామ్‌లో కూడా లేడు. దీంతో క్లాసెన్‌ను వదిలేసి రూ.23 కోట్లను అకౌంట్‌లో వేసుకోవాలనే ఉద్దేశంలో సన్‌రైజర్స్ ఉంది. ఒక వేళ మళ్లీ వేలంలో క్లాసెన్‌ను రూ.15 కోట్లకు సొంతం చేసుకున్నా రూ.8 కోట్లు మిగులుతాయి. వీరితో పాటు, వేలంలోకి వదిలేసే జాబితాలో హర్షల్ పటేల్ (రూ.8 కోట్లు), జీషన్ అన్సారీ (రూ.40 లక్షలు), ప్యాట్ కమిన్స్ (రూ.18 కోట్లు), ట్రావిస్ హెడ్ (రూ.14 కోట్లు), అభిషేక్ శర్మ (రూ.14 కోట్లు), నితీష్ కుమార్ రెడ్డి(రూ.6 కోట్లు), హర్షల్ పటేల్ (రూ.8 కోట్లు), ఇషాన్ కిషన్ (రూ.11.25 కోట్లు), సిమర్‌జీత్ సింగ్ (రూ.1.50 కోట్లు), అథర్వ టైడ్ (రూ.30 లక్షలు), జయదేవ్ ఉనాద్కట్ (రూ.1 కోటి), కమిందు మెండిస్ (రూ.75 లక్షలు), అనికేత్ వర్మ (రూ.30 లక్షలు), బ్రైడన్ కార్స్(రూ.కోటి), అనికేత్ వర్మ (రూ.30 లక్షలు), ఇషాన్ మలింగా (రూ.1.20 కోట్లు), సచిన్ బేబీ (రూ.30 లక్షలు) ఉన్నారు.

## ఆసియన్ ఆర్చరీ ఛాంపియన్‌గా అంకిత
### ధీరజ్‌కు పురుషుల రికర్వ్ టైటిల్



**న్యూఢిల్లీ:** భారత్‌కు చెందిన అంకిత భకత్ ఆసియన్ ఆర్చరీ ఛాంపియన్‌గా నిలిచింది. అలాగే ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల రికర్వ్ జట్టు స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. కోసం భారత పురుష ఆర్చర్లు 18 సంవత్సరాల నిరీక్షణకు ముగింపు పలికారు. బంగ్లాదేశ్‌లో శుక్రవారం జరిగిన ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్-2025లో రికర్వ్ ఆర్చరీలో భారతదేశపు తొలి వ్యక్తిగత ఆసియా ఛాంపియన్‌గా అంకితా భకత్ ఢాకాలో చరిత్ర సృష్టించింది. ఆమె ఫైనల్లో పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత దక్షిణ కొరియాకు చెందిన నామ్ సుహ్యోన్‌ను 7-3 తేడాతో ఓడించి, మహిళల రికర్వ్ వ్యక్తిగత స్వర్ణ పతకాన్ని సాధించింది. ఇక కాంస్య పతక పోరులో దీపికా కుమారికి ఇది మరో ఎదురుదెబ్బ, తోటి దేశస్థురాలు సంగీత చేతిలో షూట్‌ఆఫ్‌లో మరో మ్యాచ్ ఓడిపోయింది, దీంతో సంగీత కాంస్య పతకాన్ని సాధించింది. మరోవైపు, పురుషుల రికర్వ్ ఫైనల్‌లో రాహుల్‌ను ఓడించి, ధీరజ్ బొమ్మదేవేరా మొట్టమొదటి పురుష రికర్వ్ వ్యక్తిగత ఆసియా ఛాంపియన్‌గా టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఇక పురుషుల రికర్వ్ జట్టు దక్షిణ కొరియాపై చారిత్రాత్మక విజయం సాధించి బంగారు పతకాన్ని గెలుచుకుంది. యశ్‌దీప్ భోగే, అతాను దాస్‌చ రాహుల్ త్రయం షూటాఫ్‌లో టాప్ సీడ్ దక్షిణ కొరియాను 54 తేడాతో ఓడించి, భారత్‌కు 18 ఏళ్ల పురుషుల రికర్వ్ టీమ్ స్వర్ణ పతక కరువును అధిగమించింది..

## 159కే కుప్పకూలిన సౌతాఫ్రికా
### తొలి రోజు 37 రన్స్‌తో టీమిండియా



**న్యూఢిల్లీ:** రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా తొలి రోజు సౌతాఫ్రికా స్వల్ప స్కోరుకే ఆలౌటైంది. భారత బౌలర్ల దెబ్బకు 159 పరుగులకు సౌతాఫ్రికా కుప్పకూలింది. ఇక తొలి రోజు ముగిసే సమయానికి టీమిండియా ఒక వికెట్ నష్టపోయి 37 పరుగులు చేసింది. కోల్‌కతా వేదికగా తొలి టెస్ట్ మొదటి రోజు శుక్రవారం భారత్ బౌలర్లు చెలరేగడంతో సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో స్వల్ప స్కోరుకే పరిమితమైంది. టాస్ గెలిచిన బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికాకు ఓపెనర్లు ఎయిడెన్ మార్క్‌రమ్, ర్యాన్ రికెల్టర్ వన్డే తరహా బ్యాటింగ్‌తో దూకుడుగా ఆడటంతో తొలి వికెట్‌కు 57 పరుగులు జోడించింది. క్రీజులో సెట్ అయిన ఈజోడీని జస్‌ప్రీత్ బుమ్రా విడదీసాడు. ర్యాన్ రికెల్టన్‌ను క్లీన్ బౌల్డ్ చేయగా, మరుసటి ఓవర్‌లో మార్క్‌రమ్‌ను కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. కెప్టెన్ టెంబా బవుమా(3)ను కుల్దీప్ యాదవ్ పెవిలియన్ చేర్చగా, టోనీ డీ జోర్జితో కలిసి వియాన్ మల్డర్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేశాడు. దాంతో సౌతాఫ్రికా 105/3 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో వియాన్ మల్డర్‌ను కుల్దీప్ యాదవ్ బోల్తా కొట్టించడంతో 4 వికెట్‌కు నమోదైన 43 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. కైల్ వెర్రెన్(16), మార్కో జాన్సెన్(0)లను సిరాజ్ ఒకే ఓవర్‌లో ఔట్ చేయడంతో సౌతాఫ్రికాకు కోలుకోలేని దెబ్బ తగిలింది. కార్బిన్ బోచ్(5)ను అక్షర్ పటేల్ వికెట్ల ముందు బోల్తా కొట్టించగా సౌతాఫ్రికా 154/8తో టీ బ్రేక్ వెళ్లింది. మూడో సెషన్ తొలుతే 3 బంతుల వ్యవధిలో సిమన్ హార్మర్(5), కేశవ్ మహారాజ్(0)లను బుమ్రా ఔట్ చేసి సౌతాఫ్రికా ఇన్నింగ్స్‌కు తెరదించాడు. దీంతో మార్క్‌రమ్ (31), వియాన్ మల్డర్ (24), ర్యాన్ రికెల్టన్ 23), టోనీ డీ జోర్జి (24) టాప్ స్కోరర్లుగా నిలిచారు. తదుపరి టీమిండియా బ్యాటింగ్‌లో ఎడమచేతివాటం పేసర్ మార్కో జాన్సెన్‌పై ఓపెనర్ చెలరేగడంతో, ప్రారంభంలోనే భారత్ యశస్వి జైస్వాల్‌ను కోల్పోయింది. యశస్వి(12) విఫలమైనా, రాహుల్ 59 బంతుల్లో 2 ఫోర్లతో 13 బ్యాటింగ్), వాషింగ్టన్ సుందర్(38 బంతుల్లో 6 నాటౌట్) క్రీజులోఉన్నారు. సౌతాఫ్రికా బౌలర్లలో మార్కో జాన్సెన్ ఒక వికెట్ తీసాడు.



## అనుపమకు వరల్డ్ స్నూకర్ కిరీటం

**న్యూఢిల్లీ:** ఐబిఎస్ఎఫ్ ప్రపంచ స్నూకర్ కిరీటాన్ని దక్కించుకున్న తొలి భారతీయ మహిళగా అనుపమ రామచంద్రన్ నిలిచింది. దోహాలో శుక్రవారం జరిగిన ఉత్కంఠభరితమైన ఫైనల్లో అనుపమ రామచంద్రన్ 3-2తో హాంకాంగ్‌కు చెందిన ఎన్‌జి ఆన్ యీని ఓడించి భారతదేశపు మొట్టమొదటి మహిళల ఐబిఎస్ఎఫ్ ప్రపంచ స్నూకర్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. మూడుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన ఈమెతో జరిగిన పోటీలో 23 ఏళ్ల అనుపమ ఒత్తిడిలో కూడా ఖచ్చితత్వాన్ని ప్రదర్శించింది. నిర్ణయాత్మక ఫ్రేమ్ 60-61 వద్ద బ్యాలెన్స్ చేయబడినప్పుడు, ఆన్ యీ ఒక బ్లాక్‌ను మిస్ చేసింది. దీంతో ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని అనుపమ చివరి లైఫ్‌లైన్‌ను సాధించింది. ప్రారంభ ఫ్రేమ్‌లో ఓడిపోయిన తర్వాత, ఆమె మ్యాచ్‌ను 1-1తో సమం చేసింది, కానీ త్వరలోనే ఆమె మళ్లీ వెనుకబడి పోయింది. నాల్గవ ఫ్రేమ్‌లో ఆమె 29 బ్రేక్‌తో నిర్ణీత స్కోరు సాధించింది. అనుపమ మూడుసార్లు తనను తాను స్నూకర్ చేసింది. ప్రత్యర్థి అవకాశాలను తిరిగి నియంత్రణలోకి తెచ్చుకుంది. ఆన్ యీ పాట్‌లో ఆకుపచ్చ, గోధుమ, నీలం మరియు గులాబీ రంగులతో 25 పాయింట్లు మిగిలి ఉండగా 61-42తో ఆధిక్యంలో ఉంది. కానీ చివరి బ్లాక్‌లో ఊహించని మిస్ మ్యాచ్‌ను మలుపు తిప్పి అనుపమ చారిత్రాత్మక విజయాన్ని పూర్తి చేసింది. అంతకుముందు జరిగిన సెమీఫైనల్లో అనుపమ 3-1తో స్వదేశీయురాలు కీర్తన పాండియన్‌ను ఓడించగా, ఆన్ యీ హాంకాంగ్‌కు చెందిన సో మాన్ యాన్‌ను 3-0తో ఓడించింది.

## మాస్టర్స్ జపాన్‌లో.. సెమీఫైనల్స్‌కు లక్ష్య



**న్యూఢిల్లీ:** భారత్ షట్లర్ లక్ష్య సేన్ కుమామోటో మాస్టర్స్ జపాన్‌లో సత్తా చాటుతున్నాడు. అతను మాజీ ప్రపంచ ఛాంపియన్ లోహ్ కీన్ యూను వరుస గేమ్‌లలో ఓడించాడు. జపాన్‌లోని కుమా మోటో మాస్టర్స్ సూపర్ 500 టోర్నమెంట్‌లో భారత ఏస్ లక్ష్య సేన్ శుక్రవారం సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. లక్ష్య సింగపూర్‌కు చెందిన మాజీ ప్రపంచ ఛాంపియన్ లోహ్ కీన్ యూను కేవలం 40 నిమిషాల వరుస గేమ్‌లో 21-13, 21-17 తేడాతో ఓడించాడు. రెండు నెలల తర్వాత అతడు టూర్‌లో తన తొలి సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. లక్ష్య ఈ మ్యాచ్ ప్రారంభంలో ఆధిపత్యం చెలాయించాడు. తన దూకుడు ఆటతో ర్యాలీలను శాసిస్తూ ప్రారంభ ఆటను 21-13తో సునాయాసంగా ముగించాడు. కానీ రెండవ గేమ్ ఆట మధ్యలో విరామం కావడానికి ముందు స్కోర్లు 9-9తో సమమయ్యాయి. ఆ తర్వాత అతడు వరుసగా 6 పాయింట్లు గెలుచుకుని భారీ ఆధిక్యాన్ని సంపాదించాడు. అయితే, లోహ్ తన ఆశలను కోల్పోకుండా, కొన్ని కఠినమైన పాయింట్లను సాధించి 17-18 వద్ద లోటును ఒకే పాయింట్‌కు తగ్గించాడు. కానీ ఆ తర్వాత లక్ష్య మళ్లీ ఊపును మార్చుకుని చివరి మూడు పాయింట్లను లాక్కొని మ్యాచ్‌ను గెలిచాడు. ప్రస్తుతం వరల్డ్ టూర్ ర్యాంకింగ్స్‌లో 13వస్థానంలో ఉన్న లక్ష్య ఈ ఫలితంద్వారా కొన్ని స్థానాలు ఎదగడానికి సహాయ పడుతుంది. లక్ష్య 3-2 తేడాతో హెడ్ టు హెడ్ ఆధిక్యంలో ఉన్నాడు. కాగా తదుపరి ఈ నెల 15న జరిగే సెమీఫైనల్‌లో హోమ్ ఫేవరెట్ కెంటా నిషిమోటోతో తలపడతాడు, ఇది ఇద్దరు ఆటగాళ్ల మధ్య ఆరవ సమావేశం అవుతుంది.

# ఈక్విటీ సూచీలకు బీహార్ ఎన్నికల జోష్

## లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబయి, నవంబరు 14:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘనవిజయం సాధించడంతో ఈక్విటీ సూచీలు లాభాలతో ముగిశాయి. ఓట్ల లెక్కింపు రోజంతా కొనసాగడంతో, సూచీలు తీవ్రమైన ఒడుదొడుకులకు లోనయ్యాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 84.11 పాయింట్లు లాభపడి 84,562.78 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 30.90 పాయింట్లు పెరిగి 25,910.05 వద్ద ముగిసింది. ఉదయం ట్రేడింగ్ ప్రారంభమైనప్పుడు, బీహార్ ఎన్నికల ఫలితాలపై నెలకొన్న అనిశ్చితితో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ముందురోజు ముగింపు 84,478.67తో పోలిస్తే, సెన్సెక్స్ 84,060.14 వద్ద నష్టాలతో మొదలై, ఒక దశలో 400 పాయింట్లకు పైగా పడిపోయింది. ఎన్డీఏ భారీ మెజారిటీ సాధిస్తుందన్న అంచనాలు బలపడటంతో మార్కెట్లలో సానుకూల వాతావరణం ఏర్పడింది. రోజు కనిష్ఠ స్థాయి నుంచి సూచీ ఏకంగా 550 పాయింట్లకు పైగా పుంజుకుని లాభాల్లోకి మళ్లింది. భారత మార్కెట్లు ఈరోజు రోలర్‌కోస్టర్ సెషన్‌ను చవిచూశాయి. బెంచ్‌మార్క్ సూచీ నిఫ్టీ పదునైన కదలికలను ప్రదర్శించింది. మొదటి అర్ధభాగంలో కీలకమైన 26,000 స్థాయిని పరీక్షించినప్పటికీ, ఆ తర్వాత ఒత్తిడికి గురైందని మార్కెట్ నిపుణులు అంచనాలు వేసారు. రాజకీయంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన బీహార్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో రోజంతా మార్కెట్లలో అస్థిరత కొనసాగింది. రంగాలవారీగా చూస్తే మిశ్రమ స్పందన కనిపించింది. ఐటీ, ఆటో రంగాల్లో అమ్మకాల ఒత్తిడి నెలకొనగా, ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. నిఫ్టీ బ్యాంక్ 135 పాయింట్లు, నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ 95 పాయింట్లు, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ 317 పాయింట్లు లాభపడ్డాయి. మరోవైపు, నిఫ్టీ ఐటీ 378 పాయింట్లు, నిఫ్టీ ఆటో 143 పాయింట్లు నష్టపోయాయి. సెన్సెక్స్ షేర్లలో టాటా మోటార్స్, ఎటర్నల్, యాక్సిస్ బ్యాంక్, బీఈఎల్, ట్రెంట్, ఎస్‌బీఐ, సన్ ఫార్మా, బజాజ్ ఫైనాన్స్, అదానీ ఎయిర్‌పోర్ట్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఏషియన్ పెయింట్స్, ఐటీసీ, ఎన్టీపీసీ ప్రధాన లాభాల్లో నిలిచాయి. కాగా, ఇన్ఫోసిస్, టాటా స్టీల్, టాటా మోటార్స్ పీవీ, ఐసీఐసీఐ బ్యాంక్, మారుతీ సుజుకీ, టెక్ మహీంద్రా నష్టాలను చవిచూశాయి. బ్రాడర్ మార్కెట్లలో నిఫ్టీ మిడ్ క్యాప్ 100 ఫ్లాట్‌గా ముగియగా, నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 సూచీ 68 పాయింట్లు లాభపడింది. కరెన్సీ మార్కెట్‌లో, డాలర్‌తో రూపాయి మారకం విలువ పరిమిత శ్రేణిలోనే కదలాడింది. డాలర్ ఇండెక్స్ 99.20 వద్ద స్థిరంగా ఉండటంతో రూపాయికి స్పష్టమైన దిశానిర్దేశం లభించలేదు. అమెరికాలో షట్‌డౌన్ కారణంగా కీలక డేటా విడుదల కాకపోవడం, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల మిశ్రమ కార్యకలాపాలు, దేశీయ సంస్థల నిరంతర కొనుగోళ్ల కారణంగా రూపాయి ఒకేశ్రేణిలో కదలాడింది. ముడిచమురు ధరలు మళ్లీ పుంజుకుంటున్నాయి. డబ్ల్యూటీఐ ధర 60 డాలర్లపైన నిలదొక్కుకుంటే, రానున్న రోజుల్లో రూపాయిపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం రూపాయి 88.45-88.95 శ్రేణిలో కదలాడొచ్చని ఎల్‌కేపీ సెక్యూరిటీస్‌కు చెందిన జతిన్ త్రివేది విశ్లేషించారు.



## టోల్‌ప్లాజా రోడ్డు కేసులో అనిల్ అంబానికి మరోసారి ఇడి సమన్లు

**న్యూఢిల్లీ,నవంబరు 14:** ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు రిలయన్స్‌గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానికి మరోసారి సమన్లు జారీచేసారు. ఈనెల 17వ తేదీ ఫెమా కేసుకు సంబంధించి మళ్లీ ఈడీ అధికారులముందు హాజరుకావాలని ఆదేశించారు. వాస్తవానికి శుక్రవారం ఆయన హాజరుకావాల్సి ఉండగా ఈడీ కార్యాలయానికి వెళ్లలేకపోయారు. అయితే వర్చువల్‌గా వాంగ్మూలం ఇస్తామన్న అనిల్ అభ్యర్థనను ఈడీ తిరస్కరించింది. 66 ఏళ్ల అనిల్ అంబాని ఈడీ దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని చెపుతున్నారు. విదేశీ కరెన్సీ నిర్వహణ చట్టం పరిధిలో ఆయన నిధులు దుర్వినియోగం చేసారన్న అభియోగాలు ఎదుర్కొంటున్నారు. జైపూర్ రీన్‌గస్ హైవేప్రాజెక్టుకు సంబంధించి ఈ దర్యాప్తు సాగుతోంది. అంతకుముందు ఈడి ఈకేసులో 7500 కోట్ల విలువైన అనిల్ అంబాని ఆస్తులును జప్తుచేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టంపరిదిలోజప్తుచేసింది. రిలయన్స్ ఇన్‌ఫ్రా ఈ ప్రాజెక్టులో 40 కోట్లు నిధులు బదలాయించిందన్న ఆరోపణలతో ఉంది. నిధులు సూరత్ కేంద్రంగా ఉన్న డొల్లకంపెనీలకు బదలాయించి ఆపై దుబాయికి వెళ్లాయి. ఈ దర్యాప్తులోనే అంతర్జాతీయంగా హవాలా నెట్‌వర్క్ 600 కోట్లకుపైగా మళ్లింపు జరిగిందని ఆరోపణలునానయి. వివిధ వ్యక్తులను అరెస్టు చేసిన ఈడీ వారినుంచి సాక్ష్యాలు సేకరించింది. ఈ ఫెమాకేసు 15 ఏళ్లనాటిది. ఈ అంశం ఒక రోడునడ కాంట్రాక్టరుకు చెందినదిగా తెలుస్తోంది. 2010లో రిలయన్స్ ఇన్‌ఫ్రా ఇపిసి కింద జెఆర్‌టోల్‌రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్టుపొందింది. దేశీయ కాంట్రాక్టు, ఎలాంటి విదేశీ కరెన్సీ నిధులు ఇందులోలేవు. జెఆర్‌టోల్‌రోడ్డు 2021 కే పూర్తి అయింది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాతోనే ఉంది. రిలయన్స్ ఇన్‌ఫ్రాలో అంబాని బోర్డుసభ్యుడు కూడా కాదు. 15 ఏళ్లపాటు కంపెనీలో ఉన్నా ఆయన నాన్‌ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గామాత్రమే ఉన్నారు. 17వేల కోట్ల బ్యాంకు మోసాలకు సంబంధించి ముందు ఒకసారి ఈడీ ముందుకు హాజరయిన సంగతి తెలిసిందే.

## వెయ్యిలోపు ఉత్పత్తులపై ఫ్లిప్‌కార్ట్‌కు జీరో కమిషన్




**ముంబయి, నవంబరు 14:** ఈకామర్స్ రెండో అతిపెద్దసంస్థ ఫ్లిప్‌కార్ట్ సెల్లర్ రేట్‌కార్డ్‌ను సవ రించింది. మరిన్ని ఉత్పత్తులను తమ ప్లాట్ ఫామ్‌పైకి తెచ్చేందుకుగాను వెయ్యి రూపాయల విలువలోపు ఉన్న ఉత్పత్తులకు ఎలాంటి కమిషన్ తీసుకోవడంలేదని ప్రకటించింది. 1000 లోపు ఉత్పత్తులపై జీరోకమిషన్ విధానం అమలుచేస్తామని ఫ్లిప్‌కార్ట్ వెల్లడించింది. అంతేకాకుండా వ్యయ నిర్మాణక్రమాన్ని కూడా మరింత సరళీకృతం చేస్తామని, చిన్న మధ్యతరహా పరిశ్రమలు తమ ఉత్పత్తులను మరిన్ని ఈ ప్లాట్ ఫామ్‌పైకి తెచ్చుకునేదిశగా ఈ ఏర్పాట్లు చేసినట్లు సంస్థ ప్రక టించింది. తన పరిధిలోని షాప్సీ విభాగానికి కూడా ఈ సడలింపులు వర్తిస్తాయని వెల్ల డించింది. అన్ని శ్రేణుల్లోని ధరల ఉత్పత్తులకు వెయ్యిలోపు వాటికి హైపర్ వాల్యూ సెగ్మెంట్‌లో కూడా వీటిని పరిగణన లోనికి తీసుకుని విక్రేతలకు సడలింపులు ఇచ్చినట్లుతేలింది. ఈ విధానం వల్ల ఇటు బయ్య ర్లు, ఇటుఉత్పత్తిదారులకు కూడా ఎంతోమేలు జరుగుతుందని, 30శాతం వరకూ ఆదా అవు తుందని ఫ్లిప్‌కార్ట్ సీనియర్ ఉపాధ్యక్షుడు సాకైత్ చౌదరి తెలిపారు.

## దిగివచ్చిన టోకు ధరల సూచీ, ద్రవ్యోల్బణం



**న్యూఢిల్లీ, నవంబరు 14:** టోకుధరలసూచీ ద్రవ్యోల్బణం అక్టోబరునెలలో మైనస్ 1.21శాతానికి దిగివచ్చింది. ఆహార ఉత్పత్తులు, పప్పుదినుసులు, కూరగాయల ధరలు దిగిరావడంతో ద్రవ్యోల్బణం మొత్తం దిగివచ్చింది. వీటికితోడు తక్కువ ఇంధన ధరలు,తయారీ రంగ ఉత్పత్తులధరలు తగ్గడం కూడా ఇందుకు తోడయింది. టోకుధరలసూచీ ద్రవ్యోల్బణం సెప్టెంబరులో 0.13శాతంగా ఉంది. గత ఏడాది అక్టోబరులో 2.75శాతంగా నమోదయింది. ముడి చమురు, సహజవాయువు, విద్యుత్, ఖనిజ వనరులు నూనెలు, తయారీరంగ బేసిక్ మెటల్స్ వంటి వాటిధరలు భారీగా దిగివచ్చాయి. టోకుధరల సూచీ ప్రకారం ఆహార ఉత్పత్తుల ధరలు అక్టోబరులో 8.31 శాతానికి చేరాయి. సెప్టెం బరులో 5.22శాతం ఉన్నవి అక్టోబరులో పెరిగాయి. ఉల్లిపాయలు, ఆలు గడ్డలు, కూరగాయలు, పప్పుదినుసులు వంటివి కొంత ధరలు తగ్గాయి. కూరగాయలు ధరలు అక్టో బరులో 34.97శాతంగా ఉన్నాయి.

సెప్టెంబరులో 24.41శాతం ఉంటే అక్టోబరులో 34.97శాతం గా ఉన్నాయి. పప్పుదినుసుల పరంగా 16.50 శాతం, ఆలుగడ్డలు, ఉల్లిపాయలపరంగా 39.88శాతం, 65.43శాతంగా ఉన్నాయి. ఇక తయారీ రంగ ఉత్పత్తులపరంగా 1.54శాతానికి దిగివచ్చింది. ఇంధనం విద్యుత్‌ల పరంగాచూస్తే ప్రతికూల ద్రవ్యోల్బణం ఉంది. 2.55 శాతంగా ఉంది. అంతకుముందునెలలో 2.58శాతం ఉంది. జిఎస్టీరేట్ల హేతుబద్ధీకరణ తర్వాతనే ద్రవ్యోల్బణం దిగివస్తోందని చెపుతున్నారు. రిటైల్, టోకు ధరల ద్రవ్యో ల్బణాలు తగ్గడంతో ఇపుడు ఆర్బీఐ వడ్డీరేట్లు తగ్గించాల్సిన తప్పనిసరి పరిస్థితులు అలుముకున్నాయి.


## క్షీణించిన విదేశీ కరెన్సీ ఖజానా

**ముంబయి, నవంబరు 14:** భారత విదేశీకరెన్సీ నిల్వల ఖజానా వరుసగా మూడో వారంలో కూడా స్వల్పంగా క్షీణించింది. 2.699 బిలియన్ డాలర్లు తగ్గి 687.034 బిలియన్ డాలర్లకు చేరింది. ఈనెల ఏడో తేదీతో ముగిసిన వారానికి సంబంధించి ఆర్బీఐ ఫోరెక్స్ నివేదిక విడుదల చేసింది. అంతకుముందు వారంలోనే 5.623 బిలియన్ డాలర్లుక్షీణించి 689.733 బిలియన్ డాలర్లకు చేరింది. ప్రస్తుత వారంలోకూడా అదే



తీరు కనిపించింది. విదేశీ కరెన్సీ ఆస్తుల పరంగా 2.454 బిలియన్ డాలర్లు క్షీణించో 562.137 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. విదేశీ కరెన్సీ ఆస్తుల విలువలంటే విదేశీ కరెన్సీలు యూరో, పౌండ్, యెన్ వంటివి అమెరికా డాలర్లతో మారకం విలువలను గమనిస్తారు. ఇక బంగారం నిల్వలు కూడా 195 మిలియన్ డాలర్లు క్షీణించి 101.531 బిలియన్ డాలర్లకు చేరింది. అలాగే స్పెషల్ డ్రాయింగ్‌రైట్స్(ఎస్‌డిఆర్)కూడా 51 మిలియన్ డాలర్లు క్షీణించి 18.594 బిలియన్ డాలర్లకు చేరింది. ఐఎంఎఫ్‌వద్ద భారత్ రిజర్వు స్థాయి స్థిరంగా 4.772 బిలియన్ డాలర్లవద్దనే కొనసాగిందని ఆర్బీఐ వెల్లడించింది.

## ఇన్ఫీ బైబాక్ రిటైల్ ఇన్వెస్టర్లకు పండగే..




**బెంగళూరు, నవంబరు 14:** దేశంలోని రెండో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ ఇన్ఫోసిస్ ప్రకటించిన రూ. 18,000 కోట్ల షేర్ బైబ్యాక్ రికార్డుతేదీ తేదీ క్రమంలో ఇన్ఫోసిస్ షేరు నష్టాల్లోకి వెళ్లింది. ఇన్ఫీఒక్కో షేరుకు 18 శాతం మేర అధికంగా చెల్లించి రూ.1800చొప్పున కొనుగోలు చేస్తోంది. ఇన్ఫోసిస్ చరిత్రలోనే అతిపెద్ద షేర్ బైబ్యాక్ కావడంతో ఇన్వెస్టర్లు ఎలాంటి వ్యూహాన్ని అనుసరించాలనే దానిపై నిపుణులు కీలక సూచనలు చేశారు. ఇన్ఫోసిస్ బైబ్యాక్ కోసం నవంబర్ 14ను రికార్డ్ తేదీగా నిర్ణయించారు. అంటే టిప్లస్‌వన్ సెటిల్‌మెంట్ నిబంధన ప్రకారం నవంబర్ 13 లోపు కొనుగోలు చేసిన వారికి మాత్రమే ఈ బైబ్యాక్ ఆఫర్‌లో పాల్గొనడానికి అర్హత ఉంటుంది. నవంబర్ 14 లేదా ఆ తర్వాత కొనుగోలు చేసిన షేర్లు బైబ్యాక్‌కు అర్హత ఉండదు. మొత్తం రూ.18,000 కోట్లు విలువైన 10 కోట్ల షేర్లను ఒక్కో షేరుకు రూ. 1,800 చొప్పున వెచ్చించి కొనుగోలు చేస్తోంది. ప్రస్తుత మార్కెట్ ధరపై సుమారు 18 శాతం అధికంగా చెల్లిస్తోంది. ఈ బైబ్యాక్ అనేది టెండర్ ఆఫర్ పద్ధతిలో జరుగుతుంది. అర్హులైన వాటాదారులు తమ షేర్లను కంపెనీకి విక్రయించడానికి అవకాశం ఉంటుంది. బైబ్యాక్ షేర్లలో 15 శాతం రిటైల్ ఇన్వెస్టర్లు అంటే రూ.2 లక్షల కంటే తక్కువ విలువైన షేర్లు ఉన్నవారి కోసం రిజర్వ్ చేశారు. రిటైల్ ఇన్వెస్టర్లలకు యాక్సెప్టెన్సీ నిష్పత్తి, ఇతర కేటగిరీల కంటే ఎక్కువగా ఉంటుంది. ప్రమోటర్ల నాన్‌పార్టిసిపేషన్. నందన్ నీలేకని, నారాయణ మూర్తి, సుధామూర్తి వంటి ప్రమోటర్లు ఈ బైబ్యాక్‌లో పాల్గొనకూడదని నిర్ణయించుకున్నారు. దీని వల్ల కూడా రిటైల్ ఇన్వెస్టర్ల యాక్సెప్టెన్సీ నిష్పత్తి మెరుగ్గా ఉండే అవకాశం ఉంది. బైబ్యాక్ ధర మార్కెట్ ధర కంటే 18 శాతం అధికంగా ఉండటం వలన బైబ్యాక్‌లో అంగీకరించిన షేర్ల వరకు రిటైల్ ఇన్వెస్టర్లకు తక్షణ ప్రీమియం లభిస్తుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.